VELTHURU TELUGU DAILY

# వెలుతురు

తెలుగు దిన పత్రిక

రంగారెడ్డి, నల్గొండ : మంగళవారం 11.08.2026
సంపుటి : 09 సంచిక : 63 , పేజీలు : 12 , వెలరూ . 5/-

SRI SHANTHI PUBLICATIONS PUBLISHED FROM TELANGANA | ANDHRAPRADESH

www.velthuru.com

## భూములకు భూధార్



- ప్రతి అంగుళాన్ని సర్వే చేస్తాం: పొంగులేటి
- ఎల్కతుర్తిలో మంత్రుల పర్యటన
- డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పంపిణీ
- పలు అభివృద్ధి పనులకు శ్రీకారం
- గత పాలకులపై పొంగులేటి విమర్శలు
- రెవెన్యూ కార్యాలయాలకు రూ.600 కోట్ల మంజూరు

2

# మహా వరుణయాగం సంపూర్ణం





- రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ప్రార్థనలు
- నాగార్జునసాగర్‌లో శాస్త్రోక్తంగా వరుణయాగం
- కృష్ణా నది ఒడ్డున వైదిక క్రతువులు
- ముఖ్యమంత్రి దంపతుల చేతుల మీదుగా పూర్ణాహుతి
- 108 మంది రుత్వికులతో 11 హోమగుండాల్లో యాగం
- కృష్ణా, గోదావరి పరీవాహక ప్రాంతాల్లో వర్షాల కోసం ప్రార్థనలు
- ప్రాజెక్టులు, చెరువులు నిండాలని సీఎం ఆకాంక్ష
- రైతుల ముఖాల్లో చిరునవ్వులు చూడాలన్న సంకల్పం

2

## ప్రతి ఇంటి పై జాతీయ జెండా ఎగరేయండి

- హర్ ఘర్ తిరంగా అభియాన్ ను విజయవంతం చేయండి
- కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ పిలుపు
- హైదరాబాద్ లోని తన నివాసంలో జాతీయ జెండాను ఎగరేసిన కేంద్ర మంత్రి

**హైదరాబాద్ వెలుతురు ఆగస్టు 10:**

ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని దేశవ్యాప్తంగా అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'హర్ ఘర్ తిరంగా' అభియాన్ కార్యక్రమాన్ని రాష్ట్రమంతా విజయవంతం చేయాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ పిలుపు ఇచ్చారు. అందులో భాగంగా ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగిరేలా బిజెపి శ్రేణులు కృషి చేయాలని కోరారు.'హర్ ఘర్ తిరంగా అభియాన్' ప్రోగ్రాం పురస్కరించుకుని కేంద్ర మంత్రి బండి సంజయ్ హైదరాబాద్ లోని తన నివాసం వద్ద జాతీయ జెండాను ఎగరవేశారు. అనంతరం పార్లమెంట్ సమావేశాల్లో



2

పాల్గొనేందుకు ఢిల్లీ బయలుదేరి వెళ్లారు.

**ఈ సందర్భంగా మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు.**

దేశవ్యాప్తంగా 'హర్ ఘర్ తిరంగా' అభియాన్ ప్రోగ్రామ్‌లు నేటి నుండి "హర్ ఘర్ తిరంగా అభియాన్"కార్యక్రమం ప్రారంభం కానున్న నేపథ్యంలో 'తిరంగా యాత్ర'లను విజయవంతంగా నిర్వహించాలని పార్టీ శ్రేణులకు కోరారు.

## ట్రైబ్యునళ్ల సంస్కరణల బిల్లుకు లోక్‌సభ ఆమోదం

- ట్రైబ్యునళ్ల నియామకాల్లో పారదర్శకతే లక్ష్యం
- విపక్ష నినాదాల మధ్య బిల్లుకు ఆమోదం
- చర్చ లేకుండానే మూజువాణి ఓటుతో క్లియర్
- జాతీయ ట్రైబ్యునల్స్ కమిషన్ ఏర్పాటుకు ప్రతిపాదన
- నియామకాలు, అర్హతలకు స్పష్టమైన నిబంధనలు
- ట్రైబ్యునళ్ల పనితీరులో సమర్థతకు ప్రాధాన్యం
- 2021 నాటి చట్టం స్థానంలో కొత్త చట్టం

**న్యూఢిల్లీ, వెలుతురు, ఆగస్టు 10:**

దేశంలోని వివిధ ట్రైబ్యునళ్ల నియామక ప్రక్రియతో పాటు వాటి పరిపాలనను మరింత పారదర్శకంగా, స్వతంత్రంగా, సమర్థంగా మార్చే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 'ట్రైబ్యునళ్ల సంస్కరణల బిల్లు-



2026'కు లోక్‌సభ ఆమోదం తెలిపింది. సోమవారం సభలో విపక్ష సభ్యులు వివిధ అంశాలపై నినాదాలు చేస్తున్న సమయంలోనే ఈ బిల్లును ఎలాంటి చర్చ లేకుండా మూజువాణి ఓటుతో ఆమోదించారు. కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘ్వాల్ బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టారు.

### నియామక వ్యవస్థలో మార్పులు

ట్రైబ్యునళ్లకు సభ్యులను నియమించే ప్రక్రియలో ప్రస్తుతం ఉన్న విధానాలను మరింత క్రమబద్ధీకరించడమే బిల్లులో ప్రధాన అంశంగా ప్రభుత్వం పేర్కొంది. నియామకాల్లో పారదర్శకతతో పాటు స్వతంత్రత, ఏకరూపత ఉండేలా కొత్త వ్యవస్థను తీసుకురావాలని కేంద్రం ప్రతిపాదించింది.వివిధ ట్రైబ్యునళ్లకు వేర్వేరు నియమాలు, విధానాలు ఉండటంతో ఏర్పడే సమస్యలకు పరిష్కారం చూపేలా కొత్త చట్టంలో నిబంధనలు రూపొందించినట్లు కేంద్రం తెలిపింది.

▶ మిగతా 2లో

## ప్రతి ఇంటా త్రివర్ణ పతాకం ఎగరేయాలి



2

- బీజేపీ స్టేట్ చీఫ్ రాంచందర్‌రావు
- హర్ ఘర్ తిరంగాతో దేశభక్తి చాటాలి

## రావిర్యాల భూ కేటాయింపులపై మంత్రి శ్రీధర్‌బాబు క్లారిటీ

- సీఎం సోదరుడి కంపెనీకి భూములంటూ ప్రచారం టెస్సెరాక్ట్‌తో రేవంత్ కుటుంబానికి సంబంధం లేదు
- భూ కేటాయింపులు పూర్తిగా నిబంధనల ప్రకారమే CCESDM కమిటీ ఆమోదంతోనే నిర్ణయం



2




## సర్వాయి పాపన్న గౌడ్ ఆశయాలను భావితరాలకు అందించాలి: టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్

**రవీంద్ర భారతి హైదరాబాద్ వెలుతురు ఆగస్టు 10:**

సామాజిక సమానత్వం కోసం పోరాడిన గొప్ప వీరుడు, ధైర్యసాహసాలకు ప్రతీక సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. సర్దార్ సర్వాయి పాపన్న మహారాజ్ ధర్మ పరిపాలన సంస్థ, జై గౌడ్ ఉద్యమం జాతీయ కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో రవీంద్ర భారతి వేదికగా నిర్వహించిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి ఉత్సవాల్లో మహేష్ కుమార్ గౌడ్ పాల్గొని ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు.

▶ మిగతా 11లో

## ఫతేనగర్ ఫలారం బండి ఊరేగింపులో పాల్గొన్న ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్ రావు

**హైదరాబాద్, వెలుతురు ఆగస్టు 10:**

ఫతేనగర్లోని పైపైన్ రోడ్లో గణేష్ టెంపుల్ సమీపంలో నిర్వహించిన ఫలారం బండి ఊరేగింపు కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు శ్రీ హర్కర వేణుగోపాల్ రావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా కార్యక్రమ నిర్వాహకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానికులు శ్రీ హర్కర వేణుగోపాల్ రావు గారికి ఘన స్వాగతం పలికారు. కార్యక్రమం భక్తిశ్రద్ధలతో, ఉత్సాహపూరిత వాతావరణంలో కొనసాగింది.ఈ కార్యక్రమంలో టీపీసీసీ సెక్రటరీ శ్రీ సూరజ్ కుమార్ తివారి, డివిజన్ ప్రెసిడెంట్ శ్రీ క్రాంతి కుమార్ పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



## పాలమూరు-రంగారెడ్డికి జాతీయ హోదా ప్రతిపాదన లేదు: కేంద్రం

- ప్రాజెక్టుకు జాతీయ హోదాపై కేంద్రం స్పష్టత
- సీడబ్ల్యూసీకి వచ్చిన ప్రతిపాదనలు వెనక్కి
- అంతర్రాష్ట్ర జల వివాదాలే ప్రధాన అడ్డంకి



2

## త్వరలో అయోధ్య రామమందిరానికి సీఈవో

- ఈ పోస్టుకు భారీగా దరఖాస్తులు
- ఐదు వేల మందికిపైగా పోటీ
- 20 రోజులుగా కొనసాగిన వడపోత
- 18 మంది అభ్యర్థులకు తుది షార్ట్‌లిస్ట్
- మాజీ అధికారులకూ అవకాశం
- కార్పొరేట్ రంగ నిపుణులపైనా దృష్టి



2

# భూములకు భూధార్

- 180 కార్యాలయాల నిర్మాణం పూర్తి
- భూములకు భూధార్ కల్పిస్తామని వెల్లడి

**ఎల్కతుర్తి, వెలుతురు, ఆగస్టు 10:**

ఎల్కతుర్తిలో మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పొన్నం ప్రభాకర్ పర్యటించారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పంపిణీతో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో భూములకు సంబంధించిన సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని తెలిపారు.గత పాలకులు హడావుడిగా అనేక డివిజన్లు, జిల్లాలు, మండలాలను ఏర్పాటు చేసినప్పటికీ వాటికి అవసరమైన కార్యాలయాలు, మౌలిక వసతులు కల్పించలేదని పొంగులేటి విమర్శించారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పరిపాలనా వ్యవస్థను బలోపేతం చేసేందుకు రూ.600 కోట్లు మంజూరు చేసినట్లు చెప్పారు.రాష్ట్రవ్యాప్తంగా 180 రెవెన్యూ తహసీల్దార్, ఆర్డీవో కార్యాలయాల నిర్మాణాన్ని యుద్ధప్రాతిపదికన చేపట్టి ఏడాదిలోపే పూర్తి చేశామని మంత్రి వెల్లడించారు. ప్రజలకు రెవెన్యూ సేవలు మరింత సులభంగా అందేలా కార్యాలయాలు, మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేస్తున్నామని పేర్కొన్నారు.ధరణి వ్యవస్థను పూర్తిగా ప్రక్షాళన చేసి రైతులకు భూముల విషయంలో భద్రత, భరోసా కల్పించేందుకు భూభారతి కార్యక్రమాన్ని చేపట్టామని పొంగులేటి తెలిపారు. రాష్ట్రంలోని ప్రతి రెవెన్యూ గ్రామంలో ప్రతి అంగుళం భూమిని సర్వే చేయనున్నట్లు చెప్పారు.మనుషులకు ఆధార్ సంఖ్య ఉన్నట్టే భూములకు కూడా ప్రత్యేక గుర్తింపు కల్పించేలా భూధార్ వ్యవస్థను తీసుకొస్తామని మంత్రి వివరించారు. భూముల వివరాలను శాస్త్రీయంగా నమోదు చేసి భవిష్యత్తులో రైతులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా చర్యలు తీసుకుంటామని అన్నారు.రైతుల సహకారంతో భూములకు సంబంధించిన సమస్యలను పరిష్కరించి, యాజమాన్య హక్కులకు పూర్తి భద్రత కల్పిస్తామని పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ౨౹౹౩౪ంలో రెవెన్యూ వ్యవస్థను మరింత పటిష్ఠం చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.

# ప్రతి ఇంటి పై తీయ జెండా ఎగరేయండి

(మొదటి పేజీ తరువాయి)



కుల, మత, వర్గాలకు అతీతంగా ప్రతి భారతీయుడు, విద్యార్థులు పెద్ద ఎత్తున భాగస్వామ్యమై స్వచ్ఛందంగా తమ ఇళ్లపై జాతీయ జెండాను ఎగురవేయాలని పిలుపు నిచ్చారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ దేశంపై తమకున్న భక్తిభావాన్ని చాటుకోవడానికి ఇది సువర్ణావకాశమని పేర్కొన్నారు.స్వాతంత్ర్య దినోత్సవానికి ముందుగా, ఆగస్టు 12 నుంచి 14 వరకు మహాపురుషులు, స్వాతంత్ర్య సమరయోధుల విగ్రహాలను శుద్ధి చేసి, స్మారక చిహ్నాల చుట్టూ ప్రత్యేక పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టాలని శ్రేణులను కోరారు.రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి గ్రామంలో, ప్రతి కూడలిలో తిరంగా ర్యాలీలు, దేశభక్తి ప్రదర్శనలు, ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.కేంద్రంలో మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత, ప్రతి పౌరుడిని మానసికంగా దేశంతో అనుసంధానించే ఒక గొప్ప సామాజిక ఉద్యమంగా ఈ కార్యక్రమం రూపాంతరం చెందిందని, ప్రతి ఏటా ఇది ఘనంగా జరుగుతోందని గుర్తుచేశారు.“మన జాతీయ త్రివర్ణ పతాకం దేశ ప్రజలందరి ఐక్యతకు, సమైక్యతకు, అఖండతకు ప్రతీక. జిల్లాలో దేశభక్తి వాతావరణం పరిమళించేలా ప్రతి కార్యకర్త బాధ్యతాయుతంగా వ్యవహరించి, ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగిరేలా చూసి 'హర్ ఘర్ తిరంగా' అభియాన్‌ను విజయవంతం చేయాలి” అని కోరారు.

# ప్రతి ఇంటా త్రివర్ణ పతాకం ఎగరేయాలి

- స్వాతంత్ర్య సమరయోధులను స్మరించుకోవాలి

**హైదరాబాద్, వెలుతురు, ఆగస్టు 10:**

ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేసి దేశభక్తిని చాటాలని బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు రాంచందర్‌రావు పిలుపునిచ్చారు. ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు నిర్వహిస్తున్న ‘హర్ ఘర్ తిరంగా’ కార్యక్రమంలో భాగంగా సోమవారం తన ఇంటిపై త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసిన ఆయన అనంతరం మీడియాతో మాట్లాడారు.స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని దేశం కోసం ప్రాణత్యాగం చేసిన స్వాతంత్ర్య సమరయోధులను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని రాంచందర్‌రావు అన్నారు. యువతను కూడా ఈ కార్యక్రమంలో భాగస్వాములను చేయాలని సూచించారు. ఎలాంటి రాజకీయ భేదాలు లేకుండా ప్రజలు స్వచ్ఛందంగా తమ ఇళ్లపై జాతీయ జెండాను ఎగురవేయాలని కోరారు.ఆగస్టు 14న హైదరాబాద్ ట్యాంక్‌బండ్ వద్ద భారీ స్థాయిలో ‘తిరంగా యాత్ర’ నిర్వహించనున్నట్లు రాంచందర్‌రావు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో రాజకీయాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.భారతదేశ ఐక్యత, సమగ్రతను చాటడంతో పాటు దేశ ప్రగతికి సంబంధించిన సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడమే తిరంగా యాత్ర ఉద్దేశమని ఆయన తెలిపారు. ‘వికసిత్ భారత్’ సంకల్పంతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.కులం, మతం, రాజకీయ భేదాలను పక్కనపెట్టి దేశం కోసం నిర్వహించే తిరంగా యాత్రలో హైదరాబాద్ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని రాంచందర్‌రావు పిలుపునిచ్చారు. ప్రతి ఇంటా జాతీయ జెండా కనిపించేలా ‘హర్ ఘర్ తిరంగా’ కార్యక్రమాన్ని ప్రజల భాగస్వామ్యంతో విజయవంతం చేయాలని కోరారు.

# పాలమూరు-రంగారెడ్డికి జాతీయ హోదా...

(మొదటి పేజీ తరువాయి)

- కృష్ణా జలాల వినియోగంపై న్యాయ వివాదం
- ప్రస్తుత దశలో మదింపు సాధ్యం కాదన్న కేంద్రం
- రేణుకా చౌదరి ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానం

**న్యూఢిల్లీ, వెలుతురు, ఆగస్టు 10:**

పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి జాతీయ హోదా కల్పించే ప్రతిపాదన ప్రస్తుతం లేదని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన ప్రతిపాదనలు, సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్)ను కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) వెనక్కి పంపినట్లు వెల్లడించింది. ప్రాజెక్టుతో అంతర్రాష్ట్ర జల వివాద అంశాలు ముడిపడి ఉండటమే ఇందుకు ప్రధాన కారణమని పేర్కొంది.కాంగ్రెస్ ఎంపీ రేణుకా చౌదరి రాజ్యసభలో అడిగిన ప్రశ్నకు కేంద్ర జల్‌శక్తి శాఖ సహాయ మంత్రి రాజ్‌భూషణ్ చౌదరి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. ఏదైనా సాగునీటి ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా పరిగణించాలంటే ముందుగా సాంకేతిక పరిశీలన నిర్వహించాల్సి ఉంటుందని తెలిపారు. అనంతరం సంబంధిత సాంకేతిక, ఆర్థిక అంశాలను సమగ్రంగా పరిశీలించాల్సి ఉంటుందని వివరించారు.పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టులో కృష్ణా నదీ జలాల వినియోగం కీలకంగా ఉన్నందున అంతర్రాష్ట్ర జల వివాదాలు ముడిపడి ఉన్నాయని కేంద్రం పేర్కొంది. కృష్ణా జల వివాదాల ట్రైబ్యునల్ పరిధిలోని అంశాలతో ఈ ప్రాజెక్టుకు సంబంధం ఉన్నందున ప్రస్తుతం వ్యవహారం న్యాయస్థానం పరిధిలో ఉందని తెలిపింది.న్యాయస్థానం పరిధిలో ఉన్న అంశాలను పరిష్కరించకుండా ప్రాజెక్టును ప్రస్తుత దశలో సాంకేతిక, ఆర్థిక మదింపునకు తీసుకెళ్లడం సాధ్యం కాదని కేంద్ర మంత్రి స్పష్టం చేశారు. దీంతో పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి జాతీయ హోదా కల్పించే అంశంపై తెలంగాణ ఆశలకు ప్రస్తుతానికి కేంద్రం నుంచి ప్రతికూల సమాధానం వచ్చినట్లయింది.

# మహా వరుణయాగం సంపూర్ణం

**నాగార్జునసాగర్, వెలుతురు, ఆగస్టు 10:**





నాగార్జునసాగర్‌లో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన మహా వరుణయాగం వేదపండితుల మంత్రోచ్ఛారణలు, వైదిక క్రతువుల మధ్య శాస్త్రోక్తంగా పూర్తైంది. విజయ్ విహార్ వద్ద కృష్ణా నది ఒడ్డున నిర్వహించిన ఈ యాగంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దంపతులు పాల్గొని రుత్వికుల మార్గదర్శకత్వంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పూర్ణాహుతి సమర్పించారు.యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ అర్చకులు, వేదపండితుల ఆధ్వర్యంలో 108 మంది రుత్వికులతో 11 హోమగుండాలను ఏర్పాటు చేసి వరుణదేవుడి అనుగ్రహం కోసం వైదిక విధానంలో హోమక్రతువులు నిర్వహించారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దంపతులు కూడా యాగంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి కృష్ణా, గోదావరి నదులు నిండుగా ప్రవహించాలని ఆకాంక్షించారు. శ్రీశైలం, నాగార్జునసాగర్ సహా రాష్ట్రంలోని అన్ని ప్రాజెక్టులు జలకళతో నిండాలని, ప్రతి చెరువు, కుంటలో నీరు సమృద్ధిగా ఉండాలని ప్రార్థించినట్లు తెలిపారు.భూగర్భ జలాలు పెరిగి పంటలు పుష్కలంగా పండాలని, రైతుల ముఖాల్లో చిరునవ్వులు కనిపించాలని సీఎం ఆకాంక్షించారు. తెలంగాణ సస్యశ్యామలంగా, సుభిక్షంగా మారడంతో పాటు ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని వరుణదేవుడిని ప్రార్థించినట్లు చెప్పారు.వర్షాలు, వ్యవసాయం, ప్రకృతి, మానవ జీవితం పరస్పరం ముడిపడి ఉన్నాయని సీఎం పేర్కొన్నారు. ఒకవైపు శాస్త్రీయ అంచనాలు, ఆధునిక ప్రణాళికలతో ప్రభుత్వం ముందుకు సాగుతూనే.. భారతీయ సంస్కృతిలో తరతరాలుగా వస్తున్న యాగాలు, యజ్ఞాలు, పూజా సంప్రదాయాలను గౌరవిస్తూ ఈ వరుణయాగాన్ని నిర్వహించినట్లు తెలిపారు.ఎల్‌నినో ప్రభావంతో ఈసారి రాష్ట్రంలో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందన్న అంచనాల నేపథ్యంలో ఈ యాగాన్ని నిర్వహించినట్లు ప్రభుత్వం తెలిపింది. వర్షాలు సమృద్ధిగా కురిసి సాగునీటి వనరులు నిండితే వ్యవసాయ రంగానికి, రైతాంగానికి ఎంతో మేలు జరుగుతుందని పేర్కొంది.రాష్ట్ర ప్రజల సంక్షేమం, సుభిక్షం, పాడిపంటల అభివృద్ధిని ఆకాంక్షిస్తూ నిర్వహించిన ఈ మహా వరుణయాగం వైదిక క్రతువులు, మంత్రోచ్ఛారణల మధ్య సంపూర్ణమైంది. కార్యక్రమంలో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, పలువురు మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, వేదపండితులు పాల్గొన్నారు.

# రావిర్యాల భూ కేటాయింపులపై మంత్రి శ్రీధర్‌బాబు క్లారిటీ

- ఎలాంటి రహస్య ప్రక్రియ జరగలేదన్న మంత్రి
- ఫేక్ డాక్యుమెంట్లతో తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపణ
- బీఆర్ఎస్, బీజేపీ మైండ్‌గేమ్ ఆడుతున్నాయని విమర్శ
- పెట్టుబడులను అడ్డుకునేందుకే కుట్ర అంటూ ఆరోపణ
- భూ కేటాయింపుల్లో పూర్తి పారదర్శకత ఉందని వెల్లడి
- ప్రభుత్వ ప్రతిష్ట దెబ్బతీసే ప్రచారంపై హెచ్చరిక

**హైదరాబాద్ వెలుతురు ఆగస్టు 10:**

రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం రావిర్యాలలో భూ కేటాయింపుల వ్యవహారం రాజకీయంగా దుమారం రేపుతున్న వేళ మంత్రి శ్రీధర్‌బాబు స్పందించారు. సీఎం రేవంత్‌రెడ్డి సోదరుడికి చెందిన కంపెనీకి తక్కువ ధరకే భూములు కేటాయించారంటూ జరుగుతున్న ప్రచారాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. ఈ వ్యవహారంపై వస్తున్న వార్తల్లో వాస్తవం లేదని స్పష్టం చేశారు.రావిర్యాలలో భూములు పొందిన టెస్సెరాక్ట్ అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు సీఎం రేవంత్‌రెడ్డి సోదరుడితో ఎలాంటి సంబంధం లేదని శ్రీధర్‌బాబు తెలిపారు. సీఎం కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకుని ఫేక్ డాక్యుమెంట్ల ఆధారంగా తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆయన ఆరోపించారు.భూ కేటాయింపు ప్రక్రియ రహస్యంగా జరగలేదని మంత్రి పేర్కొన్నారు. కన్సల్టేటివ్ కమిటీ ఆన్ ఎలక్ట్రానిక్స్ సిస్టమ్ డిజైన్ అండ్ మ్యానుఫ్యాక్చరింగ్ (CCESDM) కమిటీ ఆమోదంతోనే టెస్సెరాక్ట్‌కు భూముల కేటాయింపు జరిగిందని చెప్పారు. నిబంధనలను అనుసరిస్తూ, పూర్తి పారదర్శకతతో ఈ ప్రక్రియను చేపట్టినట్లు వివరించారు.ప్రభుత్వంపై, ముఖ్యమంత్రి కుటుంబంపై అసత్య సమాచారంతో వక్రీకరించిన కథనాలను ప్రచారం చేయడం రాజకీయ దురుద్దేశంతో కూడుకున్నదని శ్రీధర్‌బాబు విమర్శించారు. కేవలం రాజకీయ లబ్ధి కోసం ఇలాంటి ఆరోపణలు చేస్తున్నారని అన్నారు.బీఆర్ఎస్, బీజేపీలు కలిసి రాష్ట్రంలో పెట్టుబడుల వాతావరణాన్ని దెబ్బతీసేందుకు ప్రయత్నిస్తున్నాయని మంత్రి ఆరోపించారు. తెలంగాణకు పరిశ్రమలు, పెట్టుబడులు రాకుండా అడ్డుకోవడమే ఈ ప్రచారం వెనుక ఉద్దేశమని విమర్శించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన భూ వ్యవహారాలపై చర్చ జరగకుండా ప్రజల దృష్టిని మళ్లించేందుకు రాజకీయ డ్రామాకు తెరలేపారని అన్నారు.భూ కేటాయింపుల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం నూటికి నూరు శాతం పారదర్శకతతో వ్యవహరిస్తోందని శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు. ప్రభుత్వ ప్రతిష్ఠను దిగజార్చే విధంగా ఆధారాలు లేని వార్తలను ప్రచారం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు.

# త్వరలో అయోధ్య రామమందిరానికి సీఈవో

- 11, 12 తేదీల్లో కీలక ఇంటర్వ్యూలు
- ముగ్గురి పేర్లు ట్రస్టుకు సిఫార్సు
- సెప్టెంబర్‌లో తుది ఎంపిక
- ఆర్థిక, పరిపాలన బాధ్యతలు కీలకం

**అయోధ్య, వెలుతురు, ఆగస్టు 10:**

అయోధ్య రామమందిరం నిర్వహణలో మరింత వృత్తిపరమైన వ్యవస్థను తీసుకురావడానికి శ్రీ రామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు కీలక నియామకానికి సిద్ధమవుతోంది. ఆలయ పరిపాలనతో పాటు ఆర్థిక వ్యవహారాలను పర్యవేక్షించే తొలి ముఖ్య కార్యనిర్వహణ అధికారి (సీఈవో) ఎంపిక ప్రక్రియ తుది దశకు చేరుకుంది. ఈ పోస్టుకు వచ్చిన ఐదు వేలకుపైగా దరఖాస్తుల్లో 18 మందిని ఎంపిక కమిటీ ఇంటర్వ్యూలకు ఖరారు చేసింది.

సీఈవో ఎంపిక కోసం ఏర్పాటు చేసిన ముగ్గురు సభ్యుల కమిటీ దాదాపు మూడు వారాల పాటు దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించింది. అభ్యర్థుల విద్యార్హతలు, వృత్తిపరమైన అనుభవం, పరిపాలనా సామర్థ్యం, పెద్ద సంస్థలను నిర్వహించిన తీరు వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుంది. అవసరమైన చోట అదనపు వివరాల కోసం కొంతమంది దరఖాస్తుదారులతో ఆన్‌లైన్‌లోనూ మాట్లాడినట్లు కమిటీ సభ్యుడు వెల్లడించారు.

షార్ట్‌లిస్ట్‌లో మాజీ ఉన్నతాధికారులతో పాటు ప్రముఖ సంస్థల్లో కీలక బాధ్యతలు నిర్వహించిన సీనియర్ కార్పొరేట్ ఎగ్జిక్యూటివ్‌లు, వివిధ రంగాల్లో నైపుణ్యం ఉన్నవారు ఉన్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. ఆలయాన్ని సాధారణ సంస్థగా కాకుండా భారీ స్థాయిలో కార్యకలాపాలు నిర్వహించే వ్యవస్థగా పరిగణిస్తూ.. దానికి తగిన నాయకత్వ సామర్థ్యం ఉన్న వ్యక్తి కోసం కమిటీ అన్వేషిస్తోంది.

ఈ ఎంపిక కమిటీకి సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ ప్రమోద్ కోహ్లీ, విశ్రాంత లెఫ్టినెంట్ జనరల్ విష్ణుకాంత్ చతుర్వేది, విశ్రాంత అణు శాస్త్రవేత్త, శిర్డీ శ్రీ సాయిబాబా సంస్థాన్ ట్రస్టు మాజీ ఛైర్‌పర్సన్ సురేశ్ హావారే సభ్యులుగా ఉన్నారు.

వీరే ప్రస్తుతం తుది దశ అభ్యర్థుల సామర్థ్యాన్ని అంచనా వేయనున్నారు.షార్ట్‌లిస్ట్ చేసిన 18 మందికి ఈ నెల 11, 12 తేదీల్లో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. కేవలం గత ఉద్యోగ అనుభవానికే పరిమితం కాకుండా.. అయోధ్యలోనే ఉండి విధులు నిర్వహించేందుకు అభ్యర్థి సిద్ధంగా ఉన్నారా? బాధ్యతలను ఎంతవరకు సమర్థంగా నిర్వర్తించగలరు? అనే అంశాలపైనా కమిటీ దృష్టి సారించనుంది.

సీఈవోగా ఎంపికయ్యే వ్యక్తిపై భారీ బాధ్యతలు ఉండనున్నాయి. ట్రస్టు తీసుకునే నిర్ణయాలను క్షేత్రస్థాయిలో అమలు చేయడం, ఆలయ పరిపాలనను సమన్వయం చేయడం, ఆర్థిక వ్యవహారాలను పర్యవేక్షించడం, రోజువారీ కార్యకలాపాలు సజావుగా జరిగేలా చూడటం వంటివి ఆయన ప్రధాన విధుల్లో ఉండనున్నాయి.

దేశం నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు అయోధ్యకు వస్తున్న నేపథ్యంలో సందర్శకుల నిర్వహణ కూడా సీఈవోకు కీలక బాధ్యత కానుంది. ప్రత్యేక అతిథులు, ప్రముఖులు, మత పెద్దల పర్యటనలను సమన్వయం చేయడంతో పాటు భక్తులతో సమర్థంగా వ్యవహరించే సామర్థ్యం కూడా అభ్యర్థుల్లో ఉండాలని ఎంపిక కమిటీ భావిస్తోంది.

ఆలయానికి వస్తున్న విరాళాలు, ఇతర ఆర్థిక కార్యకలాపాల నిర్వహణలో మరింత పటిష్ఠమైన వ్యవస్థ అవసరమనే నేపథ్యంలో ఈ నియామకానికి ప్రాధాన్యం ఏర్పడింది. పరిపాలన, ఆర్థిక వ్యవహారాల్లో సమన్వయం పెంచడంతో పాటు ట్రస్టు నిర్ణయాలను వేగంగా అమలు చేయడంలో సీఈవో కీలక పాత్ర పోషించనున్నారు.

ఇంటర్వ్యూలు ముగిసిన తర్వాత అత్యుత్తమంగా నిలిచిన ముగ్గురు అభ్యర్థుల పేర్లను ఎంపిక కమిటీ ట్రస్టుకు పంపనుంది. ఆ జాబితాను శ్రీ రామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు పరిశీలించనుంది. సెప్టెంబర్‌లో జరిగే సమావేశంలో ఈ అంశంపై చర్చించి తుది నియామకంపై నిర్ణయం తీసుకోనున్నట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి.

ఐదు వేలకుపైగా దరఖాస్తుల నుంచి 18 మందిని ఎంపిక చేయడం ద్వారా సీఈవో నియామక ప్రక్రియ కీలక దశలోకి ప్రవేశించింది.

ఇంటర్వ్యూల అనంతరం ముగ్గురి పేర్లపై ట్రస్టు నిర్ణయం తీసుకోనుండటంతో.. అయోధ్య రామమందిరం పరిపాలనా వ్యవస్థకు తొలి సీఈవోగా ఎవరు బాధ్యతలు చేపడతారనే అంశంపై ఆసక్తి నెలకొంది.

# ట్రైబ్యునళ్ల సంస్కరణల బిల్లుకు లోక్‌సభ...

(మొదటి పేజీ తరువాయి)

సభ్యుల అర్హతలు, నియామకం, పదవీకాలం, వేతనాలు, తొలగింపు వంటి అంశాలకు స్పష్టమైన చట్టబద్ధమైన విధానం ఉండనుంది.

### జాతీయ ట్రైబ్యునల్స్ కమిషన్

బిల్లు చట్టరూపం దాల్చిన తర్వాత ‘నేషనల్ ట్రైబ్యునల్స్ కమిషన్’ ఏర్పాటుకానుంది. దేశంలోని ట్రైబ్యునళ్ల వ్యవస్థను ఒకే కేంద్ర సంస్థ పరిధిలోకి తీసుకురావడం ద్వారా వాటి నిర్వహణలో మరింత సమన్వయం సాధించాలని ప్రభుత్వం భావిస్తోంది.ఈ కమిషన్‌కు సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి లేదా హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి ఛైర్‌పర్సన్‌గా వ్యవహరించనున్నారు. ఆయనతో పాటు ఇద్దరు న్యాయ రంగ నిపుణులు, ఇద్దరు సాంకేతిక రంగ నిపుణులు సభ్యులుగా ఉండేలా ప్రతిపాదించారు.

### పనితీరుపై ప్రత్యేక దృష్టి

ట్రైబ్యునళ్లు న్యాయస్థానాల మాదిరిగా కీలకమైన కేసులను పరిష్కరిస్తున్న నేపథ్యంలో వాటి పనితీరులో సమర్థత పెంచాల్సిన అవసరం ఉందని కేంద్రం పేర్కొంది. నియామక ప్రక్రియ నుంచి సభ్యుల పదవీకాలం వరకు స్పష్టమైన



నిబంధనలు ఉండటం వల్ల పరిపాలనా సమస్యలు తగ్గుతాయని ప్రభుత్వం భావిస్తోంది.అదేవిధంగా ట్రైబ్యునళ్లకు సంబంధించిన నియామకాలు, అర్హతలు, వేతనాలు, పదవీకాలం, తొలగింపు వంటి అంశాల్లో స్పష్టత తీసుకురావడం ద్వారా భవిష్యత్తులో వివాదాలకు అవకాశం తగ్గుతుందని కేంద్రం చెబుతోంది.

### సుప్రీంకోర్టు ఆదేశాల నేపథ్యంలో

ట్రైబ్యునళ్ల వ్యవస్థకు సంబంధించి సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన పలు ఆదేశాలను దృష్టిలో ఉంచుకుని ఈ బిల్లును రూపొందించినట్లు కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. ట్రైబ్యునళ్ల నియామకాలు, వాటి స్వతంత్రత, పరిపాలనా వ్యవస్థకు సంబంధించి సుప్రీంకోర్టు వ్యక్తం చేసిన అభిప్రాయాలకు అనుగుణంగా కొత్త వ్యవస్థను తీసుకురావాలని ప్రభుత్వం భావిస్తోంది.

### 2021 చట్టం రద్దు

కొత్త బిల్లు చట్టంగా మారిన తర్వాత ప్రస్తుతం అమల్లో ఉన్న 2021 నాటి ట్రైబ్యునళ్ల సంస్కరణల చట్టం రద్దుకానుంది. దాని స్థానంలో కొత్త చట్టం అమల్లోకి వస్తుంది. దీంతో ట్రైబ్యునళ్ల నియామకాలు, పరిపాలన, సభ్యుల సేవా నిబంధనలకు సంబంధించి కొత్త విధానం అమల్లోకి రానుంది. అయితే విపక్ష సభ్యులు వివిధ అంశాలపై ఆందోళన వ్యక్తం చేస్తూ సభలో నినాదాలు చేస్తున్న సమయంలోనే బిల్లుకు ఆమోదం లభించింది. దీంతో బిల్లుపై సమగ్ర చర్చ జరగకుండానే లోక్‌సభ ప్రక్రియ పూర్తయింది. తదుపరి పార్లమెంటరీ ప్రక్రియ పూర్తయి చట్టంగా మారిన తర్వాత కొత్త ట్రైబ్యునల్స్ వ్యవస్థ అమల్లోకి రానుంది.

# పీసీసీ అధ్యక్షులకు అనుబంధంగా పనిచేస్తున్న సురేష్ కుమార్, ప్రసన్న కుమార్ శర్మలను అభినందించిన ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్

- **గాంధీ భవన్‌లో వన్-టు-వన్ కార్యక్రమం**
- **రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాలు, ఎస్ఐఆర్, బీఎల్ఏలపై సమీక్ష**

**హైదరాబాద్, వెలుతురు ఆగస్టు 10:**

తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) అధ్యక్షులు శ్రీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ గారికి అనుబంధంగా పనిచేస్తున్న రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు శ్రీ సురేష్ కుమార్ గారు, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి శ్రీ ప్రసన్న కుమార్ శర్మ గారిని ఏఐసీసీ కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర ఇన్‌చార్జ్ శ్రీ సచిన్ సావంత్ గారు ప్రత్యేకంగా అభినందించారు.గాంధీ భవన్‌లో సోమవారం నిర్వహించిన వన్-టు-వన్ కార్యక్రమంలో భాగంగా శ్రీ సచిన్ సావంత్ గారు రాష్ట్ర కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, ఇతర ముఖ్య నాయకులతో వ్యక్తిగతంగా సమావేశమై పార్టీ కార్యక్రమాలు, సంస్థాగత వ్యవహారాలు, వారికి అప్పగించిన బాధ్యతలపై సమగ్రంగా చర్చించారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు జరిగిన ఈ సమావేశాల్లో నాయకుల పనితీరు, పార్టీ కార్యక్రమాల అమలు, క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేస్తున్న తీరుపై ఆయన వివరాలు తెలుసుకున్నారు.అనంతరం రాష్ట్రంలో కొనసాగుతున్న కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాలు, సంస్థాగత వ్యవహారాలు, ఎస్ఐఆర్ (Special Intensive Revision) ప్రక్రియ, బూత్ స్థాయిలో బీఎల్ఏల (Booth Level Agents) పనితీరు తదితర అంశాలపై శ్రీ సచిన్ సావంత్ గారు సమీక్ష నిర్వహించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజలతో నిరంతరం మమేకమై పనిచేస్తూ, కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాలను క్షేత్రస్థాయికి మరింత విస్తృతంగా తీసుకెళ్లాలని ఆయన సూచించారు.ఈ సందర్భంగా టీపీసీసీ అధ్యక్షులు శ్రీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ గారికి అనుబంధంగా పనిచేస్తున్న రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు శ్రీ సురేష్ కుమార్ గారు, ప్రధాన కార్యదర్శి శ్రీ ప్రసన్న కుమార్ శర్మ గారికి కేటాయించిన కార్యాలయ గదిని కూడా శ్రీ సచిన్ సావంత్ గారు సందర్శించారు. కార్యాలయాన్ని సందర్శించిన సందర్భంగా ఇద్దరు నాయకులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. పీసీసీ అధ్యక్షుల మార్గదర్శకత్వంలో వారు నిర్వహిస్తున్న కార్యక్రమాలు, చేపడుతున్న పార్టీ కార్యకలాపాల గురించి వివరాలను అడిగి తెలుసుకున్నారు.టీపీసీసీ అధ్యక్షులుగా శ్రీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ గారు బాధ్యతలు స్వీకరించిన అనంతరం పీసీసీ కార్యాలయానికి అనుబంధంగా పనిచేస్తున్న శ్రీ సురేష్ కుమార్ గారు, శ్రీ ప్రసన్న కుమార్ శర్మ గారు చేపట్టిన వివిధ పార్టీ కార్యక్రమాలు, సంస్థాగత కార్యకలాపాలు, పార్టీ బలోపేతానికి చేస్తున్న కృషికి సంబంధించిన వివరాలను ఈ సందర్భంగా శ్రీ సచిన్ సావంత్ గారికి అందజేశారు.పీసీసీ కార్యాలయంతో సమన్వయం చేసుకుంటూ పార్టీ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లడం, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో నిరంతరం సమన్వయం కొనసాగించడం, పార్టీ కార్యక్రమాలను విజయవంతం చేయడం, క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు చేపడుతున్న కార్యక్రమాలను వారు ఏఐసీసీ కార్యదర్శి శ్రీ సచిన్ సావంత్ గారి దృష్టికి తీసుకెళ్లారు.శ్రీ సురేష్ కుమార్ గారు, శ్రీ ప్రసన్న కుమార్ శర్మ గారు నిర్వహిస్తున్న కార్యక్రమాలు, వారికి అప్పగించిన బాధ్యతలు, పార్టీ కోసం



చేస్తున్న కృషి గురించి పూర్తి వివరాలు తెలుసుకున్న శ్రీ సచిన్ సావంత్ గారు సంతృప్తి వ్యక్తం చేశారు. వారి పనితీరును ప్రత్యేకంగా అభినందిస్తూ, పార్టీ కోసం ఇదే అంకితభావంతో మరింత ఉత్సాహంగా పనిచేయాలని సూచించారు.ఈ సందర్భంగా రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి శ్రీ ప్రసన్న కుమార్ శర్మ మాట్లాడుతూ, ఏఐసీసీ కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర ఇన్‌చార్జ్ శ్రీ సచిన్ సావంత్ గారు గాంధీ భవన్‌లోని తమ కార్యాలయాన్ని సందర్శించి, తాము నిర్వహిస్తున్న కార్యక్రమాల గురించి వివరాలు అడిగి తెలుసుకోవడం, తమ పనితీరును అభినందించడం ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. ఏఐసీసీ స్థాయి నాయకత్వం తమ పనితీరును గుర్తించి అభినందించడం మరింత బాధ్యతతో పనిచేసేందుకు ప్రోత్సాహాన్ని ఇచ్చిందని అన్నారు.టీపీసీసీ అధ్యక్షులు శ్రీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ గారి మార్గదర్శకత్వంలో శ్రీ సురేష్ కుమార్ గారు, తాను పార్టీ సంస్థాగత బలోపేతానికి, కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాలను క్షేత్రస్థాయికి తీసుకెళ్లేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని శ్రీ ప్రసన్న కుమార్ శర్మ తెలిపారు.పార్టీ నాయకత్వం తమకు అప్పగించిన ప్రతి బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ, ఏఐసీసీ మరియు టీపీసీసీ నాయకత్వం నిర్దేశించే కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేయడం తమ ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలతో సమన్వయంతో పనిచేస్తామని స్పష్టం చేశారు.గాంధీ భవన్‌లో జరిగిన వన్-టు-వన్ సమావేశం ద్వారా రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సంస్థాగత వ్యవహారాలు, క్షేత్రస్థాయి పార్టీ కార్యక్రమాలు, ఎస్ఐఆర్ ప్రక్రియ, బీఎల్ఏల పనితీరుపై సమగ్రంగా చర్చ జరగడం ద్వారా పార్టీని మరింత పటిష్టంగా ముందుకు తీసుకెళ్లేందుకు అవసరమైన దిశానిర్దేశం లభించిందని శ్రీ ప్రసన్న కుమార్ శర్మ తెలిపారు.ఏఐసీసీ కార్యదర్శి శ్రీ సచిన్ సావంత్ గారు తమపై వ్యక్తం చేసిన అభినందనలు మరింత ఉత్సాహంతో, అంకితభావంతో పనిచేయడానికి ప్రేరణగా నిలిచాయని, భవిష్యత్తులో కూడా పీసీసీ అధ్యక్షులు శ్రీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ గారి మార్గదర్శకత్వంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం మరింత సమన్వయంతో పనిచేస్తామని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి శ్రీ ప్రసన్న కుమార్ శర్మ తెలిపారు.

# ఆది శ్రీనివాస్ ఎగిరెగిపడకు పతనమవుతాం

- **ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేశ్ రెడ్డి మండిపాటు**
- **బండి సంజయ్ వ్యాఖ్యల్లో తప్పేముందని ప్రశ్న**
- **రంజాన్‌కు రూ.33 కోట్లు ఇచ్చింది నిజం కాదా?**
- **బోనాలకు రూ.20 కోట్లే ఇచ్చారని ఆరోపణ**
- **హిందూ పండుగలను కాంగ్రెస్ విస్మరిస్తోందని విమర్శ**
- **నిధుల కేటాయింపులపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్**
- **కాంగ్రెస్‌ది మైనారిటీ సంతుష్టీకరణ విధానమని ఆరోపణ**
- **రేవంత్ వ్యాఖ్యలను గుర్తుచేసిన రాకేశ్ రెడ్డి**
- **బండి సంజయ్‌పై విమర్శలు మానుకోవాలని హితవు**
- **హిందూ పండుగలకు జనాభా ప్రాతిపదికన నిధులివ్వాలని డిమాండ్**
- **ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌పై బీజేపీ ఎమ్మెల్యే ఫైర్**

**హైదరాబాద్ వెలుతురు ఆగస్టు 10:**



ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌పై బీజేపీ ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేశ్ రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. బీజేపీ నేత, కేంద్ర మంత్రి బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలను తప్పుబడుతూ ఆది శ్రీనివాస్ చేసిన విమర్శలకు ఆయన ఘాటుగా స్పందించారు. బండి సంజయ్ చెప్పిన విషయాల్లో తప్పేముందని ప్రశ్నించిన రాకేశ్ రెడ్డి.. వాస్తవాలను ప్రస్తావిస్తే కాంగ్రెస్ నేతలకు ఎందుకు ఉక్రోశం వస్తోందని నిలదీశారు.ఆది శ్రీనివాస్ ఇకనైనా ఎగిరెగిపడటం మానుకోవాలని, అలా చేస్తే రాజకీయంగా పతనం తప్పదని రాకేశ్ రెడ్డి హెచ్చరించారు. బండి సంజయ్ హిందూ ధర్మం, సనాతన ధర్మం కోసం మాట్లాడుతున్నారని పేర్కొన్నారు. అలాంటి నాయకుడిని విమర్శించే నైతిక అర్హత ఆది శ్రీనివాస్‌కు లేదని అన్నారు.రంజాన్ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం రూ.33 కోట్లు కేటాయించిందా? లేదా? అని రాకేశ్ రెడ్డి ప్రశ్నించారు. అదే సమయంలో బోనాల ఉత్సవాలకు కేవలం రూ.20 కోట్లు మాత్రమే కేటాయించారనే ఆరోపణలపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో మెజారిటీగా ఉన్న హిందువుల పండుగలకు తగిన స్థాయిలో నిధులు కేటాయించకుండా కాంగ్రెస్ ప్రభుత్వం అన్యాయం చేస్తోందని ఆరోపించారు.హిందూ పండుగలకు, ముస్లిం పండుగలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతెంత నిధులు కేటాయించిందో ప్రజలకు వెల్లడించాలని రాకేశ్ రెడ్డి కోరారు. ఇందుకోసం ప్రభుత్వం వెంటనే శ్వేతపత్రం విడుదల చేసే ధైర్యం చూపాలని సవాల్ చేశారు. నిధుల కేటాయింపుల్లో ఎలాంటి వివక్ష లేదని కాంగ్రెస్ చెబితే.. ఆ వివరాలను బహిరంగంగా ప్రకటించేందుకు ఎందుకు వెనుకాడుతోందని ప్రశ్నించారు.కాంగ్రెస్ ప్రభుత్వం మైనారిటీ సంతుష్టీకరణ విధానాన్ని అవలంబిస్తోందని రాకేశ్ రెడ్డి ఆరోపించారు. హిందువుల పండుగలు, ఆచారాలు, సంప్రదాయాల విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ఒక వర్గాన్ని ప్రసన్నం చేసుకునే విధంగా ప్రభుత్వ నిర్ణయాలు ఉంటున్నాయనే భావన ప్రజల్లో ఏర్పడుతోందని అన్నారు.కాంగ్రెస్, ముస్లింలపై సీఎం రేవంత్ రెడ్డి గతంలో చేసిన వ్యాఖ్యలను కూడా రాకేశ్ రెడ్డి ప్రస్తావించారు. కాంగ్రెస్ అంటే ముస్లిం.. ముస్లిం అంటే కాంగ్రెస్ అన్నట్టుగా సీఎం మాట్లాడారని గుర్తుచేశారు. ఆ వ్యాఖ్యలకు అనుగుణంగానే ప్రస్తుతం ప్రభుత్వం ఒక వర్గానికి కొమ్ముకాస్తూ నిధులు కేటాయిస్తోందా అని ప్రశ్నించారు.బండి సంజయ్ వాస్తవాలు మాట్లాడుతున్నారని, అందుకే కాంగ్రెస్ నేతలు ఆయనపై వ్యక్తిగత విమర్శలకు దిగుతున్నారని రాకేశ్ రెడ్డి అన్నారు.

బండి సంజయ్‌ను తిడితే రాజకీయ ప్రచారం లభిస్తుందనే ఉద్దేశంతో చౌకబారు విమర్శలు చేయడం మానుకోవాలని ఆది శ్రీనివాస్‌కు సూచించారు.తాను నిజమైన హిందువునని భావిస్తే.. హిందూ పండుగలకు జనాభా ప్రాతిపదికన తగిన నిధులు కేటాయించేలా సీఎం రేవంత్ రెడ్డిపై ఒత్తిడి తీసుకురావాలని ఆది శ్రీనివాస్‌కు రాకేశ్ రెడ్డి సూచించారు. హిందువుల పండుగల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని మార్చేలా పనిచేయాలని అన్నారు. బండి సంజయ్‌ను విమర్శించడం కంటే ప్రజల ప్రశ్నలకు సమాధానాలు చెప్పడంపై దృష్టి పెట్టాలని హితవు పలికారు.

# మత్స్యకారులకు తెలంగాణ ప్రభుత్వ భరోసామంత్రి వాకిటి శ్రీహరి

- **4.21 లక్షలకుపైగా నమోదిత మత్స్యకారులకు గ్రూప్ ప్రమాద బీమా**
- **మత్స్యకారుల సామాజిక భద్రతకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత: మంత్రి వాకిటి శ్రీహరి**

**హైదరాబాద్ వెలుతురు ఆగస్టు 10:**



2026-27 ఆర్థిక సంవత్సరానికి రాష్ట్రంలోని 4,21,767 మంది నమోదిత మత్స్యకారులకు గ్రూప్ ప్రమాద బీమా పథకం (GAIS) అమలు చేయడానికి తెలంగాణ ప్రభుత్వం ఆమోదం తెలిపిందని రాష్ట్ర పశు సంవర్ధక, పాడిపారిశ్రామికాభివృద్ధి, మత్స్య, యువజన సర్వీసులు & క్రీడల శాఖ మంత్రివర్యులు వాకిటి శ్రీహరి ఒక ప్రకటనలో తెలిపారు. మత్స్యకారుల సంక్షేమం, జీవనోపాధి భద్రత, సామాజిక రక్షణకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి పేర్కొన్నారు. ప్రమాదవశాత్తు మరణం లేదా శాశ్వత వైకల్యానికి గురైన మత్స్యకారుల కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించాలనే ఉద్దేశంతో ఈ గ్రూప్ ప్రమాద బీమా పథకాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు.2026-27 సంవత్సరంలో 18 నుంచి 70 సంవత్సరాల వయస్సు గల 4,21,767 మంది నమోదిత మత్స్యకారులు ఈ పథకం పరిధిలోకి వస్తారని మంత్రి వెల్లడించారు. ఒక్కో లబ్ధిదారునికి రూ.79.96 బీమా ప్రీమియం ఉండగా, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 60:40 నిష్పత్తిలో ప్రీమియం భరిస్తాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తన వాటాగా రూ.1,34,79,673 చెల్లిస్తుందని, తద్వారా అర్హులైన మత్స్యకారులపై ఎలాంటి ఆర్థిక భారం ఉండదని స్పష్టం చేశారు.

**బీమా పథకం ద్వారా అందే ప్రయోజనాలు:**

- ప్రమాదవశాత్తు మరణం సంభవిస్తే – రూ.5.00 లక్షలు
- శాశ్వత సంపూర్ణ వైకల్యానికి – రూ.5.00 లక్షలు
- శాశ్వత పాక్షిక వైకల్యానికి – రూ.2.50 లక్షలు
- ప్రమాదవశాత్తు ఆసుపత్రిలో చికిత్స పొందితే – గరిష్ఠంగా రూ.25,000 వరకు వైద్య సహాయం

2026 జూన్ 1 నుంచి అమల్లోకి వచ్చే పాలసీ కాలంలో అర్హులైన ప్రతి నమోదిత మత్స్యకారుడికి నిరంతర బీమా రక్షణ అందేలా మత్స్యశాఖ అన్ని చర్యలు చేపట్టిందని మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు.మత్స్యకారుల కుటుంబాలకు ప్రమాద సమయంలో అండగా నిలవడంతో పాటు, వారి భవిష్యత్తుకు ఆర్థిక భరోసా కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి అన్నారు. మత్స్యకారుల సంక్షేమం కోసం ప్రభుత్వం చేపడుతున్న అనేక కార్యక్రమాల్లో భాగంగా గ్రూప్ ప్రమాద బీమా పథకం కీలకమైనదని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా నమోదిత మత్స్యకారులు, వారి కుటుంబాలకు సమగ్ర సామాజిక భద్రత, ఆర్థిక రక్షణ కల్పించేందుకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు.

# ఎస్. ఐ. ఆర్ పై అప్రమత్తంగా ఉండండి..

- **ఉదాసీనంగా ఉన్న బిఎల్ఏ లను తొలగించండి..**
- **జూమ్ మీటింగ్ లో నాయకులతో టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్...**


**హైదరాబాద్ వెలుతురు ఆగస్టు 10:**



ఎస్.ఐ.ఆర్ మొదటి దశ ప్రక్రియ కంటే రెండో దశలో బిఎల్ఏ లు మరింత అప్రమత్తంగా ఉండాలని టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. ఈ రోజు నుంచి పార్లమెంట్ ల వారీగా ఈ రోజు నుంచి సమావేశాలు ప్రారంభమయ్యాయి. సోమవారం రోజున ఆదిలాబాద్, పెద్దపల్లి, కరీంనగర్, నిజామాబాద్ పార్లమెంట్ సమావేశాలు జరిగాయి. ఈ సమావేశాలలో ఏఐసీసీ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్, ఎస్ ఎస్ ఏ కో ఆర్డినేటర్ గంప వేణు గోపాల్, SIR కో ఆర్డినెటర్ రాజేష్, డీసీసీ అధ్యక్షులు,ఎంపీలు, ఎమ్మెల్యేలు పార్లమెంట్, అసెంబ్లీ ఇంచార్జ్ లు, ఎస్ ఐ.ఆర్ ఇంచార్జ్ లు, పాల్గొన్నారు. మొదటి దశ ఈ రోజు తో పూర్తి అయిందని, రేపటి నుంచి SIR రెండో దశ ప్రారంభం అవుతుంది ఇప్పుడు చాలా అప్రమత్తంగా ఉండాలని టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ సూచించారు.ఇప్పటి వరకు ఎన్రోల్ మెంట్ ప్రక్రియ అయిందని ఇక నుంచి అనమాలిస్ లిస్ట్ లను జాగ్రత్తగా గమనించాలని అన్నారు. ఇదే చాలా కీలకమైన ఘట్టమని అన్నారు. కాంగ్రెస్ కు అనుకూలంగా ఉన్న వర్గాల ఓటర్ లను తొలగించే కుట్ర జరుగుతోందని మనం పశ్చిమ బెంగాల్ ను ఉదాహరణగా తీస్కొని గట్టిగా పని చేయాలని అర్హత ఉన్న ఒక్క ఓటు కూడా నష్టపోకుండా చూడాలని అన్నారు.బిఎల్ ఏ లు చాలా క్రియాశీల పాత్ర లో పని చేయాలని లేకపోతే పార్టీకి నష్టం జరుగుతుందని అన్నారు. ఈ విషయంలో చిన్న నిర్లక్ష్యం కూడా సహించేది లేదని పని చేయని వారి స్థానంలో కొత్త వారిని నియమించాలని సూచించారు.

# రాజీవ్ భీమా లిఫ్ట్ ప్రాజెక్టు ప్యాకేజీ27లో రెండు మోటార్లు స్విచ్ ఆన్ చేసిన మంత్రి జూపల్లి కృష్ణారావు





- **కాలువలకు సాగునీరు విడుదల చేసిన మంత్రి**
- **29,820 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు**
- **పాన్‌గల్, వీపనగండ్ల మండలాల రైతులకు ప్రయోజనం**

**కొల్లాపూర్ వెలుతురు ఆగస్టు 10:**

కొల్లాపూర్ నియోజకవర్గ రైతులకు సాగునీరు అందించేందుకు ప్రభుత్వం చర్యలు ముమ్మరం చేసింది. రాజీవ్ భీమా లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు (ఆర్‌బీఎల్ఐ-2) ప్యాకేజీ-27లో రెండు మోటార్లను పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు స్విచ్ ఆన్ చేసి కాలువలకు సాగునీటిని విడుదల చేశారు. దీంతో ప్యాకేజీ-27 పరిధిలోని 29,820 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందనుంది. పాన్‌గల్, వీపనగండ్ల మండలాల్లోని వేలాది మంది రైతులకు ప్రయోజనం చేకూరనుంది.రైతులు సకాలంలో పంటలు సాగు చేసుకునేందుకు అవసరమైన సాగునీటిని అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. ప్యాకేజీ-27 పరిధిలోని 29,820 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందేలా చర్యలు చేపట్టామని చెప్పారు.రాజీవ్ భీమా లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు ద్వారా కరవు ప్రభావిత ప్రాంతాలకు సాగునీరు అందించి వ్యవసాయాన్ని బలోపేతం చేయడంతో పాటు రైతుల ఆదాయాన్ని పెంచేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి పేర్కొన్నారు. సాగునీటి లభ్యతతో రైతులు సకాలంలో పంటలు సాగు చేసుకునేందుకు అవకాశం ఏర్పడుతుందన్నారు.కాలువల ద్వారా చివరి ఆయకట్టు వరకు నీరు చేరేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రి ఆదేశించారు. నీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా కాలువల నిర్వహణ, నీటి ప్రవాహాన్ని నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.

# పాలకులారా: వానలు క్షుద్ర పూజలతో రావు!

ప్రకృతి, సమాజం, చరిత్ర-మూడూ తమ అంతర్గత నియమాల ప్రకారమే మార్పుకు లోనవుతాయని గతితార్కిక భౌతికవాదం వివరిస్తుంది. వర్షాభావానికి కారణం క్షుద్ర శక్తులు కాదు, ప్రకృతి—సమాజ సంబంధాల్లో మనిషి జోక్యం, వాతావరణ మార్పులు, పర్యావరణ విధ్వంసం. కారణాలను శాస్త్రంలో వెతకాల్సిన చోట, వాటిని మూఢనమ్మకాలలో వెతకడం సమాజాన్ని వాస్తవ సమస్యల పరిష్కారం నుంచి దూరం చేస్తుంది.తెలంగాణ సమాజాన్ని పరిశీలిస్తే, ఇక్కడ లోతైన హేతువాద సంప్రదాయాలు, గొలుసుకట్టు చెరువుల ఆధారిత సాంప్రదాయ నీటి నిర్వహణ వ్యవస్థలు మరియు ప్రకృతితో మమేకమైన జీవన విధానం చారిత్రక పునాదులుగా కనిపిస్తాయి. ప్రజల జీవనం ఎప్పుడూ ప్రకృతి నియమాలను, భౌతిక వనరులను అర్థం చేసుకోవడం పైనే ఆధారపడి సాగింది. వర్షపాతం అనేది క్షుద్ర పూజలతోనో, అవైజ్ఞానిక భావనలతోనో నిర్ణయించబడేది కాదు; అది పూర్తిగా భూ-వాతావరణ శాస్త్రానికి లోబడి జరిగే ప్రకృతి ప్రక్రియ. సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు, గాలి పీడనం, తేమ శాతాలు, 'ఎల్ నినో', 'లా నినా' వంటి సంక్లిష్ట వాతావరణ పరిణామాలపై వర్షాలు ఆధారపడి ఉంటాయి. దీనికితోడు అనియంత్రిత అటవీ నిర్మూలన, జలవనరుల ఆక్రమణ, పారిశ్రామిక కాలుష్యం వల్ల స్థానిక వాతావరణ సమతుల్యత దెబ్బతింటోందని శాస్త్రవేత్తలు స్పష్టమైన ఆధారాలతో నిరూపించారు. ప్రకృతితో అనుసంధానమై, హేతుబద్ధమైన జల సంరక్షణ సంప్రదాయాలున్న తెలంగాణ నేలపై, వర్షాలు రాకపోవడానికి "క్షుద్ర పూజలే" కారణమని మాట్లాడటం ఇక్కడి జీవన స్ఫూర్తిని, పర్యావరణ శాస్త్ర పునాదులను విస్మరించడమే.పర్యావరణ విధ్వంసం అనేది ఏదో స్వతంత్రంగా జరిగే ప్రమాదం కాదు; అది పాలకవర్గ ఆర్థిక ప్రయోజనాలతో బిగుసుకుపోయిన ఒక గొలుసు. అడవుల నరికివేత వెనుక కార్పొరేట్ మైనింగ్ లీజులు ఉన్నాయి. జలవనరుల ఆక్రమణ వెనుక రియల్ ఎస్టేట్, ప్రత్యేక ఆర్థిక మండళ్ల విస్తరణ ఉంది. పారిశ్రామిక కాలుష్యం వెనుక కాలుష్య నియంత్రణ మండళ్లను నీరుగార్చిన విధాన నిర్ణయాలు ఉన్నాయి. అంటే వర్షాభావం కేవలం వాతావరణ శాస్త్ర సమస్య మాత్రమే కాదు; అది భూమి, నీరు, అడవులపై పెట్టుబడిదారీ నియంత్రణ సాధించే రాజకీయ ఆర్థిక వ్యవస్థ ఫలితం. ఈ పరస్పర సంబంధాన్ని విస్మరించి, వర్షం రాకపోవడాన్ని కేవలం "ప్రకృతి వైపరీత్యం"గానో, "పూజలు చేయక పోవడం"గానో చిత్రించడం పాలకవర్గం తన సొంత విధాన వైఫల్యాలను, తన సొంత మూలధన ప్రయోజ నాలను కప్పిపుచ్చుకునే ఎత్తుగడ మాత్రమే.ఈ మూఢన మ్మకాల రాజకీయం ఈనాడు ఆకస్మికంగా పుట్టుకొచ్చింది కాదు; ఇది దశాబ్దాలుగా సాగుతున్న ఒక చారిత్రక ప్రక్రియ ఫలితం. హరిత విప్లవం అనంతరం భూగర్భ జలాలపై అతిగా ఆధారపడటం, సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణంలో రాజకీయ అవినీతి, చెరువుల పూడికతీత నిర్లక్ష్యం ఇవన్నీ క్రమంగా పేరుకుపోతూ వచ్చాయి. ఒకప్పుడు నీటిపారుదల ఉద్యమాలు, చెరువుల సామాజిక నిర్వహణ వ్యవస్థలు ఉండేవి. పెట్టుబడిదారీ, భూస్వామ్య ప్రయోజనాలు బల పడుతున్న కొద్దీ ఆ సామూహిక వ్యవస్థలు కూలిపోయి, వ్యక్తిగత బోరుబావుల మీద, ఆ తర్వాత దైవ ప్రార్థనల మీద ఆధారపడే స్థితికి సమాజం చేరుకుంది. అంటే మూఢనమ్మకాల ప్రచారం శాస్త్రీయ నిర్వహణ వ్యవస్థలు కూలిపోతూ వచ్చిన చారిత్రక చలనానికి పర్యవసానమే తప్ప, స్థిరమైన సాంస్కృతిక లక్షణం కాదు.నేడు సమాజంలో మత ఛాందసవాదం బలంగా బయలుదేరుతున్న క్రమంలో, అలాంటి అవైజ్ఞానిక రాజకీయాలను మరింత విస్తృతం చేయడంలో పాలక వర్గాలు కీలకంగా వ్యవహరించడం తీవ్రమైన ఆందోళ నకరం. పాలనా వైఫల్యాలను, జల యాజమాన్య లోపాలను కప్పిపుచ్చుకోవడానికి మూఢనమ్మకాల ప్రచారాన్ని ఆశ్రయించడం అత్యంత తప్పుడు సిద్ధాంతం. ఇక్కడ ఒక స్పష్టమైన వైరుధ్యం కనిపిస్తోంది: జాతీయ స్థాయిలో ఏఐసీసీ నాయకుడు రాహుల్ గాంధీ రాజ్యాంగబద్ధమైన శాస్త్రీయ దృక్పథం (సైంటిఫిక్ టెంపర్), హేతుబద్ధత మరియు సామాజిక న్యాయం గురించి నిలకడగా మాట్లాడుతుంటే, ప్రాంతీయ స్థాయిలోని నాయకులు దానికి పూర్తి భిన్నంగా మూఢనమ్మకాలను ప్రోత్సహించే వ్యాఖ్యలు చేస్తున్నారు. ఒకే రాజకీయంలో ఉంటూ జాతీయ స్థాయిలో శాస్త్రీయ స్ఫూర్తిని, ప్రాంతీయ స్థాయిలో అవైజ్ఞానిక ధోరణులను భుజానకెత్తుకోవడం తీవ్రమైన వైరుధ్యానికి, ద్వంద్వ ప్రమాణాలకు ప్రత్యక్ష నిదర్శనం.సంవత్సరం సంవత్సరం పేరుకుపోతున్న వర్షాభావం, ప్రతిసారీ దానికి ఇచ్చే మూఢనమ్మకాల సాకులు కేవలం పరిమాణాత్మక పునరావృతాలు కావు. ఈ పరిమాణాత్మక పేరుకుపోవడం ఒక కీలక మలుపు వైపు సమాజాన్ని నెడుతోంది: ప్రజల్లో పాలనా వ్యవస్థపై, రాజ్యాంగబద్ధ సంస్థలపై విశ్వాసం క్రమంగా కరిగిపోవడం. ప్రతి కరవుకూ శాస్త్రీయ పరిష్కారం కాకుండా క్షుద్ర పరిష్కారం ముందుకు వచ్చినప్పుడు, అది కేవలం ఒక తప్పుడు ప్రకటన కాదు; పాలనా చట్టబద్ధత క్రమంగా కోల్పోతున్న సంకేతం. ఈ పరి మాణాత్మక కోతలు కొనసాగితే, అది గుణాత్మకంగా ఒక దశకు చేరుతుంది, ప్రజలు రాజ్యాంగ సంస్థలనే కాక, రాజ్యాన్నే ప్రశ్నించే దశకు. అందుకే ఈ చిన్న క్షుద్ర వ్యాఖ్యలను తేలిగ్గా తీసుకోలేం, అవి పేరుకు పోతున్న సంక్షోభానికి లక్షణాలు.అధికారంలో ఉన్నవారైనా, ప్రతిపక్షంలో ఉన్నవారైనా ఏ వర్గానికి చెందిన పాలకులైనా గ్రహించాల్సిన ప్రాథమిక సత్యం ఒకటే: సమాజం అభివృద్ధి పథంలో ముందుకు ప్రయా ణించాలంటే శాస్త్రీయ దృక్పథం అత్యంత అవసరం. భారత రాజ్యాంగంలోని అధికరణ 51A(h) ప్రకారం ప్రతి పౌరుడిలో శాస్త్రీయ దృక్పథాన్ని, మానవతా వాదాన్ని, పరిశోధనా స్ఫూర్తిని పెంపొందించడం ప్రాథమిక విధి. ప్రజాప్రతినిధులు ఈ రాజ్యాంగ ఆదేశానికి కట్టుబడి ఉండాలి. మూఢనమ్మకాలతో సమాజం వెనక్కి పోతుందే తప్ప అభివృద్ధి చెందదు. అడవులను సంరక్షించడం, చెరువులను-నదులను కాపాడుకోవడం, కార్బన్ ఉద్గారాలను తగ్గించడం మరియు వాతావరణ మార్పులకు అనుగుణమైన ప్రణాళికలు రూపొందించడమే నిజమైన పరిష్కారం. రాజకీయ నాయకులు సంచలనాత్మక క్షుద్ర రాజకీయ వ్యాఖ్యలను పక్కనబెట్టి, శాస్త్రీయ ఆధారాలతో కూడిన బాధ్యతాయుతమైన పరిపాలన అందించడమే రాజ్యాంగ స్ఫూర్తికి, ప్రజలకు చేసే నిజమైన సేవ. వానలు క్షుద్ర పూజలతో రావు... ప్రకృతి శాస్త్రంతోనే వస్తాయి!



పాపని నాగరాజు
(సత్యశోధక మహాసభ), 9948872190

# స్వయంప్రతిపత్తి కలిగిన ట్రిబ్యునల్

మన చట్టాల్లో ట్రిబ్యునళ్ల ఏర్పాటును పునఃసమీక్షించినన్నిసార్లు మరే ఇతర అంశాలను సమీక్షించి ఉండదు. 1987 నాటి ఎస్.పీ. సంపత్ కుమార్ కేసుకు... మద్రాస్ బార్ అసోసియేషన్ వరుస తీర్పులలో భాగంగా 2025 నవంబర్‌లో వెలువడిన నిర్ణయానికి మధ్య న్యాయస్థానాలు అనేక శాసనాలను కొట్టేశాయి. కొన్నింటి విషయంలో ఆదేశాలు జారీ చేశాయి.



తదనంతరం అదే ప్రాతిపదికన వచ్చిన కొత్త చట్టాలను మళ్లీ సమీక్షించాల్సి వచ్చింది. ఈ అంశం ఇన్నిసార్లు పునరావృతం కావటం ఈ సమస్య ఎంత క్లిష్టమైందో తెలియజేస్తోంది. 2026 నాటి ట్రిబ్యునళ్ల సంస్కరణల బిల్లు ప్రత్యేక దృష్టిని ఆకర్షిస్తోంది. ఎందుకంటే ఇది ఎట్టకేలకు అసలు సమస్యను గుర్తించినట్లు కనిపిస్తోంది.. ఆశాజనకంగా దానికి తగిన సమాధానాన్ని కూడా కనుగొన్నట్లుంది.

## సొంత అనుభవాలతో పాటు బాహ్య ప్రపంచ నుంచి నేర్చుకున్న పాఠం

సమస్య భారత్‌కు మాత్రమే ప్రత్యేకమైంది కాదు. ఇతర దేశాలు కూడా దీనిని ఎదుర్కొన్నాయి. వాటి విశ్లేషణను మనం గమనించడం విలువైంది. యునైటెడ్ కింగ్‌డమ్‌లో 2001లో సర్ ఆండ్రూ లెగాట్ ఈ రంగాన్ని సమీ క్షించినప్పుడు డెబ్బైకి పైగా ట్రిబ్యునల్స్ ఏ శాఖలపై విచారణ చేస్తున్నాయో సంబంధిత శాఖలే ఆయా ట్రిబ్యునల్స్‌ను నిర్వహిస్తున్నట్లు ఆయన గమనించారు. ఇదే ప్రధాన లోపమని ఆయన భావించారు. పదవీకాలాన్ని సర్దుబాటు చేయడం లేదా అర్హతలను మెరుగుపరచడం ఆయనిచ్చిన పరిష్కారం కాదు. ట్రిబ్యునళ్లను వాటికి నిధులు సమకూర్చే శాఖల నుంచి వేరు చేసి వాటి పరిపాలనను ఒకే గొడుకు కిందకు తీసుకురావడమే ఆయన సూచించిన పరిష్కారం. అదే 2007 చట్టంగా రూపాంతరం చెందింది. ఈ సంస్కరణ నిర్మాణాత్మకమైంది. ఇది కేవలం లక్షణాలను కాకుండా ఆ పరాధీనానికి మూలమైన కారణాన్ని రూపుమాపింది.

ట్రిబ్యునళ్ల వ్యవస్థను చాలా ముందే భారత్ స్వీకరించింది. మొత్తంగా చూస్తే ఇది విజయవంతమైంది.

1941లో ఏర్పాటైన ఆదాయపు పన్ను అప్పిలేట్ ట్రిబ్యునల్... ప్రత్యేక న్యాయ నిర్ణేత వ్యవస్థ విషయంలో ప్రపంచంలోనే అత్యుత్తమ ఉదాహర ణలలో ఒకటిగా నిలిచింది. రాజ్యాంగంలోని 323ఏ, 323బీ ఆర్టికల్స్.. 1985 నాటి అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్స్ చట్టం ద్వారా ఈ నమూనాను మరింత ముందుకు తీసుకెళ్లారు. ఆ తర్వాత హైకోర్టుల దగ్గర భారీగా పెండింగ్‌లో ఉండేందుకు వీలుండే రంగాలన్నింటికీ దీనిని విస్తరించారు. అయితే మన సమస్య వేరే రకమైంది. 2020లో న్యాయస్థానం పేర్కొన్నట్లుగా ట్రిబ్యునళ్లు కార్యనిర్వాహక వర్గంపై ఆధారపడాల్సిన అవసరం లేనప్పుడే నిజమైన స్వాతంత్ర్యం సాధ్యమవుతుంది.

## గత ప్రయత్నాలు సమస్యను ఎందుకు పరిష్కరించలేకపోయాయి!

సంస్కరణల కోసం సత్సంకల్పంతో ఒకటి కంటే ఎక్కువసార్లు ప్రయత్నాలు జరిగాయి. ఆ తర్వాత వచ్చిన చాలా వరకు వ్యాజ్యాలు... పదవీకాలం మూడేళ్లు ఉండాలా, నాలుగేళ్లు ఉండాలా, ఐదేళ్లు ఉండాలా... కనీసం యాభై సంవత్సరాల వయస్సు ఉండటం అనుమతించదగినదా లేదా సిఫార్సు చేయాల్సింది ఒకరి పేరా లేక ఇద్దరి ప్యానెలా అనే అంశాలపైనే సాగాయి. అయితే గౌరవప్రదంగా చెప్పాలంటే వీటిలో ఏదీ అసలు సమస్య మూలాలకు వెళ్లలేదు. స్వాతంత్ర్యం కేవలం లెక్కలపై ఆధారపడి ఉండదు. పదవీకాలం, వయస్సు, పేర్ల సంఖ్య అనేవి కేవలం వ్యాధిని నిర్ధారించడానికి ఉపయోగపడే లక్షణాలు మాత్రమే. అవి వ్యాధి కాదు.

## సమస్య అసలు మూలం

సమస్య అసలు మూలం ఏంటంటే.. ఒక ట్రిబ్యునల్ స్వయంప్రతిపత్తి కలిగిన సంస్థగా ఉండాలి. దానికి సొంత యంత్రాంగం, దానిని నిర్వహించే వారిని ఎంపిక చేసుకునే సొంత మార్గాలు.. వారిని పర్యవేక్షించడానికి, క్రమ శిక్షణలో ఉంచడానికి సొంత యంత్రాంగం అలాగే భవనాలు, సిబ్బంది, నిధుల కోసం సొంత ఏర్పాట్లు ఉండాలి. ఇవి ఉన్నచోట స్వాతంత్ర్యం సహజంగానే సిద్ధిస్తుంది. న్యాయస్థానం లేవనెత్తిన అంశాలపై కొత్త బిల్లు తగిన సమాధానం ఇస్తుంది. అంతేకాకుండా అది మరో అడుగు ముందుకు వేసింది. ఆ సమాధానాలను ఆచరణలో పెట్టేలా ఒక వ్యవస్థను నిర్మించ డానికి ప్రయత్నించింది. చట్టం ద్వారా 'నేషనల్ ట్రిబ్యునల్స్ కమిషన్' ఏర్పర చడమైంది. ఇది ఏ రకమైన కార్యనిర్వాహక ఉత్తర్వుల ద్వారా కాకుండా నేరుగా చట్టం నుంచే తన ఉనికిని, కూర్పును, విధులను పొందుతుంది. అంతేకాకుండా ఇది ఎంపిక, పర్యవేక్షణ, క్రమశిక్షణ, ట్రిబ్యునళ్లకు కావలసిన అవసరాలను అంచనా వేసే బాధ్యతలను నిర్వహిస్తుంది. దీని చుట్టూ ఒక శాశ్వత వృత్తి నిపుణులతో కూడిన సచివాలయం ఉంటుంది.

## ప్రాముఖ్యత, సమాన దూరం, దానిని విజయవంతం చేసే నియంత్రణ చర్యలు

ఈ బిల్లు ప్రాముఖ్యత ఉన్న ప్రతి దశలోనూ న్యాయ వ్యవస్థ స్వయం ప్రతిపత్తిని కాపాడుతుంది. ఈ కమిషన్‌కు సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి లేదా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి నేతృత్వం వహిస్తారు. ఇందులో న్యాయమూర్తులదే మెజారిటీ ఉంటుంది. కమిటీలకు కూడా న్యాయమూర్తులే అధ్యక్షత వహిస్తారు. అంతేకాకుండా న్యాయమూర్తి అధ్యక్ష స్థానంలో ఉండి నిర్ణయాత్మక ఓటు హక్కును కలిగి ఉంటారు. ఎంపిక, పర్యవేక్షణ, క్రమశిక్షణ, పనితీరు అన్నీ కూడా న్యాయ వ్యవస్థ నేతృత్వంలోనే నడుస్తాయి. 'ఆర్. గాంధీ' కేసు నుంచి న్యాయస్థానం చెబు తున్నదానికి ఇది అనుగుణంగా ఉంది. కార్యనిర్వాహకవర్గమే అత్యధికంగా వ్యాజ్యాలు దాఖలు చేసే పార్టీ కాబట్టి విచారించేవారిని ఎంపిక చేయడంలో దానికి ప్రధాన పాత్ర ఉండకూడదు.

దీంతో పాటుగా మరో ముఖ్యమైన విషయం ఏంటంటే.. ప్రాముఖ్యత ఉండటం అంటే నియంత్రణ అని అర్థం కాదు. పూర్తిగా న్యాయ వ్యవస్థ చేతిలోనే ఉన్న వ్యవస్థ కూడా కొన్ని సవాళ్లను ఎదుర్కొంటుంది. అందువల్ల ఈ బిల్లు ట్రిబ్యునల్‌ను కార్యనిర్వాహక వర్గానికి, న్యాయ వ్యవస్థకు సమాన దూరంలో ఉంచుతుంది. దీనిని మూడు అంచెల ద్వారా అమలు చేస్తుంది. కేంద్ర ప్రభుత్వం నిబంధనల్లో విస్తృత సూత్రాలను నిర్దేశిస్తుంది. కమిషన్ పనులు ఎలా జరగాలో నియమాలను రూపొందిస్తుంది. ఆ ఫ్రేమ్‌వర్క్ లోపల సచివాలయం తన విధులను నిర్వర్తిస్తుంది. ఇది తన పనితీరు విధానంలో మార్గదర్శకత్వాన్ని పొందుతుంది కానీ కార్యనిర్వాహక స్థాయిలో ఎవరి నియంత్రణలో ఉండదు. అలాగే ఇది అధికార బదలాయింపు ద్వారా కాకుండా నేరుగా చట్టం నుంచే తన విధులను పొందుతుంది.దీని ఫలితంగా కమిషన్, సచివాలయం, కార్యనిర్వాహక వర్గాల కలయిక ద్వారా ఒక నిజమైన నిరోధక, నియంత్రణ వ్యవస్థ ఏర్పడుతుంది. సచివాలయం అర్హతలను పరిశీలించటంతో పాటు ప్రతి నిర్ణయానికి ఆధారమైన రికార్డులను సంకలనం చేస్తుంది. ఇది నిబంధ నలకు బద్ధమై ఉంటుంది. చేసిన పనుల రికార్డును ఇది భద్రపరుస్తుంది. ఈ బిల్లు సాధించిన సున్నితమైన సమతుల్యత ఇదే. ఇందులో పరిపా లనలో న్యాయపరమైన జోక్యం ఉండదు లేదా మొత్తంగా కార్యనిర్వాహక వర్గంపై ఆధారపడటం జరగదు. అదే సమయంలో ఎంపిక, పర్యవేక్షణ, క్రమశిక్షణ, పనితీరులో న్యాయ వ్యవస్థ ప్రాధాన్యత కొనసాగుతుంది. కెనడా కూడా 2014లో ఇలాంటి అభిప్రాయానికే వచ్చింది. అది తన ఫెడరల్ ట్రిబ్యునళ్ల సపోర్ట్ సర్వీసెస్ అన్నింటినీ ఒకే సంస్థ క్రిందికి తెస్తూనే వాటి న్యాయ నిర్ణేత స్వయంప్రతిపత్తిని కాపాడుకుంది.ఇటువంటి చట్టాలను కేవలం న్యాయపరమైన సవాళ్లను తట్టుకొని నిలబడుతుందా లేదా అనే కోణంలోనే కాకుండా ఆ సవాళ్లకు కారణమైన పరిస్థితులను అవి తొలగిస్తున్నాయా లేదా అనే దాని ద్వారా అంచనా వేయాలి. ఆ పరీక్షలో ఈ బిల్లు పూర్తిగా విజయవంతమైంది. ఇది ఉద్దేశించిన విధంగా పనిచేస్తే ట్రిబ్యునళ్ల వ్యవస్థ గణనీయంగా మెరుగుపడుతుందనడంలో ఎలాంటి సందేహం లేదు. వ్యాజ్యాలు దాఖలు చేసే పౌరుడికి తగిన విధంగా ఏర్పాటైన, తగిన వసతులు కలిగిన, సకాలంలో ఖాళీలను భర్తీ అయ్యే, తన పనితీరుకు జవాబుదారీగా ఉండే ఒక చక్కటి వేదిక లభిస్తుంది. ఇక్కడ రూపుదిద్దుకున్న ఈ నమూనా భవిష్యత్తులో విజయవం తమైతే రాబోయే రోజుల్లో ఇతర ఎంపికలకు కూడా ఉపయోగపడే అవకాశం ఉంది.



శ్రీ ఎన్. వెంకటరామన్
(వ్యాసకర్త భారతదేశ అదనపు సొలిసిటర్ జనరల్. వ్యక్త పరిచిన అభిప్రాయాలు వ్యక్తిగతమైనవి.)

# ఇబ్రహీంపట్నం చౌరస్తాలో తెలంగాణ రాష్ట్రమంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి ఘనస్వాగతం పలికిన మర్రి నిరంజన్ రెడ్డి

- **ఫోర్‌లైన్ రోడ్డు పనులు వెంటనే ప్రారంభించాలి**
- **పిసిసి సభ్యుడు ఆదిభట్ల మున్సిపాలిటీ మాజీ చైర్మన్ మర్రి నిరంజన్ రెడ్డి**

**ఇబ్రహీంపట్నం వెలుతురు ఆగస్టు10:**

ఇబ్రహీంపట్నం నాగార్జునసాగర్‌లో నిర్వహిస్తున్న వరుణయాగానికి బయలుదేరిన తెలంగాణ రాష్ట్ర రోడ్లు భవనాలు సినిమాటోగ్రఫీ శాఖమంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి గారికి ఇబ్రహీంపట్నం చౌరస్తాలో పీసీసీ సభ్యుడు ఆదిభట్ల మున్సిపాలిటీ మాజీ చైర్మన్ మర్రి నిరంజన్ రెడ్డి ఘన స్వా గతం పలికారుఈసందర్భంగా ఇబ్రహీంపట్నం చౌరస్తా వద్ద మంత్రి గారిని కలిసి నియోజకవర్గా నికి సంబంధించిన పలు ముఖ్యమైన సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు ముఖ్యంగా ఇబ్ర హీంపట్నం ఖానాపూర్ గేట్ నుండి గురునానక్ కాలేజీ మీదుగా మాల్ వరకు సెంట్రల్ లైటింగ్ డి వైడర్‌తో కూడిన ఫోర్‌లైన్ రోడ్డు నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని మర్రి నిరంజన్.రెడ్డి ఇబ్రహీంపట్నం ఏసీపీ కెపివి రాజు మంత్రి గారిని కోరారు ఈరహదారి ద్వారా ప్రతిరోజూ వ్యాపారస్తులు ఉద్యోగులు విద్యార్థులు రైతులు కూలీలు తదితర వేలాది మంది హైదరాబాద్ వైపు ప్రయాణిస్తుండటంతో రహదారిపై ట్రాఫిక్ రద్దీ రోజురోజుకూ పెరుగుతోందని అదే సమయం లోతర చూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని మంత్రిగారి దృష్టికి తీసుకెళ్లారు నిన్న తక్కలపల్లి వా ర్డు మెంబర్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం అత్యంత బాధాకరమని ప్రజల భద్రతను దృష్టి లో ఉంచుకుని ఫోర్‌లైన్ రోడ్డు పనులను సెంట్రల్ లైటింగ్‌తో కలిపి తక్షణమే ప్రారంభించాల్సిన అవసరం ఉందని మర్రి నిరంజన్ రెడ్డి మంత్రి గారిని కోరారు అదేవిధంగా మధ్యాహ్నభోజన ప థకం కార్మికులు వంట సిబ్బందికి



గ్యాస్ సిలిండర్లు అందించాలని కూడా మంత్రి గారిని కోరారు దీనిపై మంత్రి.కోమటిరెడ్డి వెంకటరెడ్డి వెంటనే జిల్లా కలెక్టర్ తో మాట్లాడి గ్యాస్ సిలిండర్లు అం దించేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని రోడ్ల అ భివృద్ధి కోసం హెచ్ ఏ ఎం పథకం ద్వా రా నిధులు కేటాయించిన మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి గారికి ఇబ్రహీంపట్నం నియోజకవర్గ ప్రజల తరఫున మర్రి నిరంజన్ హృదయపూర్వక ధన్యవా దాలు కృతజ్ఞతలు తెలిపారు ఈకార్యక్రమంలో దేవరకొండ ఎమ్మెల్యే బాలునా యక్ ప్రజాప్రతిని ధులు కాంగ్రెస్ పార్టీ ముఖ్యనాయకులు పాల్గొన్నారు

# హర్ ఘర్ తిరంగా ప్రతి ఇంటా మువ్వన్నెల జెండా ఎగరాలి ఘనంగా

- **జాతీయ జెండా మన దేశ గౌరవానికి ప్రతీక – బీజేపీ ఎస్సీ మోర్చా జగిత్యాల జిల్లా అధ్యక్షులు నారపాక అశోక్**

**జగిత్యాల విద్యానగర్ వెలుతురు ఆగష్టు 10:**

భారతదేశ ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ గారి పిలుపు మేరకు భారతీయ జనతా పార్టీ దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న "హర్ ఘర్ తిరంగా" కార్యక్రమంలో భాగంగా బీజేపీ ఎస్సీ మోర్చా జగిత్యాల జిల్లా అధ్యక్షులు నారపాక అశోక్ గారు తమ కుటుంబ సభ్యులతో కలిసి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి జెండా వందనం నిర్వహించారు.ఈ సందర్భంగా నారపాక అశోక్ గారు మాట్లాడుతూ, "దేశమంతా ఒకటే పండుగ.. ప్రతి ఇంటిపై ఎగరాలి మువ్వన్నెల జెండా నిండుగా" అనే స్ఫూర్తితో ప్రతి భారతీయుడు హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు.ఆగస్టు 10వ తేదీ నుంచి ఆగస్టు 15వ తేదీ వరకు ప్రతి ఇంటిపై మన జాతీయ పతాకమైన మువ్వన్నెల జెండాను గర్వంగా ఎగురవేసి దేశభక్తిని చాటుకోవాలని ఆయన కోరారు.మన జాతీయ జెండా కేవలం ఒక వస్త్రం కాదని, అది భారతదేశ సార్వభౌమత్వానికి, స్వాతంత్ర్యానికి, త్యాగాలకు, జాతీయ గౌరవానికి ప్రతీక అని అన్నారు. కాషాయ రంగు ధైర్యం, త్యాగానికి, తెలుపు శాంతి, సత్యానికి, ఆకుపచ్చ అభివృద్ధి, శ్రేయస్సుకు ప్రతీకలుగా నిలుస్తాయని, మధ్యలోని అశోక చక్రం ధర్మం, న్యాయం, నిరంతర ప్రగతి, కర్తవ్యనిష్ఠకు ప్రతీక అని పేర్కొన్నారు.

ఎందరో స్వాతంత్ర్య సమరయోధులు తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడి మనకు స్వేచ్ఛా భారతాన్ని అందించారని, వారి త్యాగాలను స్మరించుకోవడం ప్రతి భారతీయుడి బాధ్యత అని నారపాక అశోక్ అన్నారు."మన ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేయడం అంటే కేవలం ఒక కార్యక్రమంలో పాల్గొనడం కాదు.. మన దేశంపై ఉన్న ప్రేమను, గౌరవాన్ని, బాధ్యతను ప్రపంచానికి చాటిచెప్పడం" అని అన్నారు.ప్రతి కుటుంబం తమ ఇంటిపై మువ్వన్నెల జెండాను ఎగురవే



యడంతో పాటు తమ బంధువులు, స్నేహితులు, ఇరుగుపొరుగు వారిని కూడా హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగస్వాములను చేయాలని పిలుపునిచ్చారు.జాతి, మతం, ప్రాంతం, భాషలకు అతీతంగా భారతీయులందరినీ ఒక్కతాటిపైకి తీసుకువచ్చే శక్తి మన జాతీయ జెండాకు ఉందని, మువ్వన్నెల జెండా సాక్షిగా మన ఐక్యతను, దేశభక్తిని ఎలుగెత్తి చాటుదామని అన్నారు."ఒక జెండా.. ఒక దేశం.. ఒక భావన.. భారతదేశం" అనే స్ఫూర్తితో ప్రతి భారతీయుడు దేశ ప్రగతిలో తన వంతు బాధ్యతను నిర్వర్తించాలని నారపాక అశోక్ కోరారు.ఈ సందర్భంగా ప్రతి ఇంటిపై మువ్వన్నెల జెండా రెపరెపలాడాలని, ప్రతి హృదయంలో భారత మాతపై గౌరవం, దేశభక్తి, జాతీయ ఐక్యత నిండాలని ఆకాంక్షించారు.

భారత్ మాతాకీ జై!
వందే మాతరం!
జై హింద్! జై బీజేపీ – జై జై బీజేపీ!

# ఫ్లైఓవర్‌పై బైక్ అదుపుతప్పి యువకుడి మృతి

**జహీరాబాద్ వెలుతురు, ఆగస్టు 10:**

సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మున్సిపల్ పరిధిలోని పస్తాపూర్ గ్రామ శివారులో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. జహీరాబాద్ పట్టణ ఎస్ఐ లవ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. కర్ణాటక రాష్ట్రం బీదర్ తాలూకా మంగళపేట్ గ్రామానికి చెందిన అమోస్ (27) తన తల్లి అనిత (42), కుమార్తె సన్నిధి (9)తో కలిసి జహీరాబాద్‌లోని కల్వరి టెంపుల్ చర్చికి బైక్‌పై వెళ్తుండగా ఫ్లైఓవర్‌పై బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. అమోస్‌ను జహీరాబాద్ ప్రభుత్వ ఆసుపత్రి నుంచి బీదర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ తేదీ : 09.08.2026 నాడు మధ్యాహ్నం 2 గంటలకు మృతి చెందాడు. మృతుడి భార్య సుధా రాణి ఫిర్యాదు మేరకు జహీరాబాద్ టౌన్ పోలీ



సులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# అప్పుల ఒత్తిడితో డ్రైవర్ మృతి"

**జహీరాబాద్ వెలుతురు, ఆగస్టు 10:**

అప్పుల బాధతో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన జహీరాబాద్ పట్టణంలోని ఐడీఎస్ఎంటీ కాలనీలో సోమవారం చోటుచేసుకుంది. జహీరాబాద్ టౌన్ ఎస్ఐ లవ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఐడీఎస్ఎంటీ కాలనీకి చెందిన కచేరి తాజొద్దీన్ (41) డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. జీవనోపాధి కోసం ఫైనాన్స్‌లో రుణం తీసుకుని బొలెరో వాహనం కొనుగోలు చేశాడు. అయితే వాహనం కోసం తీసుకున్న రుణంతో పాటు ఇతర అప్పులు కూడా ఉండటంతో వాటిని తీర్చలేక కొంతకాలంగా తీవ్ర మనస్తాపానికి గురైనట్లు పోలీసులు తెలిపారు.. ఈ క్రమంలో సోమవారం ఉదయం సుమారు 10.30 గంటల సమయంలో తాజొద్దీన్త న ఇంట్లో సీలింగ్ ఫ్యాన్ కు నైలాన్ త్రాడుతో ఉరి వేసుకొని ఇంట్లో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుడి అన్న మహమ్మద్ గౌసొద్దీన్ ఫిర్యాదు మేరకు



జహీరాబాద్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు, మృతికి గల కారణాలపై పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు.

# మహబూబాబాద్ జిల్లా జై గౌడ జిల్లా అధికార ప్రతినిధిగా బూర పూర్ణ చందర్ గౌడ్

**వెలుతురు మహబూబాబాద్ ఆగస్టు 10:**

సర్దార్ సర్వాయి పాపన్న జయంతి ఉత్సవాలు హైదరాబాద్ లోని రవీంద్ర భారతి లో ఘనంగా జరుగుతున్న సందర్భంలో జై గౌడ మహబూబాబాద్ జిల్లా ప్రతినిధుల ఎన్నిక ఈ రోజు నిర్వహించారు. ఈ ఎన్నికలలో మహబూబాబాద్ లండన్ కిడ్స్ విద్యాసంస్థల చైర్మన్ బూర పూర్ణ చందర్ గౌడ్ మహబూబాబాద్ జిల్లా జై గౌడ అధికార ప్రతినిధిగా ఏకగ్రీవంగా ఎన్నిక అయ్యాడు. ఈ సందర్భంగా బూర పూర్ణ చందర్ మాట్లాడుతూ నా ఎన్నికలో సహాయపడిన గౌడ సోదరులకు నా హృదయపూర్వక కృతజ్ఞతలు. ఈ రోజు నుండి గౌడ కుల అభివృద్ధికి మరియు సమస్యల పరిష్కారానికి నా వంతు బాధ్యత నిర్వహిస్తానని అన్నాడు.



# ప్రియాంక మృతికి కారకులను కఠినంగా శిక్షించాలి:మంత్రి శ్రీహరి

- **గాంధీ మార్చురీలో ప్రియాంకకు నివాళులు**
- **తండ్రిని ఓదార్చిన మంత్రి శ్రీహరి.. ఘటనపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం**
- **నిందితులకు కఠిన శిక్ష పడాలి.. సీఎం వెంటనే స్పందించారని వెల్లడి**
- **భవిష్యత్తులో ఘటనలు పునరావృతం కాకూడదు**

**హైదరాబాద్, వెలుతురు, ఆగస్టు 10:**

గాంధీ ఆస్పత్రి మార్చురీలో మెడికో విద్యార్థిని ప్రియాంక భౌతికకాయానికి రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి, మాజీ ఎమ్మెల్యే, ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్ నివాళులర్పించారు. అనంతరం ప్రియాంక తండ్రిని పరామర్శించిన మంత్రి.. ఆయనకు ధైర్యం చెప్పారు. కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.ప్రియాంకకు జరిగిన ఘటన అత్యంత విషాదకరమని మంత్రి వాకిటి శ్రీహరి ఆవేదన వ్యక్తం చేశారు. ఆమె మృతికి కారణమైన వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టకూడదని, చట్టప్రకారం కఠినంగా శిక్షించాలని అన్నారు. ఇలాంటి ఘటనలు మరోసారి జరగకుండా ప్రభుత్వం కఠిన నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.ఘటనపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెంటనే స్పందించారని మంత్రి తెలిపారు. ముఖ్యమంత్రి తమతో పాటు



అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేశారని చెప్పారు. కేసు దర్యాప్తు, తదుపరి చర్యల్లో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా వ్యవహరించాలని సూచించారు.చట్టాల్లోని లొసుగులను ఆసరాగా చేసుకుని నేరాలకు పాల్పడిన వారు తప్పించుకునే పరిస్థితి ఉండకూడదని శ్రీహరి అన్నారు. నేరస్థులకు శిక్ష పడేలా చట్టపరమైన చర్యలను మరింత కఠినతరం చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ప్రియాంక కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలుస్తుందని స్పష్టం చేశారు.0

# నర్సంపేటలో బీఆర్ఎస్ ధర్నా

- **రహదారులపై నిలిచిన రాకపోకలు**
- **పెద్ది సుదర్శన్ రెడ్డి విగ్రహ గద్దె కూల్చివేతపై నిరసన**
- **ప్రభుత్వ మెడికల్ కళాశాల ఎదుట ఆందోళన**
- **ఎర్రబెల్లి దయాకర్ రావు ఆధ్వర్యంలో ధర్నా**
- **కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా బీఆర్ఎస్ నినాదాలు**
- **మున్సిపల్ కమిషనర్‌పై చర్యలకు డిమాండ్**

**నర్సంపేట, వెలుతురు, ఆగస్టు 10:**

వరంగల్ జిల్లా నర్సంపేటలో రాజకీయ ఉద్రిక్తత చోటుచేసుకుంది. దివంగత మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు ప్రైవేటు స్థలంలో నిర్మించిన గద్దెను మున్సిపల్ అధికారులు తొలగించడాన్ని



నిరసిస్తూ బీఆర్ఎస్ నాయకులు ఆందోళనకు దిగారు. ప్రభుత్వ మెడికల్ కళాశాల ఎదుట సోమవారం భారీగా ధర్నా నిర్వహించారు. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, మాజీ ఎంపీ వినోద్ రావు ఆధ్వర్యంలో జరిగిన ఈ నిరసనలో మున్సిపల్ మాజీ చైర్మన్, కౌన్సిలర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ తమ నిరసన వ్యక్తం చేశారు.ప్రైవేటు స్థలంలో ఏర్పాటు చేస్తున్న విగ్రహ గద్దెను ఎలాంటి ముందస్తు చర్యలు లేకుండా కూల్చివేశారని బీఆర్ఎస్ నేతలు ఆరోపించారు. ఈ వ్యవహారానికి బాధ్యుడైన నర్సంపేట మున్సిపల్ కమిషనర్‌పై చర్యలు తీసుకోవాలని, వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.ధర్నాలో పెద్ద సంఖ్యలో పార్టీ కార్యకర్తలు పాల్గొనడంతో నర్సంపేటలో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. నర్సంపేట–మహబూబాబాద్, నర్సంపేట–కొత్తగూడ, నర్సంపేట–ములుగు ప్రధాన మార్గాల్లో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.విగ్రహ గద్దె కూల్చివేతపై అధికారులు స్పష్టత ఇవ్వాలని, తమ డిమాండ్లను పరిష్కరించే ఆందోళన కొన సాగిస్తామని బీఆర్ఎస్ నాయకులు స్పష్టం చేశారు.

# శ్రీ బ్రహ్మసూత్ర మరకత లింగేశ్వర స్వామి సేవలో ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య

**శంకర్‌పల్లి, వెలుతురు ఆగస్టు 10 :**

శంకర్‌పల్లి మండల పరిధిలోని చందిప్ప గ్రామంలో వెలిసిన 11వ శతాబ్దపు శ్రీ బ్రహ్మసూత్ర మరకత లింగేశ్వర స్వామి ఆలయంలో సోమవారం ఉదయం ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య కుటుంబ సభ్యులతో కలిసి స్వామి వారికి అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ చైర్మన్ కడకంచి కుమార్ ఎమ్మెల్యేను స్వామి వారి శేష వస్త్రంతో సత్కరించి, స్వామి వారి చిత్రపటాన్ని బహుకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పురాతన శివలింగాన్ని దర్శించుకుని అభిషేకాలు చేయడం గొప్ప అనుభూతిని ఇచ్చిందన్నారు. ఆకుపచ్చ శివలింగాలు ఉండటం చాలా అరుదు అని, లింగంపై బ్రహ్మసూత్రపు గీతలు ఉండడం చాలా విశేషమని తెలియజేశారు.



కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, మండల కురుమ సంఘం అధ్యక్షులు వెంకటేశం, సభ్యులు పాల్గొన్నారు.

# శేరిలింగంపల్లిలో ఓటరు సర్వే విజయవంతం

**శేరిలింగంపల్లి వెలుతురు ఆగస్టు 10:**

రంగారెడ్డి జిల్లా, శేరిలింగంపల్లి మండలం పరిధిలోని న్యూ ఆఫీస్ వేట్, మార్తాండనగర్ ప్రాంతంలో నిర్వహించిన ఓటరు సర్వే ఫారాల ప్రక్రియ ఈరోజుతో విజయవంతంగా ముగిసింది. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు చేపట్టిన ఈ కార్యక్రమంలో బీఎల్ఓలు, బీఎల్ఏ సభ్యులు సమన్వయంతో పనిచేస్తూ ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను సేకరించారు. పెండింగ్‌లో ఉన్న ఫారాలను పూర్తి చేసి, అవసరమైన నమోదు ప్రక్రియలను సక్రమంగా నిర్వహించారు. ప్రతి ఓటరి వివరాలు ఖచ్చితంగా నమోదు కావాలనే లక్ష్యంతో సిబ్బంది బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించినట్లు అధికారులు తెలిపారు. ఎలాంటి



నిర్లక్ష్యానికి తావు లేకుండా నిర్ణీత గడువులోపే మొత్తం సర్వే ప్రక్రియను పూర్తి చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. మార్తాండనగర్ ప్రాంతంలో పనిచేసిన బీఎల్ఓలు, బీఎల్ఏ సభ్యులు మరియు ఇతర సిబ్బంది క్రమశిక్షణతో, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తమ బాధ్యతలను సమర్థంగా నిర్వహించినట్లు అధికారులు వెల్లడించారు.

## శివన్నగూడెం నుండి తెరీటిపెల్లి వరకు డబల్ రోడ్డు నిర్మాణం పనులు ప్రారంభం

**మర్రిగూడ వెలుతురు ఆగస్టు 10:**



మునుగోడు నియోజకవర్గం శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి చిరకాల స్వప్నం మునుగోడు అభివృద్ధి. మునుగోడు నియోజకవర్గం అభివృద్ధి ప్రదాత మునుగోడు నియోజకవర్గం అన్ని రంగాలలో అభివృద్ధి చెందాలని అనునిత్యం శ్రమిస్తూ ప్రజల మధ్య ఉంటూ ప్రజలకు సేవ చేస్తున్నారు. అందులో భాగంగానే మునుగోడు నియోజకవర్గం లోనే కాకుండా రాష్ట్రంలో ప్రతి పల్లెకు డబుల్ రోడ్డు నిర్మాణం జరగాలని ఈ ప్రతిపాదనను పంచాయ తీరాజ్ శాఖ మంత్రి గారికి విన్నవించడం జరిగింది. వెనువెంటనే ప్రభుత్వము క్యాబినెట్లో తీర్మానం చేసి రాష్ట్రం మొత్తము అన్ని గ్రామాలకు డబల్ రోడ్డు ఉండాలని జీవోతీసి ప్రతిపాదనలు అమలు చేయుటకు రోడ్లు భవనాల శాఖ ద్వారా నివేదికలు తెప్పించుకొని మంజూరు చేయడం జరిగింది. అందులో భాగంగానే శివన్నగూడెం నుండి తెరట్ పల్లి వరకు సుమారు 33 కోట్ల 50 లక్షలు మంజూరు చేయించే శంకుస్థాపన చేసినారు అందులో భాగంగానే ఈరోజు శివన్న గూడెం నుండి రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్నవి. ఈ సందర్భంగా మునుగోడు నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కంచుకట్ల సంపత్ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఈసందర్భంగా శివన్నగూడెం, ఇందుర్తి, కొట్టాల, నామాపురం మరియు తెరట్ పల్లి గ్రామాల ప్రజల తరఫున మునుగోడు నియోజకవర్గం కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. గతంలో ఈరహదారి సక్రమంగా లేకపోవడం ద్వారా ప్రజలకు ఎంతో అసౌకర్యంగా ఉండినది రోడ్డు పునర్ని ర్మాణంతో ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని తెలిపారు.

## రైతులకు ఆరుతడి పంటలపై తహసీల్దార్ అవగాహన

**నూతనకల్ ఆగస్టు10 (వెలుతురు) :**



మండలం లో అన్నదాతలు వరి పొలాలను ఎక్కువగా సాగు చేస్తున్నారు. ఈ సీజన్ లో వర్షాలు సరిగా లేకపోవడంతో చెరువులు కుంటలు బోరు బావులలో నీటిమట్టం రాను రాను తగ్గుముఖం పడుతుందని తహసిల్దార్ పి శ్రీనివాసరావు అన్నారు. సోమవారం ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎల్ నీనో ప్రభావంతో వర్షాపాతం తగ్గినందున రైతులు ఆరుతడి పంటలు వేసుకోవాలని మన ప్రభుత్వం"రై తులతో మాట పంట మార్పిడికి బాట" అనే కార్యక్రమం ద్వారా రైతులందరినీ కూడా ప్రత్యామ్నా య పంటల సాగు వైపు మరియు నీటి నిర్వహణపై అవగాహన కల్పించాలని ఈ కార్యక్రమము ద్వారా అవగాహన కల్పిస్తున్నాము. వ్యవసాయ అధికారి సైదా నాయక్ మాట్లాడుతూ నూతనకల్ మండలంలో మొత్తం సాగుభూమి 22200 ఎకరాలు కాగా ఇప్పటి వరకు సాగు అయిన వరి 8500 ఎకరాలు, పెసర 445 ఎకరాలు, కంది 613 ఎకరాలు, పత్తి 7220 ఎకరాలు పంటలు వేయగా మిగిలిన సాగు చేయకుండా ఉన్న భూమి 3200 ఎకరాలు ఉన్నదని ఇప్పటికైనా రైతులు అవగాహన చేసుకుని ఆరుతడి పంటల వైపు మల్లాలని పిలుపునిచ్చారు.రైతు సోదరు లందరూ కూడా ప్రత్యామ్నాయ పంట లను నీటిని తక్కువగా వినియోగిస్తున్న కంది, పెసర్లు మినుములు, వేరుశనగ, జొన్న మరియు ఉద్యాన సాగు చేయాలని వారు అన్నారు.

ఈ కార్యక్రమములో తుంగతుర్తి ఏఎంసి చైర్మన్ తీగల గిరిధర్ రెడ్డి,పిఎసిఎస్ చైర్మన్ నాగం జయసుధ సుధాకర్ రెడ్డి, మండల ప్రత్యేక అధికారి భారతి, ఎంపీడీవో సునీత,సర్పంచ్ మహేశ్వరం మల్లికార్జున్, ఉప సర్పంచ్ నాగం సరిత సుధీర్ రెడ్డి, ఏఈఓ జానయ్య రైతులు పాల్గొన్నారు.

## శ్రీ శ్రీ శ్రీ ముత్యాలమ్మ తల్లి దేవాలయం ముందు భక్తుల కొరకు అభివృద్ధి పనులు



**రామన్నపేట వెలుతురు ఆగస్టు 10:**

గ్రామం ఇంద్రపాలనగరం శ్రీ శ్రీ శ్రీ ఇంద్రపాల ముత్యాలమ్మ తల్లి దేవాలయం వద్ద విశాలమైన స్థలం కోసం ఆలయం ముందు ఉన్న కాల్వలో సిమెంట్ ఆర్ సి సి పైపులు వేసి పూడ్చివేశారు. అండర్ గ్రౌండ్ కాలువ లాగా మార్చి భక్తులకు గుడి ముందు విశాలమైన స్థలం మరియు పార్కింగ్ కోసం అభివృద్ధి పనులను శరవేగంగా చేస్తున్న సర్పంచ్ గర్దాస్ విక్రమ్ వడ్లకొండ బిక్షపతి, బొల్ల మత్స్యగిరి, కనకబోయిన లింగస్వామి, నీరుడు వెంకటేష్, మేకల నరేందర్, పుట్టాల నాగరాజు, వడ్లకోండ చింటూ, గార్దాస్ సాయి తదితరులు పాల్గొన్నారు.

## భక్తుల సౌకర్యార్థం రూ.4.50 లక్షల విరాళం

**నార్కట్ పల్లి వెలుతురు ఆగస్టు 10:**

శ్రీపార్వతి జడల రామలింగేశ్వర స్వామి దేవ స్థానంలోని విఘ్నేశ్వర సదన్లో భక్తుల సౌకర్యార్థం రూమ్ నిర్మాణానికి హైదరాబాద్కు చెందిన అద్దెల రజినీకాంత్–కృష్ణవేణి దంపతు లు రూ.4.50 లక్షలు విరాళంగా అందజే శారు.సోమవారం దేవస్థాన చైర్మన్, ధర్మకర్తల సమక్షంలో చెక్కు మరియు డీడీ రూపంలో ఈ విరాళాన్ని దేవస్థాన సిబ్బంది యాదయ్య, రాజ్య లక్ష్మి లకు అందజేశారు.ఈ సందర్భంగా దేవస్థాన చైర్మన్ వారాల రమేష్ దాతలను అభి నందించారు. భక్తుల సౌకర్యాల కోసం దాతలు ముందుకు రావడం అభినందనీయమన్నారు.ఈ కార్యక్రమంలో ధర్మకర్తలు రేగట్టె శ్రీనివాస్రెడ్డి, కమ్మలపల్లి మల్లేష్, ప్రజ్ఞాపురం లో సత్యనా రాయణ, గద్దగూటి యాదగిరి, పాలే మహేష్, దేవస్థాన పూజారి మామిళ్లపల్లి నాగయ్య, దేవస్థాన సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## కలకత్తాలో నార్కట్‌పల్లి లారీ డ్రైవర్ గుండెపోటుతో మృతి

**నార్కట్ పల్లి వెలుతురు ఆగస్టు 10:**

నార్కట్‌పల్లి మండలానికి చెందిన ఎస్.కె. గఫూర్ మియా (47)కలకత్తాలో గుండెపోటు తో అకస్మాత్తుగా మరణించినట్లు కు టుంబ సభ్యులకు సమాచారం అం దింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... గఫూర్ మియా గత వారం రోజుల క్రితం లారీలో లోడుతో కలకత్తా వెళ్లారు. అక్కడ లారీని అన్‌లోడ్ చేసిన అనంతరం, తిరుగు ప్రయాణానికి మరొక లోడు కోసం లారీని పార్కింగ్‌లో నిలిపి వేచి చూస్తున్న సమయంలో ఆయనకు హఠాత్తుగా గుండెపోటు సంభవించింది. దీనితో ఆయన ఆదివారం మృతి చెందారు. మృతునికి భార్య ముగ్గురు కుమా ర్తెలు ఉన్నారు. ఆకస్మికంగా జరిగి న ఈ ప్రమాదంతో నార్కట్‌పల్లి గ్రామంలో విషాదఛాయలు అల ముకున్నాయి. ఆయన మృతి పట్ల కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు తీవ్ర దిగ్భ్రాంతి చెంది కన్నీరుము న్నీరవుతున్నారు.



## బట్లకాల్వ ముదిరాజ్ సంఘం నూతన కమిటీ ఎన్నిక

- **అధ్యక్షుడిగా పండ్ల బండి సైదులు.**

**మునుగోడు,ఆగస్టు 10(వెలుతురు):**



మునుగోడు మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని బట్లకాల్వ గ్రామ ముదిరాజ్ కుల సంఘానికి నూతన కమిటీని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామంలో ముదిరాజ్ కుల సంఘాన్ని తొలిసారిగా ఏర్పాటు చేసి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు సంఘం నిర్వాహకులు తెలిపారు. సంఘం తొలి అధ్యక్షుడిగా జిట్టగోని(పండ్లబండి) సైదులు ముదిరాజ్ ఏకగ్రీవం గా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా జిట్టగోని మారయ్య ముదిరాజ్, కార్యదర్శిగా కట్ట హరికృష్ణ ముదిరాజ్, కోశాధికారిగా నారగోని జగన్ ముదిరాజ్, సహాయ కార్యదర్శిగా నారగోని కిరణ్ ముదిరాజ్ ఎన్నిక య్యారు.గౌరవ అధ్యక్షులుగా కట్ట యాదయ్య ముదిరా జ్, జిట్టగోని రాములు ముదిరాజ్, నారగోని లక్ష్మయ్య ముదిరాజ్, తేలుకుంట్ల యాదయ్య ముదిరాజ్‌తో పాటు పలువురిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు జిట్టగోని సైదులు ముదిరాజ్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో సంఘం తొలి అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్న ముదిరాజ్ కుల పెద్దలు,యువతకు కృత జ్ఞతలు తెలిపారు. సంఘం అభివృద్ధికి అందరినీ కలుపు కొని పనిచేస్తానన్నారు. ముది రాజ్ కుటుంబాల ఐక్యత, సంక్షేమం కోసం కృషి చేయ డంతో పాటు విద్య, ఉపాధి, సామాజిక అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తానని చెప్పారు. సంఘం బలోపేతానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.




## రోడ్డు విస్తరణ పనులు వెంటనే ప్రారంభించాలి

- **బీజేపీ ఆధ్వర్యంలో ఆమరణ నిరాహార దీక్ష**

**నార్కట్ పల్లి వెలుతురు ఆగస్టు 10:**

నార్కెట్‌పల్లి పట్టణంలో రోడ్డు విస్తరణ పనులను వెంటనే చేపట్టాలని డిమాండ్ చేస్తూ భారతీయ జనతా పార్టీ నార్కెట్‌పల్లి మండల శాఖ అధ్యక్షులు మేడబోయిన శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆమరణ నిరాహార దీక్ష చేపట్టారు. ఈ దీక్ష కార్య క్రమానికి బీజేపీ జాతీయ నాయకులు గోలి మధుసూదన్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నకిరేకంటి మొగులయ్య, నూకల వెంకటనారాయణరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి పోతేపాక లింగస్వామి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. దీక్షలో పాల్గొంటున్న మేడబోయిన శ్రీనివాస్, జిల్లా కౌన్సిల్ సభ్యులు నడింపల్లి శ్రవణ్‌కుమార్, జిల్లా కార్యవర్గ సభ్యులు మునుకుంట్ల గణేష్, మండల ప్రధాన కార్యదర్శి బిల్లాకంటి శ్రీకాంత్, BJYM నాయకులు పాలకూరి రమేష్‌కు పూలమాలలు వేసి దీక్షను ప్రారంభించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి కారణంగా నార్కెట్‌పల్లి పట్టణంలో రోడ్డు విస్తరణ పనులు నిలిచిపోయాయని ఆరోపించారు. రోడ్డు విస్తరణ ఆలస్యం కావడంతో ప్రమాదాలు జరుగుతూ పలువురు ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న జాతీయ రహదారి పనులపై దృష్టి సారిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్ర పరిధిలో చేపట్టాల్సిన రోడ్డు విస్తరణ పనులను పట్టించుకోవడం లేదని విమర్శించారు. రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సొంత మండలంలోనే రోడ్డు విస్తరణ పనులు పూర్తి చేయలేని పరిస్థితి నెలకొందని అన్నారు. నార్కెట్‌పల్లి రోడ్డు విస్తరణ పనులను వెంటనే ప్రారంభించాలని, లేకుంటే మంత్రి తన పదవికి రాజీనామా చేసి ప్రజలకు క్షమాపణ చెప్పాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షులు కొరివి శంకర్, జిల్లా కార్యవర్గ సభ్యులు పసునూరి సంపత్, తరాల శ్రీనివాస్, సీనియర్ నాయకులు పాల్వాయి భాస్కరరావు, లింగాల వీరయ్య, కిసాన్ జిల్లా కార్యదర్శి మల్లెబోయిన రమేష్, వనం శంకర్, నడింపల్లి పార్థసారథి, కల్లూరి కార్తీక్, పానుగుల శివకుమార్, చిరుమర్తి రవి, మంద చంటి, తోటకూర శివకుమార్, చెరుకుపల్లి ప్రశాంత్ పాల్గొన్నారు.




## మామిళ్లగూడెం నుంచి ఐసీఐసీఐ బ్యాంక్ డిప్యూటీ మేనేజర్‌గా అర్వపల్లి అఖిల నాగ రమ్య

- **చిన్ననాటి నుంచే క్రమశిక్షణతో చదువుతూ ఉన్నత స్థాయికి ఎదిగిన యువతి**
- **పిల్లలు పుట్టినప్పుడు కాదు వారు భవిష్యత్తులో అభివృద్ధిలోకి వచ్చినప్పుడే నిజమైన ఆనందం అని నిరూపించిన అర్వపల్లి నగేష్-శ్రీలక్ష్మి**

**ఖమ్మం, వెలుతురు ఆగస్టు 10:**

మామిళ్లగూడెం లో నివాసం ఉండే మధ్యత రగతి కుటుంబానికి చెందిన అర్వపల్లి నగేష్–ల కుమార్తె అఖిల నాగరమ్య, చిన్ననాటి నుండే చదువులో ముందుండి,ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా పట్టుదలతో, ఉన్నత చదువులు చదివి నేడు దేశంలోనే ప్రముఖ బ్యాంకుల్లో ఒకటైన ఐసీఐసీఐ బ్యాంకులో డిప్యూటీ మేనేజర్‌గా బాధ్యతలు స్వీకరించే స్థాయికి ఎదిగారు. కష్టపడి చదివి, లక్ష్యాన్ని నిర్దేశించుకుని ముందు కు సాగితే ఉన్నత శిఖరాలను అధిరోహించ వచ్చని ఆమె విద్యా ప్రస్థానం నిరూపిస్తోంది. ఎన్ని కష్టాలు ఎదురైనా తన కుమార్తె భవిష్యత్తు బాగుండాలని, ఆర్థికంగా ఎన్నో సమస్యలు తలెత్తిన, కుమార్తెను వెన్ను తట్టి ప్రోత్సహిం చడంలో తల్లిదండ్రులు కీలక పాత్ర పోషించారు తద్వారా అఖిల నాగ రమ్య 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు మామిళ్లగూడెంలోని మాంటిస్సోరి ప్రైవేట్ స్కూల్‌లో విద్యనభ్య సించారు. అనంతరం ఇంటర్ విద్యను సాహితి జూనియర్ కాలేజీలో పూర్తిచేశారు. ఉన్నత విద్యలో భాగంగా గుంటూరులోని మాస్టర్ మైండ్స్ కాలేజీలో తన చదువును కొనసా గించారు.విద్యార్థి దశ నుంచే పట్టుదల, క్రమశి క్షణతో చదువుతూ తన లక్ష్యాన్ని చేరుకు నేందుకు కృషి చేసిన అఖిల నాగ రమ్య, తాజాగా ఐసీఐసీఐ బ్యాంకులో డిప్యూటీ మేనేజర్‌గా బాధ్యతలు స్వీకరించటం, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, స్నేహితులు, ఆమెను చదివించిన ఉపాధ్యాయుల్లో ఆనందాన్ని నింపిం ది.“విద్యకు కృషి తోడైతే విజయానికి హద్దులు ఉండవు” అన్నట్లుగా అఖిల నాగ రమ్య సాధిం చిన ఈ విజయాన్ని పలువురు అభినందిస్తున్నా రు. ఆమె మరింత ఉన్నత స్థాయికి ఎదిగి, తల్లి దండ్రులకు, చదివిన పాఠశాల–కళాశాలలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షిస్తున్నారు.

**తల్లిదండ్రుల ఆనందం**




కూతురు చిన్ననాటి నుంచి కష్టపడి చదువుకుని ఉన్నత ఉద్యోగాన్ని సాధించడం పట్ల తల్లిదండ్రులు నగేష్, శ్రీలక్ష్మి ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అఖిల నాగ రమ్య భవిష్యత్తులో మరెన్నో ఉన్నత శిఖరాలు అధిరో హించాలని వారు ఆకాంక్షించారు.మామి ళ్లగూడెం నుంచి ప్రారంభమైన అఖిల నాగ రమ్య విద్యా ప్రయాణం.. ఐసీఐసీఐ బ్యాంక్ డిప్యూటీ మేనేజర్ స్థాయికి చేరుకోవడం నేటి యువతకు స్ఫూర్తిదాయకం.

## మోడీ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలి

- **రామన్నపేటలో జైలు భరో సందర్భంగా రాస్తారోకో — నాయకుల అరెస్ట్**

**రామన్నపేట వెలుతురు ఆగస్టు 10:**

కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక, రైతు–వ్యవసాయ కార్మిక–కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, సీఐటీ యూ ఆధ్వర్యంలో సోమవారం రామన్నపేట మండల కేంద్రంలో జైలు భరో కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా మం డల కేంద్రంలోని ప్రధాన రహదారిపై నాయకు లు, కార్యకర్తలు రాస్తారోకో నిర్వహించి కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మేక అశోక్‌రెడ్డి, వ్యవ సాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు జల్లెల పెంటయ్య, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గౌరి గే సోములు మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రైతులు, వ్యవసాయ కార్మికులు, కార్మికులు, పేదలు, సామాన్య ప్రజల ప్రయోజనాలను విస్మరించి కార్పొరేట్ సంస్థలకు అనుకూలమైన విధానాలను అమలు చేస్తోందని విమర్శించారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని, వ్యవసాయ రంగంలో సంక్షోభం పెరుగుతున్న ప్పటికీ రైతుల సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యం చేస్తోందని అన్నారు. రైతులకు రుణభా రం తగ్గించి, పంటలకు సమగ్ర మద్దతు కల్పిం చాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మికు లకు ఏడాది పొడవునా ఉపాధి కల్పించే విధంగా ఉపాధి హామీ పథకాన్ని బలోపేతం చేయాలని, పని దినాలు పెంచడంతో పాటు కూలి రేట్లు పెంచాలని వారు డిమాండ్ చేశారు. పేదలకు ఉపాధి, ఆహారం, ఇళ్లు, విద్య, వైద్యం వంటి మౌలిక సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని గుర్తుచేశారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను బలహీనపరిచి కార్మికుల హక్కులను హరించే విధానాలను అవ లంబిస్తోందని వారు ఆరోపించారు. కార్మికుల కు కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత, సామాజిక భద్రత కల్పించాలని, కార్మిక వ్యతిరేక విధానా లను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశా రు.దేశ సంపదను సృష్టిస్తున్న రైతులు, వ్యవసా య కార్మికులు, కార్మికుల ప్రయోజనాలను పక్కనపెట్టి కొద్దిమంది కార్పొరేట్ సంస్థలకు ప్రభుత్వ విధానాలు అనుకూలంగా మారుతు న్నాయని విమర్శించారు. ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తున్న వారిపై నిర్బంధాలు, అరెస్టులతో ఉద్యమాలను అణచివేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు. జైలు భరో కార్యక్రమంలో భాగంగా శాంతియుతంగా రాస్తారోకో నిర్వహిస్తున్న నాయకులు, కార్యక ర్తలను పోలీసులు అరెస్ట్ చేసి రామన్నపేట పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అరెస్టులను నాయకులు తీవ్రంగా ఖండించారు. ప్రజా సమ స్యల పరిష్కారం కోసం చేపట్టే ఉద్యమాలను అణచివేయడం ద్వారా ప్రజల గొంతును నొక్క లేరని స్పష్టం చేశారు. రైతులు, వ్యవసాయ కార్మికులు, కార్మికులు ఐక్యంగా పోరాడి కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను తిప్పికొ ట్టాలని వారు పిలుపునిచ్చారు. ప్రజల హక్కుల సాధన కోసం భవిష్యత్తులో మరింత ఉధృతంగా ఉద్యమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు గన్నెబోయిన విజయభాస్కర్, బోయిని ఆనంద్, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి కందుల హనుమతు, సీఐ టీయూ నాయకులు నకిరకంటి రాము, నాయ కులు కల్లూరి నగేష్, మేడబోయిన శ్రీనివాస్,అవ నగంటి నగేష్, శానగొండ వెంకటేశ్వర్లు, బందెల బిక్షం, బుద్ద ప్రసాద్,పల్లె సత్యం తదితరులు పాల్గొన్నారు.



# కరీంనగర్ అభివృద్ధికి టెక్నాలజీ తోడు

- **రోడ్డు పనుల్లో వేగం, నాణ్యత కోసం AJAX కాంక్రీట్ యంత్రం**
- **35వ డివిజన్‌లో అత్యాధునిక యంత్రంతో సీసీ రోడ్డు పనులకు శ్రీకారం చుట్టిన మేయర్ కొలగాని శ్రీనివాస్**

**కరీంనగర్ వెలుతురు ఆగస్టు 10:**



కరీంనగర్ నగరంలో అభివృద్ధి పనులను మరింత వేగవంతం చేస్తూ, నాణ్యతా ప్రమాణాలను పెంచే దిశగా నగర పాలక సంస్థ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించేందుకు అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా 35వ డివిజన్‌లో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు అత్యాధునిక AJAX సెల్ఫ్ లోడింగ్ కాంక్రీట్ మిక్సర్ యంత్రాన్ని వినియోగిస్తూ నగర మేయర్ శ్రీ కొలగాని శ్రీనివాస్ పనులను ప్రారంభించారు.సంప్రదాయ పద్ధతులతో పోలిస్తే AJAX యంత్రం ద్వారా కాంక్రీట్ తయారీ, మిశ్రమ నిష్పత్తుల నియంత్రణ, నిర్మాణ ప్రాంతంలోనే కాంక్రీట్ సిద్ధం చేయడం, వేగవంతమైన సరఫరా వంటి ప్రయోజనాలు లభిస్తాయి. దీని వల్ల పనుల అమలు సమయం తగ్గడంతో పాటు నిర్మాణ నాణ్యత కూడా మెరుగుపడుతుందని అధికారులు తెలిపారు.ఈ సందర్భంగా మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ అభివృద్ధి పనులు ప్రారంభించడం మాత్రమే కాదు, వాటిని నాణ్యతతో, నిర్ణీత గడువులో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం అత్యంత ముఖ్యమైన విషయం. అందుకే ఆధునిక యంత్ర సాంకేతికతను వినియోగిస్తూ రోడ్డు నిర్మాణ పనులను వేగవంతం చేస్తున్నాం అని తెలిపారు.

**వేగం పెరగాలి — నాణ్యత తగ్గకూడదు**

రోడ్డు నిర్మాణ పనుల్లో వేగంతో పాటు నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండదని మేయర్ స్పష్టం చేశారు. కాంక్రీట్ నాణ్యత, సరైన మిశ్రమ నిష్పత్తులు, రోడ్డు మందం, క్యూరింగ్ వంటి అన్ని అంశాల్లో ఇంజనీరింగ్ అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.నగరంలో రోడ్డు పనులు ఎక్కువ కాలం కొనసాగడం వల్ల ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటారని, అందువల్ల ఆధునిక యంత్రాల సహాయంతో సాధ్యమైనంత తక్కువ సమయంలో పనులను పూర్తి చేయడమే లక్ష్యమని పేర్కొన్నారు.

**35వ డివిజన్‌తో ప్రారంభం — నగరవ్యాప్తంగా విస్తరణ**

35వ డివిజన్‌లో ప్రారంభించిన ఈ విధానాన్ని పరిశీలించి, అవసరాన్ని బట్టి నగరంలోని ఇతర డివిజన్లలో చేపట్టే సీసీ రోడ్లు, డ్రైనేజీలు మరియు ఇతర కాంక్రీట్ నిర్మాణ పనుల్లో కూడా ఆధునిక యంత్ర సాంకేతికతను వినియోగించేందుకు చర్యలు తీసుకుంటామని మేయర్ తెలిపారు."కరీంనగర్ వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరం. అందుకు అనుగుణంగా మన పని విధానాలు కూడా మారాలి. పాత పద్ధతులకు పరిమితం కాకుండా ఆధునిక యంత్రాలు, సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి ప్రజలకు మెరుగైన రోడ్లు, డ్రైనేజీలు, మౌలిక సదుపాయాలు అందించడమే మా లక్ష్యం" అని ఆయన పేర్కొన్నారు.నగరంలోని అన్ని డివిజన్లలో ప్రజ ల అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తామని, ప్రతి రూపాయి ప్రజలకు ఉపయోగపడే శాశ్వత అభివృద్ధి పనులుగా కనిపించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని తెలిపారు.

**అభివృద్ధికి ఆధునిక సాంకేతికత కొత్త వేగం**

AJAX వంటి ఆధునిక యంత్రాల వినియోగం ద్వారా మానవ వనరులపై ఆధారపడటాన్ని తగ్గించడం, పనుల అమలులో వేగం పెంచడం, కాంక్రీట్ సరఫరాలో సమయాన్ని ఆదా చేయడం, నిర్మాణ ప్రక్రియను మరింత సమర్థవంతంగా నిర్వహించడం సాధ్యమవుతుందని మేయర్ తెలిపారు."అభివృద్ధిలో ఆలస్యానికి తావులేదు. ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకొని కరీంనగర్‌ను మెరుగైన మౌలిక వసతులతో కూడిన ఆధునిక నగరంగా తీర్చిదిద్దుతాం. 35వ డివిజన్‌లో ప్రారంభమైన ఈ విధానం నగర అభివృద్ధి పనుల్లో కొత్త వేగానికి నాంది కావాలి" అని మేయర్ కొలగాని శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో 35వ డివిజన్ కార్పొరేటర్ సాధవిని సుజాత శ్రీనివాస్, మున్సిపల్ అధికారులు, ఇంజినీరింగ్ సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# కేంద్రమంత్రి బండి సంజయ్‌ను కలిసిన బిజెపి జిల్లా అధ్యక్షులు సాయిని మల్లేశం

**కరీంనగర్ వెలుతురు ఆగస్టు 10:**





బిజెపి జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన సాయిని మల్లేశం మొదటిసారిగా కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ని మర్యాదపూర్వకంగా కలిసి ఆశీస్సులు తీసుకున్నారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన సాయిని మల్లేశం ని కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ అభినందించారు. జిల్లాలో పార్టీ బలోపేతానికి, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని ఈ సందర్భంగా బండి సంజయ్ సూచించారు . ఈ కార్యక్రమంలో మేయర్ కొలగాని శ్రీనివాస్ డిప్యూటీ మేయర్ వై. సునీల్ రావు,కార్పొరేటర్లు: ఎన్నం లక్ష్మీ ప్రకాష్, గాజ రమ శివరాం, కర్రే పద్మ అనిల్, సీనియర్ నాయకులు గుజ్జ శ్రీనివాసరావు, గుంజేటి శివ, గాధగోని రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# వృద్ధాప్య, బీడీ కార్మికుల పెన్షన్ లు కూడా ఇవ్వాల్సిందే..!

- **బీజేపీ మాజీ అధ్యక్షులు సుగుర్తి జగదీశ్వరాచారి**

**కరీంనగర్ వెలుతురు ఆగస్టు 10:**



అధికారంలోకి వచ్చేముందు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన 420 హామీలలో భాగంగా వృద్ధాప్య మరియు బీడీ కార్మికులకు కూడా ఇవ్వాల్సిందేనని కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండల బీజేపీ మాజీ అధ్యక్షులు, న్యాయ వాది సుగుర్తి జగదీశ్వరాచారి సోమవారం నాటి పత్రికా ప్రకటనలో ప్రభు త్వాన్ని డిమాండ్ చేసారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో గత ప్రభుత్వం ఇచ్చినటువంటి వివిధ రకాల పెన్షన్ లను పెంచి ఇస్తామని చెప్పి రెండున్నరేళ్ళుగా మభ్యపెడుతూ చివరికి పెంపు చేయకుం డా, వృద్ధాప్య మరియు బీడీ కార్మికుల పెన్షన్ లపై స్పష్టత ఇవ్వకపోవడం మోసపోరితమేనని అన్నారు.ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ప్రకారం పెన్షన్ లకోసం దరఖాస్తు చేసుకునేందుకు మీ సేవ కు వెళ్లిన వృద్ధులకు, బీడీ కార్మికులకు సంబందించి సైట్ లో అప్షన్ కనిపించడం లేదని పేర్కొన్నారు.ఈ రెండు రకాల పెన్షన్ లపై దరఖాస్తు లు తీసుకుంటున్నారా లేదా సైట్ లో పొందుపరిచే విషయంలో సాంకేతిక పొరపాటు ఏమైనా జరిగిందా అనే విషయంపై స్పష్టంగా తెలపాలని, అలాగే,ఈ ఆగస్టు 15 న ఇస్తామంటున్నటువంటి పెన్షన్ లు పెంచే ఇవ్వాలని డిమాండ్ చేశారు.

# మానవత్వం చాటుకున్న మాజీ ఎంపీటీసీ రామ్ సునీత శివకుమార్



**రామన్నపేట వెలుతురు ఆగస్టు 10:**
**రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ముత్యాల శివ కుటుంబ సభ్యులను పరామర్శించి ఆయన మృత దేహానికి పూలమాలవేసి నివాళులు అర్పించి కాంగ్రెస్ పార్టీకి ఆయన సేవలను గుర్తుకు చేసినారు. అనంతరం వారి కుటుంబ సభ్యులకురామశివకుమార్ 5,000 ఆర్థిక సహాయం అందచేయడం జరిగింది.**

# హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా ఇంటిపై జాతీయ పతాకం ఆవిష్కరించిన మేయర్ కొలగాని శ్రీనివాస్

**కరీంనగర్ వెలుతురు ఆగస్టు 10:**



గౌరవనీయులైన భారత ప్రదానమంత్రి శ్రీ నరేంద్ర మోడీ గారు పిలుపునిచ్చిన హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా ఈరోజు తన నివాసంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించినట్లు కరీంనగర్ నగర మేయర్ శ్రీ కొలగాని శ్రీనివాస్ గారు తెలిపారు.ఈ సందర్భంగా మేయర్ శ్రీనివాస్ గారు మాట్లాడుతూ, హర్ ఘర్ తిరంగా కార్యక్రమం కేవలం ప్రతి ఇంటిపై జాతీయ పతాకాన్ని ఎగురవేయడం మాత్రమే కాదని, దేశభక్తి భావనను ప్రతి ఇంటికి, ప్రతి కుటుంబానికి చేరవేసే మహత్తర జాతీయ ఉద్యమమని పేర్కొన్నారు.భారత జాతీయ పతాకం మన ఐక్యతకు, సమైక్యతకు, స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలకు ప్రతీక అని అన్నారు. త్రివర్ణ పతాకం ప్రతి భారతీయుడి గౌరవానికి, దేశ సార్వభౌమాధికారానికి, రాజ్యాంగ స్ఫూర్తికి ప్రతీకగా నిలుస్తుందని చెప్పారు.యువతలో దేశభక్తి, జాతీయ గౌరవం, రాజ్యాంగ విలువల పట్ల అవగాహన పెంపొందించేందుకు ఈ కార్యక్రమం ఎంతో దోహదపడుతుందని తెలిపారు. స్వాతంత్ర్య సమర యోధులు దేశం కోసం చేసిన త్యాగాలను స్మరించుకోవడంతో పాటు, దేశాభివృద్ధిలో ప్రతి పౌరుడు తనవంతు బాధ్యతను నిర్వర్తించాలనే స్ఫూర్తిని ఈ కార్యక్రమం కలిగిస్తుందని పేర్కొన్నారు.స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని ప్రతి పౌరుడు తన ఇంటిపై గర్వంగా త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి, దేశభక్తిని చాటాలని మేయర్ పిలుపునిచ్చారు. హర్ ఘర్ తిరంగా అభియాన్ కార్యక్రమం ఈ నెల 10 నుండి 14వ తేదీ వరకు కొనసాగనున్న నేపథ్యంలో నగరంలోని ప్రతి కుటుంబం ఇందులో భాగస్వాములు కావాలని కోరారు.ప్రతి ఇంటిపై జాతీయ పతాకం రెపరెపలాడేలా హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన నగర ప్రజలను కోరారు. భారతదేశ ఐక్యత, సమైక్యత, అఖండతను ప్రపంచానికి చాటిచెప్పే ఈ జాతీయ ఉద్యమంలో ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా పాల్గొని జాతీయ పతాకానికి గౌరవం తెలపాలని మేయర్ శ్రీ కొలగాని శ్రీనివాస్ గారు పిలుపునిచ్చారు.

# కొత్త యస్వాడలో హైమాస్ట్ లైట్ల ప్రారంభం

- **21వ డివిజన్ కొత్త యస్వాడలో హైమాస్ట్ లైట్లను ప్రారంభించిన నగర మేయర్ కొలగాని శ్రీనివాస్**

**కరీంనగర్ వెలుతురు ఆగస్టు 10:**



కరీంనగర్ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా 21వ డివిజన్ పరిధిలోని కొత్త యస్వాడ ప్రాంతంలో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను నగర మేయర్ శ్రీ కొలగాని శ్రీనివాస్ గారు ప్రారంభించారు.ఈ సందర్భంగా మేయర్ గారు మాట్లాడుతూ, నగరంలోని ప్రతి డివిజన్‌లో ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు అందించేందుకు నగరపాలక సంస్థ నిరంతరం కృషి చేస్తోందన్నారు. హైమాస్ట్ లైట్ల ఏర్పాటు వల్ల రాత్రి వేళల్లో ప్రజలకు మెరుగైన వెలుతురు అందడంతో పాటు భద్రత కూడా పెరుగుతుందని తెలిపారు. కాలనీల అభివృద్ధికి అవసరమైన రోడ్లు, డ్రైనేజీలు, వీధి దీపాలు తదితర సౌకర్యాలను దశలవారీగా కల్పిస్తున్నామని పేర్కొన్నారు.కొత్త యస్వాడ ప్రాంత ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈ హైమాస్ట్ లైట్లను ఏర్పాటు చేయడం జరిగిందని, ప్రజలకు అవసరమైన ప్రతి అభివృద్ధి పనిని ప్రాధాన్యత ఆధారంగా చేపడతామని మేయర్ గారు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ శ్రీ వరాల నర్సింగం గారు, మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, డివిజన్ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా ఘనంగా హర్ ఘర్ తిరంగా అభియాన్

- **స్వగృహంపై జాతీయ జెండా ఎగరవేసిన బిజెపి జిల్లా అధ్యక్షులు సాయిని మల్లేశం**

**కరీంనగర్ వెలుతురు ఆగస్టు 10:**



కరీంనగర్ జిల్లావ్యాప్తంగా సోమవారం రోజున 'హర్ ఘర్ తిరంగా' అభియాన్ ప్రోగ్రాం ఘనంగా ప్రారంభమైంది. కార్యక్రమంలో భాగంగా సోమవారం రోజున బిజెపి జిల్లా అధ్యక్షులు సాయిని మల్లేశం తన స్వగృహంపై కుటుంబ సభ్యుల తో కలిసి జాతీయ జెండాను ఎగురవేశారు.ఈ సందర్భంగా సాయిని మల్లేశం మాట్లాడుతూమన జాతీయ పతాకం దేశానికి , మనందరికీ గర్వకారణమని, దేశభక్తిని కలిగే విధంగా నిరంతర ప్రేరణ శక్తిని ఇస్తుందని తెలిపారు. 2022 నుండి కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'హర్ ఘర్ తిరంగా' (ప్రతి ఇంటా త్రివర్ణ పతాకం) కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ ఉత్సాహంగా భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఆగస్టు 15 స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రతి ఒక్కరూ తమ ఇళ్లపై జాతీయ జెండాను ఎగురవేసి, 'వికసిత భారత్' నిర్మాణానికి మద్దతుగా నిలిచి, మనందరి ఐక్యతను చాటి చెప్పాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక బిజెపి నాయకులు, కార్యకర్తలు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# జహీరాబాద్‌లో సీఐటీయూ జైల్ భరో.. వందలాది మంది అరెస్ట్

- **లేబర్ కోడ్స్, వి.బి.జి. రాంజీ చట్టాన్ని రద్దు చేయాలి...**
- **క్విట్ ఇండియా స్ఫూర్తితో ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం: సీఐటీయూ...**

**జహీరాబాద్ వెలుతురు ఆగస్టు 10:**





కేంద్ర బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతు, వ్యవసాయ కూలీల వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సీఐటీయూ, ఏఐకేఎస్, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జహీరాబాద్‌లో సోమవారం జైల్ భరో కార్యక్రమం నిర్వహించారు. క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో చేపట్టిన ఈ ఆందోళనలో కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.జహీరాబాద్‌లోని శ్రామిక భవన్ నుంచి జాతీయ రహదారిపై భారీ నిరసన ప్రదర్శన చేపట్టారు. అనంతరం బస్టాండ్ వద్ద రాస్తారోకో నిర్వహించి కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఆందోళనకారులను పోలీసులు అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా జహీరాబాద్‌లో వందలాది మంది అరెస్ట్ కావడంతో కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది.ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్. మహిపాల్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాసే విధంగా నాలుగు లేబర్ కోడ్స్‌ను తీసుకొచ్చిందని ఆరోపించారు. ఉపాధి హామీ చట్టాన్ని మార్చి వి.బి.జి. రాంజీ చట్టాన్ని తీసుకురావడం ద్వారా కార్మికులు, వ్యవసాయ కూలీల ప్రయోజనాలను దెబ్బతీసే ప్రయత్నం జరుగుతోందని విమర్శించారు. దేశ సంపదను సృష్టిస్తున్న కోట్లాది మంది కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీల హక్కులను పరిరక్షించాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందన్నారు.కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్స్, కూలీల ప్రయోజనాలకు నష్టం కలిగించే వి.బి.జి. రాంజీ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రైతు, కార్మిక వ్యతిరేక విధానాలను కేంద్రం ఉపసంహరించుకోకపోతే కార్మిక, ప్రజా ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్మికులు, ప్రజల ఆగ్రహానికి కేంద్ర బీజేపీ ప్రభుత్వం గురికాక తప్పదని అన్నారు.క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో దేశవ్యాప్తంగా పోరాటాలను కొనసాగిస్తామని మహిపాల్ స్పష్టం చేశారు. కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీల హక్కుల కోసం ఐక్య ఉద్యమాలను మరింత బలోపేతం చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జహీరాబాద్ మండల అధ్యక్షుడు తుల్జారాం, కార్యదర్శి సుకుమార్, సీఐటీయూ మండల కన్వీనర్ నరేష్, సీఐటీయూ వివిధ యూనియన్ల నాయకులు సందీప్‌రెడ్డి, వంశీకృష్ణ, యశోదమ్మ, నందమ్మ, శ్యామల, ఎల్లప్ప, మోహన్, సంజీవ్, లక్ష్మణ్, ఇస్మాయిల్ పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్‌లో ఉత్తమ సేవలు.. బీఎల్‌ఓలకు ఘన సన్మానం

- **చేసిన సేవలు చిరస్థాయిగా నిలిచిపోతాయి : కోహీర్ చైర్మన్ అశోక్**
- **నగదుతో ప్రోత్సాహించిన పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు ముజాఫర్ హుసేన్...**

**జహీరాబాద్ వెలుతురు ఆగస్టు 10:**



ఎస్ఐఆర్ కార్యక్రమంలో అంకితభావంతో విధులు నిర్వహించిన బూత్ స్థాయి అధికారులను ఘనంగా సన్మానించారు.సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గం కోహిర్ టౌన్ కాంగ్రెస్ అధ్యక్షుడు మీర్ ముజాఫర్ హుసేన్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో బీఎల్‌ఓలకు శాలువాలు, పూలమాలలు, నగదు బహుమతులు అందజేశారు.ఈ సందర్భంగా కోహిర్ మున్సిపల్ చైర్మన్ ఎం. అశోక్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు ముజాఫర్ హుసేన్ మాట్లాడుతూ అధికారులు ప్రజలకు అంకితభావంతో అందించిన సేవలు చిరస్థాయిగా నిలిచిపోతాయని అన్నారు. కాంగ్రెస్ అధిష్టానం ఆదేశాల మేరకు పార్టీ నాయకులు, కార్యకర్తలు కష్టపడి పనిచేయడం తో కోహిర్ పట్టణంలో ఎస్ఐఆర్ ప్రక్రియ 100 శాతం విజయవంతమైందని తెలిపారు. కార్యక్రమ విజయానికి కృషి ప్రతి ఒక్కరికీ ముజాఫర్ హుసేన్ కృతజ్ఞతలు తెలిపారు.కార్యక్రమంలో వైస్ చైర్మన్ మొహమ్మద్ అబ్దుల్ హన్నన్ జావేద్, మాజీ ఎంపీపీ, బీఎల్ఓ సూపర్‌వైజర్ ఎం.డి. షాకీర్ అలీ, కౌన్సిలర్ నంచారి శిరీష రాణి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# ఉప్పర్‌పల్లి బీజేపీ కార్యాలయంలో ఘనంగా ముగిసిన తొలి విడత ఓటరు ఎన్యుమరేషన్ ప్రక్రియ

- జూలై 1 నుంచి ఆగస్టు 10 వరకు బీజేపీ సేవా సైనికుల విశేష కృషి
- బొక్క బాల్ రెడ్డి నాయకత్వంలో BLAలు, BLOల సమన్వయంతో తొలి విడత ఎన్యుమరేషన్ ప్రక్రియ విజయవంతంగా పూర్తయింది.

**ఉప్పర్‌పల్లి, ఆగస్టు 10 (వెలుతురు):**

దేశ భవిష్యత్తును నిర్ణయించే ఓటు హక్కును ప్రతి అర్హుడైన పౌరుడు వినియోగించుకునేలా అవగాహన కల్పించడమే లక్ష్యంగా బీజేపీ నాయకులు, కార్యకర్తలు కృషి చేస్తున్నారని బీజేపీ సీనియర్ నాయకులు బొక్క బాల్ రెడ్డి తెలిపారు.SIR ప్రక్రియలో భాగంగా ఉప్పర్‌పల్లి బీజేపీ కార్యాలయంలో జూలై 1 నుంచి చేపట్టిన ఓటరు అవగాహన, ఎన్యుమరేషన్ ఫారమ్‌ల భర్తీ, సేకరణ కార్యక్రమం ఆగస్టు 10 నాటికి తొలి విడతగా విజయవంతంగా పూర్తయింది. బీజేపీ నాయకులు, కార్యకర్తలు BLAలు, BLOలకు సహకరిస్తూ రాత్రింబవళ్లు శ్రమించారు. అభినయ్ గౌడ్, గోనే శ్రీకాంత్ రెడ్డి, పవన్, మణి, భూపాల్ ముదిరాజ్, కర్ణాకర్ గౌడ్, నరేందర్, మనోజ్, విట్టల్, సందీప్, శేఖర్, సాయి, నవీన్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.ఆగస్టు 17 నుంచి రెండో విడత ప్రక్రియ ప్రారంభం కానున్న నేపథ్యంలో, ఓటర్లు తమ ఎన్యుమరేషన్ వివరాలను సరిగ్గా పరిశీలించుకోవాలని పార్టీ ప్రతినిధులు సూచించారు. అవసరమైన వారికి ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం తదుపరి దశలో పత్రాల




సమర్పణకు అవకాశం ఉంటుందని తెలిపారు.

ఎన్యుమరేషన్ ఫారమ్‌ల భర్తీతో పాటు అవసరమైన సేకరణ కార్యక్రమం ఆగస్టు 10 నాటికి తొలి విడతగా విజయవంతంగా పూర్తయింది. బీజేపీ నాయకులు, అభినయ్ గౌడ్, గోనే శ్రీకాంత్ రెడ్డి, పవన్, మణి, సహాయం కోసం ఉప్పర్‌పల్లి బీజేపీ కార్యాలయ హెల్ప్‌డెస్క్‌ను సంప్రదించవచ్చని తెలిపారు.

హెల్ప్‌డెస్క్: 9000089911, 8885559911 బీజేపీ సేవా సైనికులు, కార్యకర్తలు ఉప్పర్‌పల్లి – హైదర్‌గూడ

# ఉప్పర్‌పల్లిలో మిన్నుముట్టిన శ్రీ మహంకాళమ్మ, పోచమ్మ బోనాల జాతర ఉత్సవాలు

**ఉప్పర్‌పల్లి వెలుతురు ఆగస్టు 10:**

ఉప్పర్‌పల్లి గ్రామంలో శ్రీ మహంకాళమ్మ, పోచమ్మ బోనాల ఉత్సవాలు అత్యంత వైభవంగా, ఆధ్యాత్మిక శోభతో కన్నులపండువగా ముగిసాయి. ప్రతి ఏటా ఆషాఢ మాసంలో లాల్ దర్వాజా బోనాల తర్వాతి వారంలో, ఆషాఢ మాసపు చివరి ఘట్టంగా ఉప్పర్‌పల్లి బోనాల సంబరాలు నిర్వహించడం ఆనవాయితీ. ఈ క్రమంలోనే నిన్న (9వ తేదీ) సాయంత్రం గ్రామస్తులందరూ కలసికట్టుగా శ్రీ మహా మహంకాళమ్మ అమ్మవారికి బోనాలను ఎంతో కోలాహలంగా సమర్పించారు.ఉత్సవాల్లో భాగంగా ఈ రోజు మధ్యాహ్నం శ్రీ పోచమ్మ అమ్మవారి బోనాల మహోత్సవాన్ని అట్టహాసంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో శివసత్తుల పూనకాలు, పోతురాజుల విన్యాసాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మహిళలు పెద్ద ఎత్తున గండ దీపాలు, భక్తిశ్రద్ధలతో ఎత్తిన బోనాలతో ఊరేగింపుగా తరలివచ్చి అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు.

విశిష్ట ప్రముఖులు & పాల్గొన్న గ్రామస్థులు,ఈ ఆధ్యాత్మిక వేడుకలో గ్రామ పెద్దలు, వివిధ రంగాల ప్రముఖులు మరియు ఉప్పర్‌పల్లి గ్రామస్థులు భారీ సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులయ్యారు.

పాల్గొన్న వారిలో శ్రీ సామ భూపాల్ రెడ్డి గారు, యెంపల్లి మోహన్ రెడ్డి



, రేస్ నరసింహారెడ్డి , బొక్కా బాల్ రెడ్డి , పుస్తకాల నరసింహారావు పోరెడ్డి విజయపాల్ రెడ్డి బొక్క ప్రభాకర్ రెడ్డి, కృష్ణ గౌడ్, (కిట్)టు, కిషన్ రావు, బొక్కా మల్లారెడ్డి, ఎ. భూపాల్ రెడ్డి, భుజంగం రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, సందీప్ గౌడ్, మహేందర్, శ్రీవర్ధన్, సజీవన్, పసుపుల దినేష్, వై. శ్రీధర్ రెడ్డి, సిహెచ్ వెంకట్ రెడ్డి నరసింహారెడ్డి, మధు, సుధాకర్, గోపి లతో పాటు అనేకమంది ఉప్పర్‌పల్లి గ్రామ ప్రజలు భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు.గ్రామ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సంతోషంగా ఉండాలని అమ్మవారిని ప్రార్థించినట్లు నిర్వాహకులు తెలిపారు.

# సోలిటైర్ ఫిట్‌నెస్ నుంచి సోలిటైర్ జిమ్‌గా కొత్త రూపం

- నాగోల్‌లో గ్రాండ్ ఓపెనింగ్‌తో కొత్త అధ్యాయానికి శ్రీకారం

**హైదరాబాద్, వెలుతురు ఆగస్టు 10, 2026:**

హైదరాబాద్ ఫిట్‌నెస్ రంగంలో 2014 నుంచి తనదైన గుర్తింపును సంపాదించుకున్న సోలిటైర్ ఫిట్‌నెస్, ఇప్పుడు సోలిటైర్ జిమ్గా సరికొత్త రూపంలోకి అడుగుపెట్టింది. నూతన బ్రాండ్ గుర్తింపుతో పాటు ఆధునిక సదుపాయాలు, అప్‌గ్రేడ్ చేసిన ఫిట్‌నెస్ పరికరాలు, మెరుగైన ట్రైనింగ్ వాతావరణంతో నాగోల్‌లోని సోలిటైర్ జిమ్‌ను సోమవారం ఘనంగా ప్రారంభించారు.గణనీయమైన రీనోవేషన్, ఆధునీకరణ అనంతరం నాగోల్ ఫెసిలిటీ, సోలిటైర్ చేపట్టిన విస్తృత బ్రాండ్ ట్రాన్స్‌ఫర్మేషన్‌లో తొలి కీలక అడుగుగా నిలిచింది. సభ్యులకు మరింత ఆధునిక, ప్రొఫెషనల్, వ్యక్తిగత అనుభూతిని అందించేలా జిమ్‌ను తీర్చిదిద్దారు.కొత్త సోలిటైర్ జిమ్‌లో ఆధునిక ఫిట్‌నెస్ పరికరాలు, విస్తృతమైన ట్రైనింగ్ స్పేస్‌లు, ప్రొఫెషనల్ ఫిట్‌నెస్ గైడెన్స్, మెరుగైన పరిశుభ్రత–నిర్వహణ ప్రమాణాలు, మెంబర్ సపోర్ట్ సర్వీసులు, విశాలమైన పార్కింగ్ వంటి సదుపాయాలను అందుబాటులోకి తీసుకువచ్చారు.గత దశాబ్ద కాలంలో ఒకే ఫిట్‌నెస్ సెంటర్ నుంచి హైదరాబాద్‌లోని పలు ప్రాంతాలకు విస్తరించిన సోలిటైర్, వేలాది మంది సభ్యులతో కూడిన ఫిట్‌నెస్ కమ్యూనిటీగా ఎదిగింది. సోలిటైర్ ఫిట్‌నెస్ నుంచి సోలిటైర్ జిమ్‌గా పరిణామం సభ్యుల మారుతున్న అవసరాలకు అనుగుణంగా సేవలను నిరంతరం మెరుగుపరచాలనే సంస్థ నిబద్ధతకు ప్రతీకగా నిలుస్తుందని నిర్వాహకులు తెలిపారు.

**సమగ్ర ఫిట్‌నెస్‌కు ప్రాధాన్యం**

సోలిటైర్ జిమ్ కేవలం ఆధునిక పరికరాలు, మౌలిక సదుపాయాలకే పరిమితం కాకుండా సమగ్ర ఫిట్‌నెస్‌పై దృష్టి సారిస్తోంది. సర్టిఫైడ్, అనుభవజ్ఞులైన ఫిట్‌నెస్ ట్రైనర్ల మార్గదర్శకత్వంతో పాటు న్యూట్రిషన్ గైడెన్స్, వెయిట్ లాస్ ప్రోగ్రామ్‌లు, పెర్ఫార్మెన్స్ & ఫంక్షనల్ ట్రైనింగ్, మహిళల కోసం ప్రత్యేక ఫిట్‌నెస్ కార్యక్రమాలు, సీనియర్ ఫిట్‌నెస్ ప్రోగ్రామ్‌లు, కార్డియో & ఎండ్యూరెన్స్ ట్రైనింగ్, స్ట్రెంగ్త్ మరియు మసిల్ బిల్డింగ్ వంటి విభాగాలకు ప్రాధాన్యం ఇస్తోంది.

**"నాగోల్ కొత్త అధ్యాయానికి తొలి అడుగు"**

ఈ సందర్భంగా సోలిటైర్ ఇంటర్నేషనల్ LLP వ్యవస్థాపకుడు, డైరెక్టర్ శ్రీ మిర్ ముర్తుజా అలీ మాట్లాడుతూ, "హైదరాబాద్ ఫిట్‌నెస్



ప్రయాణంలో సోలిటైర్ ఒక దశాబ్దానికి పైగా భాగస్వామిగా ఉంది. సోలిటైర్ ఫిట్‌నెస్ నుంచి సోలిటైర్ జిమ్‌గా మారడం మా సభ్యుల అవసరాలు, ఫిట్‌నెస్ రంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా అభివృద్ధి చెందాలనే మా నిబద్ధతకు ప్రతీక. నాగోల్ ఈ కొత్త అధ్యాయంలో తొలి అడుగు. మరింత ఆధునిక, ప్రొఫెషనల్ మరియు మెరుగైన అనుభూతిని అందించే సోలిటైర్‌ను హైదరాబాద్‌కు పరిచయం చేస్తున్నందుకు ఎంతో సంతోషంగా ఉంది," అని అన్నారు. గ్రాండ్ ఓపెనింగ్ కార్యక్రమంలో సోలిటైర్ ఇంటర్నేషనల్ LLP కీలక నాయకత్వ బృందం పాల్గొంది. ఫౌండర్ & డైరెక్టర్ శ్రీ మిర్ ముర్తుజా అలీ, అకడమిక్ డైరెక్టర్ శ్రీ దనియాల్ ముర్తుజా అలీ, CTO & డైరెక్టర్ శ్రీ సులైమాన్ ముర్తుజా అలీ హాజరయ్యారు. ప్రత్యేక అతిథిగా శ్రీమతి శ్రావంతి చొక్కారపు పాల్గొన్నారు.

**ఫిట్‌నెస్ అంటే కేవలం వ్యాయామం కాదు**

కొత్త గుర్తింపుతో సోలిటైర్ జిమ్ సభ్యుల ఫిట్‌నెస్ ప్రయాణంలో నిరంతర మద్దతు, ప్రేరణ, ఆత్మవిశ్వాసాన్ని అందించే వాతావరణాన్ని నిర్మించడమే లక్ష్యంగా పెట్టుకుంది. వెయిట్ మేనేజ్‌మెంట్, స్ట్రెంగ్త్ బిల్డింగ్, మెరుగైన పెర్ఫార్మెన్స్ లేదా ఆరోగ్యకరమైన జీవనశైలి—ఏ లక్ష్యమైనా సభ్యులకు తగిన మార్గదర్శకత్వం అందించడంపై దృష్టి సారిస్తోంది.తక్షణ ఫలితాలు లేదా తాత్కాలిక ప్రేరణ కంటే దీర్ఘకాలిక ఆరోగ్యకరమైన అలవాట్ల నిర్మాణమే సోలిటైర్ జిమ్ ఫిట్‌నెస్ ఫిలాసఫీగా సంస్థ పేర్కొంది. క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, ఆరోగ్యం, శారీరక సామర్థ్యాన్ని పెంపొందించుకోవడంతో పాటు ప్రతి వ్యక్తి తన పూర్తి సామర్థ్యాన్ని సాధించేలా ప్రోత్సహించడం తమ లక్ష్యమని తెలిపింది.

# ₹15,600 డీడీ చెల్లించినా అక్రమ వసూళ్లు?

- టీజీఎండీసీ అధికారుల కనుసన్నల్లోనే కాంట్రాక్టర్ల వసూళ్లు జరుగుతున్నాయా?

**వెలుతురు కరీంనగర్ జిల్లా, ఆగస్టు 10:**

కొరకల్ ఇసుక ర్యాంప్‌లో లారీ యజమానుల నుంచి అక్రమంగా అదనపు లోడింగ్ డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. టీజీఎండీసీ నిబంధనల ప్రకారం ఇప్పటికే ₹15,600 డీడీ పేమెంట్ చేసిన తర్వాత కూడా అదనంగా ₹3,500 వసూలు చేస్తున్నారని పెద్ద అంబర్‌పేట్ ఇసుక లారీ ఓనర్స్ అసోసియేషన్ ఆరోపించింది.ఇంత బహిరంగంగా అదనపు వసూళ్లు జరుగుతున్నా టీజీఎండీసీ అధికారులు చర్యలు తీసుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది అని అసోసియేషన్ పేర్కొంది. ర్యాంప్‌లపై మైనింగ్ విజిలెన్స్ పర్యవేక్షణ కూడా కరువైందని ఆందోళన వ్యక్తం చేసింది. ఏసీబీ విచారణకు డిమాండ్కొ రకల్ ఇసుక ర్యాంప్‌లో జరుగుతున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న అక్రమ వసూళ్లపై అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు సమగ్ర విచారణ జరిపించాలని పెద్ద అంబర్‌పేట్ ఇసుక లారీ ఓనర్స్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. ₹15,600 డీడీ చెల్లించిన తర్వాత అదనంగా వసూలు చేస్తున్న ₹3,500 ఏ ప్రాతిపదికన? ఈ మొత్తాలు ఎవరికి వెళ్తున్నాయి? వసూళ్లపై టీజీఎండీసీ అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు? ఈ అంశాలపై పూర్తి స్థాయి విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని అసోసియేషన్ కోరింది. పెద్ద అంబర్‌పేట్ ఇసుక లారీ ఓనర్స్




అసోసియేషన్ "అక్రమ వసూళ్లకు అడ్డుకట్ట వేయాలి – యజమానులకు న్యాయం చేయాలి."

# 4.21 లక్షల మంది మత్స్యకారులకు ప్రమాద బీమా

- రూ.5 లక్షల వరకు పరిహారం
- మత్స్యకార కుటుంబాలకు ప్రభుత్వం భరోసా
- 4,21,767 మందికి నేరుగా ప్రయోజనం
- జూన్ 1 నుంచే బీమా పథకం అమలు
- మరణం, పూర్తి వైకల్యానికి రూ.5 లక్షలు
- పాక్షిక వైకల్యానికి రూ.2.50 లక్షలు
- ప్రీమియం కోసం రూ.1.34 కోట్లు చెల్లింపు
- ప్రమాదకర వృత్తిలో భద్రతకు ఊతం

**హైదరాబాద్, వెలుతురు, ఆగస్టు 10:**

తెలంగాణలోని మత్స్యకార కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా నమోదైన మత్స్యకారులకు గ్రూప్ ప్రమాద బీమా సౌకర్యాన్ని కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ పథకం ద్వారా 4,21,767 మంది నమోదిత మత్స్యకారులకు నేరుగా ప్రయోజనం చేకూరనుంది.మత్స్యకారుల సామాజిక భద్రతకు ప్రాధాన్యమిస్తూ ఈ ప్రమాద బీమా పథకాన్ని 2026 జూన్ 1 నుంచే అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. బీమా ప్రీమియం చెల్లింపుల్లో ప్రభుత్వ వాటాగా మత్స్యశాఖ ద్వారా రూ.1.34 కోట్లను ఇప్పటికే సంబంధిత ఇన్సూరెన్స్ కంపెనీకి చెల్లించినట్లు ప్రభుత్వం వెల్లడించింది.చేపల వేటకు వెళ్లిన సమయంలో ప్రమాదం జరిగినా, ఇతర ప్రమాదాల కారణంగా మత్స్యకారుడు మరణించినా బీమా పరిహారం అందుతుంది. ప్రమాదవశాత్తు మరణం లేదా శాశ్వత సంపూర్ణ వైకల్యం సంభవిస్తే కుటుంబానికి రూ.5 లక్షల వరకు బీమా పరిహారం



లభిస్తుంది.అదేవిధంగా ప్రమాదం కారణంగా శాశ్వత పాక్షిక అంగవైకల్యం ఏర్పడిన సందర్భంలో రూ.2.50 లక్షల వరకు బీమా రక్షణ కల్పిస్తారు. దీంతో ప్రమాదకర పరిస్థితుల్లో నీటి వనరులపై ఆధారపడి జీవించే మత్స్యకార కుటుంబాలకు ఆర్థికంగా కొంత భరోసా లభించనుంది.మత్స్యకారుల జీవనోపాధి స్వభావరీత్యా ప్రమాదాలతో ముడిపడి ఉండటంతో ఈ బీమా పథకం వారికి ఉపయోగకరంగా ఉంటుందని మత్స్యకార సంఘాలు పేర్కొన్నాయి. కుటుంబానికి ప్రధాన ఆధారమైన వ్యక్తి ప్రమాదంలో మరణించినప్పుడు లేదా వైకల్యానికి గురైనప్పుడు ఒక్కసారిగా ఎదురయ్యే ఆర్థిక భారాన్ని తగ్గించడంలో బీమా పరిహారం తోడ్పడుతుందని తెలిపాయి.రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మత్స్యకారులను ఒకే గ్రూప్ ప్రమాద బీమా పరిధిలోకి తీసుకురావడం ద్వారా వారి సామాజిక భద్రతకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇచ్చినట్లయింది. ప్రమాదాల సమయంలో బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించడమే ఈ పథకం ప్రధాన ఉద్దేశంగా ప్రభుత్వం పేర్కొంది.

# కాళేశ్వరం మోటార్లు ఆన్ చేసి రైతులను ఆదుకోవాలి

- మాజీ మంత్రి హరీశ్‌రావు డిమాండ్
- వెంటనే నీటి పంపింగ్ ప్రారంభించాలని డిమాండ్
- రిజర్వాయర్లను సకాలంలో నింపాలని సూచన
- నాలుగు లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలని లేఖ
- మిడ్‌మానేరు నుంచి నీటిని ఎత్తిపోయాలని విజ్ఞప్తి
- వర్షాభావంతో రైతుల్లో ఆందోళన ఉందని వెల్లడి
- ప్రతి నీటి చుక్కను ఒడిసిపట్టాలని సూచన
- యాసంగి సాగును దృష్టిలో పెట్టుకోవాలని హితవు

**హైదరాబాద్, వెలుతురు, ఆగస్టు 10:**

కాళేశ్వరం ప్రాజెక్టులోని మోటార్లను వెంటనే ఆన్ చేసి రిజర్వాయర్లను నీటితో నింపాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు కోరారు. ఈ మేరకు రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి ఆయన బహిరంగ లేఖ రాశారు. వర్షాభావ పరిస్థితులు, ఎల్‌నినో ప్రభావంతో రైతులు ఆందోళన చెందుతున్న నేపథ్యంలో రాజకీయాలకు అతీతంగా



సాగునీటి పంపింగ్ చేపట్టాలని డిమాండ్ చేశారు.మిడ్‌మానేరు రిజర్వాయర్ నుంచి మోటార్లను నడిపి నీటిని ఎత్తిపోయాలని హరీశ్‌రావు సూచించారు. రిజర్వాయర్లలో నీటిని సకాలంలో నిల్వ చేయకపోవడంతో పంటల సాగు విషయంలో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో గోదావరిలో వరద నీటి లభ్యత పెరిగే అవకాశం ఉన్నందున ఆ నీటిని పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని అన్నారు.మిడ్‌మానేరు పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 27 టీఎంసీలు కాగా ప్రస్తుతం సుమారు 22 టీఎంసీల నీరు అందుబాటులో ఉందని హరీశ్‌రావు తెలిపారు. ఈ పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని ఆలస్యం చేయకుండా మోటార్లు ఆన్ చేసి నీటిని పంపింగ్ చేయాలని కోరారు.మిడ్‌మానేరు నుంచి నీటిని ఎత్తిపోసి అన్నపూర్ణ (అంతగిరి), రంగనాయక సాగర్, మల్లన్న సాగర్, కొండపోచమ్మ సాగర్, నృసింహ (బస్వాపూర్) రిజర్వాయర్లను నింపాలని సూచించారు. ఆయా రిజర్వాయర్ల పరిధిలోని చెరువులు, చెక్‌డ్యామ్‌లకు కూడా నీటిని అందుబాటులోకి తీసుకురావాలని పేర్కొన్నారు. తద్వారా సుమారు నాలుగు లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించే అవకాశం ఉంటుందని తెలిపారు.వచ్చే యాసంగి పంటను కూడా దృష్టిలో పెట్టుకుని ఇప్పటి నుంచే నీటి నిల్వలపై ప్రణాళిక రూపొందించాలని హరీశ్‌రావు కోరారు. మిడ్‌మానేరు నుంచి లోయర్ మానేరు డ్యామ్‌కు నీటిని తరలించి, ఎస్సారెస్పీ స్టేజ్–2 పరిధిలోని ఆయకట్టుకు సాగునీరు అందించాలని సూచించారు. గత యాసంగి సీజన్‌లో కాళేశ్వరం ప్రాజెక్టులోని ఎగువ రిజర్వాయర్ల పరిధిలో సుమారు నాలుగు లక్షల ఎకరాల్లో సాగు జరిగిందని హరీశ్‌రావు పేర్కొన్నారు. అదే స్థాయిలో ప్రస్తుత వానాకాలంతో పాటు రానున్న యాసంగి పంటకు కూడా నీరందించేలా కాళేశ్వరం పరిధిలోని అన్ని రిజర్వాయర్లను నింపేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# కోటిమందికి స్మార్ట్ కార్డుల పంపిణీ

- 15న సంగారెడ్డికి సీఎం రేవంత్‌రెడ్డి
- హెలిప్యాడ్, సభా ప్రాంగణం పరిశీలన
- తారా డిగ్రీ కాలేజీలో హెలిప్యాడ్
- అంబేద్కర్ స్టేడియంలో భారీ సభ
- కోటి 5 లక్షల మందికి కార్డులు
- బీఆర్ఎస్ పాలనపై జగ్గారెడ్డి విమర్శలు
- 50 వేల మందితో సభ నిర్వహణకు ఏర్పాట్లు

**సంగారెడ్డి, వెలుతురు, ఆగస్టు 10:**

సంగారెడ్డిలో ఈనెల 15న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటించనున్నారు. ఈ సందర్భంగా నూతన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో సీఎం పాల్గొననున్నారు. సీఎం పర్యటన నేపథ్యంలో సోమవారం తారా డిగ్రీ కాలేజీలో ఏర్పాటు చేయనున్న హెలిప్యాడ్, అంబేద్కర్ స్టేడియంలోని సభ ప్రాంగణాన్ని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రతిక్ జైన్, ఎస్పీ పరితోష్ పంకజ్ పరిశీలించారు.అనంతరం జగ్గారెడ్డి మాట్లాడుతూ గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో అరకొరగా మాత్రమే రేషన్ కార్డులు జారీ చేశారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా కోటి 5 లక్షల మందికి స్మార్ట్ రేషన్ కార్డులు అందించేందుకు చర్యలు చేపట్టిందని తెలిపారు.స్మార్ట్ రేషన్ కార్డుల విషయంలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, సీఎం రేవంత్‌రెడ్డి తీసుకున్న నిర్ణయం అభినందనీయమని జగ్గారెడ్డి అన్నారు. ప్రజలకు ఉపయో



గపడే కార్యక్రమాలను కాంగ్రెస్ ప్రభుత్వం నిబద్ధతతో అమలు చేస్తోందని పేర్కొన్నారు.ఇది ప్రభుత్వ కార్యక్రమమైనప్పటికీ కాంగ్రెస్ పార్టీ తరఫున సీఎం రేవంత్‌రెడ్డికి ఘన స్వాగతం పలుకుతామని జగ్గారెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా అంబేద్కర్ స్టేడియంలో సుమారు 50 వేల మందితో భారీ సభ నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు.సీఎం పర్యటన విజయవంతంగా జరిగేలా అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు చేస్తున్నారని కలెక్టర్, ఎస్పీతో కలిసి సభా ప్రాంగణం, హెలిప్యాడ్ ప్రాంతాలను పరిశీలించినట్లు జగ్గారెడ్డి తెలిపారు.

# తలసేమియా, సికిల్ సెల్ చిన్నారులకు ప్రభుత్వం అండ

- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి
- పెన్షన్ అందేలా చర్యలు చర్యలు తీసుకుంటాం
- అర్హులందరికీ పథకం వర్తింపు
- హనుమకొండలో హెల్ప్‌డెస్క్ ప్రారంభం
- పేద కుటుంబాలకు భరోసా
- అవసరమైతే ఇందిరమ్మ ఇళ్లు
- రక్తదాన సేవలపై ప్రశంసలు
- రెడ్‌క్రాస్‌కు ప్రభుత్వ సహకారం



**హనుమకొండ, వెలుతురు, ఆగస్టు 10:**

తలసేమియా, సికిల్ సెల్ వ్యాధులతో బాధపడుతున్న చిన్నారుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని ప్రజాప్రతినిధులు తెలిపారు. హనుమకొండలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని, చిన్నారులకు ప్రభుత్వం అందిస్తున్న పెన్షన్ పథకంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పెన్షన్ మంజూరుకు సంబంధించిన ప్రత్యేక హెల్ప్‌డెస్క్‌ను ప్రారంభించారు.దీర్ఘ కాలిక వ్యాధులతో బాధపడుతున్న చిన్నారుల చికిత్స, రక్తం అందించడం వంటి అంశాలు పేద, మధ్యతరగతి కుటుంబాలపై తీవ్ర ఆర్థిక భారాన్ని మోపుతున్నాయని పేర్కొన్నారు. పిల్లల అనారోగ్యంతో కుటుంబాలు మానసికంగా, ఆర్థికంగా ఎంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో వారికి ప్రభుత్వం భద్రత, భరోసా కల్పించేలా చర్యలు తీసుకుంటోం దన్నారు.ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం ప్రారంభించిన అభయహస్తం పెన్షన్ పథకం తలసేమియా, సికిల్ సెల్ వ్యాధులతో బాధపడుతున్న అర్హులైన చిన్నారులందరికీ అందేలా చూడాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. అర్హత ఉన్నప్పటికీ పథకం అందని కుటుంబాలను గుర్తించి, వారికి అవసరమైన సహాయం అందించేందుకు హెల్ప్‌డెస్క్ ఉపయోగపడుతుందని చెప్పారు.దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న అర్హులైన కుటుంబాలకు అవసరమైతే ఇందిరమ్మ ఇళ్లను కూడా మంజూరు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని భరోసా ఇచ్చారు. వైద్య ఖర్చులతో పాటు నివాస సమస్యలతో ఇబ్బంది పడుతున్న కుటుంబాలకు ప్రభుత్వ పథకాల ద్వారా సాధ్యమైనంత ఎక్కువ సహాయం అందించడమే లక్ష్యమన్నారు.తలసేమియా, సికిల్ సెల్ వ్యాధిగ్రస్తులకు అవసరమైన రక్తాన్ని స్వచ్ఛందంగా సేకరించి అందిస్తున్న ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధులు, సిబ్బంది, స్వచ్ఛంద సేవకుల సేవలను ఈ సందర్భంగా అభినందించారు. రక్తదాన కార్యక్రమాలతో పాటు దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు నిరంతరం సేవలందించడం అభినందనీ యమన్నారు.చిన్నారుల ఆరోగ్యం, వారి కుటుంబాల సంక్షేమానికి సంబంధించి రెడ్‌క్రాస్ సొసైటీ చేస్తున్న సేవలకు ప్రజా ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని తెలిపారు. తలసేమియా, సికిల్ సెల్ వంటి వ్యాధులతో బాధపడుతున్న చిన్నారులకు సమాజం కూడా అండగా నిలవాలని పిలుపునిచ్చారు.

# విద్యార్థులకు రహదారి భద్రతపై పాఠాలు

- ప్రమాదాల నివారణపై అవగాహన
- అరైవ్ అలైవ్ కార్యక్రమంలో అవగాహన
- ఆర్మీ పబ్లిక్ స్కూల్‌లో ప్రత్యేక కార్యక్రమం
- విద్యార్థులు, ఉపాధ్యాయులకు సూచనలు
- ట్రాఫిక్ నిబంధనలపై కీలక వివరణ
- మైనర్ డ్రైవింగ్‌కు దూరంగా ఉండాలని సూచన
- మొబైల్ వాడకంతో ప్రమాదాలపై హెచ్చరిక

**హైదరాబాద్, వెలుతురు, ఆగస్టు 10:**

రహదారి భద్రతపై చిన్నారుల్లోనే అవగాహన పెంచితే భవిష్యత్తులో ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. 'అరైవ్ అలైవ్' రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమంలో భాగంగా తిరుమల గిరిలోని ఆర్మీ పబ్లిక్ స్కూల్, ఆర్‌కే పురం విద్యార్థులు, ఉపాధ్యాయులకు ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు.తిరుమలగిరి ట్రాఫి క్ డివిజన్ ఏసీపీ జి. శంకర్ రాజు కార్యక్ర మంలో పాల్గొని విద్యార్థులకు రహదారి భద్రతపై పలు అంశాలను వివరించారు. రోడ్లపై వాహనాలు నడిపే సమయంలో ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచిం చారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా మన ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలను కూడా కాపాడవచ్చని తెలిపారు. ద్విచక్ర వాహనా లపై ప్రయాణించే సమయంలో హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, కార్లలో ప్రయాణించే వారు సీటుబెల్ట్ పెట్టుకోవాలని సూచించారు. ట్రాఫిక్ సిగ్నళ్లను ఉల్లంఘిం చకుండా, రహదారి నియమాలను నిర్లక్ష్యం చేయడం వల్ల చిన్న తప్పిదం కూడా తీవ్ర ప్రమాదానికి దారితీసే అవకాశం ఉందని హెచ్చరించారు.వాహనం నడుపుతున్న సమయంలో మొబైల్ ఫోన్ ఉపయోగించడం అత్యంత ప్రమాదకరమని ఏసీపీ తెలిపారు. ఫోన్‌పై దృష్టి పెట్టడం వల్ల డ్రైవర్ ఏకాగ్రత కోల్పోయి క్షణాల్లో ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉందన్నారు. డ్రైవింగ్ సమయంలో



ఫోన్‌కు పూర్తిగా దూరంగా ఉండాలని విద్యార్థులకు సూచించారు.మైనర్లు వాహనాలు నడపకుండా తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకో వాలని కోరారు. వయసు రాకముందే వాహనం నడపడం చట్టపరమైన సమస్యలతో పాటు ప్రాణాపాయానికి కూడా కారణమవుతుందని వివరించారు. విద్యార్థులు తమ తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులకు కూడా రహదారి భద్రత నిబంధనలను తెలియజేయాలని సూచిం చారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించడం కేవలం పోలీసుల భయంతో కాకుండా స్వీయ భద్రత కోసం అలవాటుగా మార్చుకోవాలని పిలుపు నిచ్చారు.విద్యార్థులు చిన్న వయసు నుంచే రహదారి భద్రతపై అవగాహన పెంచుకోవడం ద్వారా భవిష్యత్తులో సురక్షితమైన ప్రయాణ సంస్కృతిని తీసుకురావచ్చని అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు రహదారి భద్రతకు సంబం ధించిన , నిబంధనలను తెలుసుకున్నారు.

# మేడారంలో సమ్మక్క–సారలమ్మను దర్శించుకున్న మంత్రి సీతక్క

- వనదేవతలకు ప్రత్యేక పూజలు
- ప్రజల సుఖసంతోషాల కోసం ప్రార్థనలు
- సీఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన
- అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్ష
- క్యూ లైన్లు, పీటీ బీమ్స్ పరిశీలన
- మీడియా టవర్ల పనులపై ఆరా
- పనులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశం

**మేడారం, వెలుతురు, ఆగస్టు 10:**

మేడారంలోని సమ్మక్క–సారలమ్మ వనదేవతలను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు రాష్ట్ర మంత్రి సీతక్క తెలిపారు. రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని, తెలంగాణ పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని వనదేవతలను ప్రార్థించినట్లు చెప్పారు.అనంతరం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మేడారం పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించినట్లు మంత్రి తెలిపారు. ముఖ్యమంత్రి పర్యటనలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించినట్లు చెప్పారు.మేడారం ఆలయ అభివృద్ధి పనులతో పాటు భక్తుల సౌకర్యాల కోసం చేపడుతున్న క్యూ లైన్లు, పీటీ బీమ్స్, మీడియా టవర్ల నిర్మాణ పనులను పరిశీలించినట్లు సీతక్క వెల్లడించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలని అధి కారులను ఆదేశించినట్లు తెలిపారు.అభివృద్ధి పనుల్లో జాప్యానికి తావులేకుండా నాణ్యతతో పాటు వేగంగా పనులు పూర్తి చేయాలని అధికా రులకు స్పష్టం చేసినట్లు మంత్రి చెప్పారు. మేడారానికి వచ్చే భక్తులకు సౌకర్యవంతమైన దర్శనం కల్పించడమే ప్రధాన లక్ష్యంగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించినట్లు తెలిపారు.సమ్మక్క–సారలమ్మ వనదే వతల దర్శనానికి వచ్చే భక్తుల భద్రత, సౌకర్యాలకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని సీతక్క పేర్కొన్నారు. సీఎం పర్యటన విజయ వంతంగా జరిగేలా అధికారులు సమన్వయంతో పనిచేసి అవసరమైన



అన్ని ఏర్పాట్లను సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించినట్లు తెలిపారు.

# పొంగులేటి వర్సెస్ పాడి కౌశిక్ రెడ్డి

- డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల వేదికగా మాటల యుద్ధం
- డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల ప్రారంభో త్సవంలో ఉద్రిక్తత
- ప్రభుత్వ కార్యక్రమంలో పొంగులేటి రాజకీయ వ్యాఖ్యలు
- అబద్ధాలు చెప్పొద్దంటూ కౌశిక్ రెడ్డి అభ్యంతరం
- నిజాలు మాట్లాడాలని ఎమ్మెల్యే స్పష్టం
- రాజకీయాలకు ఇది వేదిక కాదన్న పాడి
- ఇళ్ల నిర్మాణంపై ఇరువైపులా భిన్న వాదనలు
- ప్రజలకు వాస్తవాలు చెప్పాలంటూ కౌశిక్ రెడ్డి సూచన



**హన్మకొండ, వెలుతురు, ఆగస్టు 10:**

హన్మకొండ జిల్లా కమలాపూర్ మండలంలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల ప్రారంభోత్సవ కార్యక్రమం రాజకీయ విమర్శలకు వేదికగా మారింది. కార్యక్రమంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్ మాట్లాడుతున్న సమయంలో గత ప్రభుత్వ పాలన, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణం తదితర అంశాలపై రాజకీయ వ్యాఖ్యలు రావడంతో హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో ప్రభుత్వ కార్యక్రమం వేదికగా మంత్రి పొంగులేటి వ్యాఖ్యలకు ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి కౌంటర్ ఇవ్వడం చర్చనీయాంశంగా మారింది.కమ లాపూర్ మండలంలో కేసీఆర్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను లబ్ధిదారులకు అందించే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్ర మానికి మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్ హాజరయ్యారు. ఇళ్ల నిర్మాణం, గత ప్రభుత్వ విధానం, ప్రస్తుత ప్రభుత్వం చేపడుతున్న కార్యక్ర మాలపై మంత్రులు మాట్లాడారు.ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రసంగంలో రాజకీయ అంశాలను ప్రస్తావించడంపై ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి అభ్యంతరం వ్యక్తం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిందని.. తాము ఎన్ని అప్పులు ఉన్నా వాటిని చక్క దిద్దుతూ ప్రజలకు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని మంత్రి పొంగులేటి పేర్కొన్నారు. దీంతో ప్రభుత్వం నిర్వహిస్తున్న కార్యక్రమంలో రాజకీయ విమర్శలు చేయడం సరికాదని ఆయన పొంగులేటి అడ్డుకున్నారు. గత ప్రభుత్వం నిర్మించిన ఇళ్లను లబ్ధి దారులకు అందించే కార్యక్రమంలో వాస్తవాలను మాత్రమే ప్రజలకు వివరించాలని సూచించారు."అబద్ధాలు చెప్పొద్దు.. నిజాలు మాట్లాడాలి. ఇది రాజకీయాలు చేయాల్సిన వేదిక కాదు. ప్రజలకు వాస్తవాలు చెప్పండి" అని కౌశిక్ రెడ్డి స్పష్టం చేశారు. మంత్రులు మాట్లాడుతున్న సమయంలోనే ఆయన ఈ అభ్యంతరం వ్యక్తం చేయడంతో కార్యక్రమంలో కొంతసేపు వాగ్వాద వాతావరణం నెలకొంది.డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల విషయంలో తమ ప్రభుత్వ హయాంలో జరిగిన పనులను ప్రజలకు తెలియజేస్తున్నామని బీఆర్ఎస్ వర్గం చెబుతుండగా.. గత ప్రభుత్వ పనితీరుపై ప్రస్తుత ప్రభుత్వం భిన్నమైన వాదనను వినిపిస్తోంది. దీంతో ఒకే కార్యక్రమంలో రెండు పార్టీలకు చెందిన నేతల మధ్య రాజకీయ వ్యాఖ్యలు, వాటికి ప్రతివాదనలు చోటుచేసుకున్నాయి.ప్రజలకు ఇళ్లను అందించే కార్యక్రమంలో రాజకీయ విమర్శల కంటే లబ్ధిదా రులకు సంబంధించిన అంశాలపై దృష్టి పెట్టాలని కౌశిక్ రెడ్డి అన్నారు. ప్రభుత్వం నిర్వహించే కార్యక్రమాల్లో వాస్తవాలను మాత్రమే మాట్లాడాలని, రాజకీయ ఆరోపణలు చేయడం వల్ల కార్యక్రమం ఉద్దేశం పక్కదారి పడుతుందని పేర్కొన్నారు.ఇలా డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల ప్రారంభోత్సవం సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి మధ్య మాటల యుద్ధం చోటుచేసుకుంది. ఒకవైపు గత ప్రభుత్వ పనితీరుపై కాంగ్రెస్ నేతలు విమర్శలు చేయగా.. మరోవైపు తమ ప్రభుత్వ హయాంలో నిర్మించిన ఇళ్ల కార్యక్రమంలో రాజకీ యాలు చేయవద్దంటూ కౌశిక్ రెడ్డి కౌంటర్ ఇవ్వడం ఈ కార్యక్రమంలో ప్రధాన చర్చగా మారింది.



# జంతర్ మంతర్ వద్ద ఎలాంటి కాల్పులు జరగలేదు: రాహుల్ గాంధీకి కేంద్ర మంత్రి జేపీ నడ్డా కౌంటర్

- విద్యార్థుల ఆందోళనపై రాహుల్ గాంధీ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు: తీవ్ర ఆగ్రహం
- రెండు వారాలుగా పార్లమెంట్ నడవకుండా విపక్షాలు అడ్డుపడుతున్నాయని విమర్శ
- చర్చ నుంచి పారిపోవడమే కాంగ్రెస్ నైజం.. సభకు వస్తే తగిన సమాధానం చెప్తామని సవాల్
- కేంద్ర హోంమంత్రి అమిత్ షా రాజీనామా చేయాలని రాహుల్ డిమాండ్



**న్యూఢిల్లీ వెలుతురు, ఆగస్టు 10:**

ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఆందోళన బాట పట్టిన విద్యార్థులపై ఎలాంటి కాల్పులు జరగలేదని, కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తప్పుడు ఆరోపణలతో దేశ ప్రజలను తీవ్రంగా తప్పుదోవ పట్టిస్తున్నారని కేంద్ర మంత్రి జేపీ నడ్డా సోమవారం స్పష్టం చేశారు. జంతర్ మంతర్ వద్ద నిరసన తెలుపుతున్న విద్యార్థులపై పెల్లెట్ తుపాకులు ఉపయోగించి కాల్పులు జరపడానికి ఎవరు ఉత్తర్వులు ఇచ్చారో కేంద్ర హోం మంత్రి అమిత్ షా స్పష్టం చేయాలని రాహుల్ గాంధీ డిమాండ్ చేసిన నేపథ్యంలో జేపీ నడ్డా ఈ వ్యాఖ్యలతో గట్టి కౌంటర్ ఇచ్చారు.

**సభను అడ్డుకోవడమే రాహుల్ గాంధీ లక్ష్యం: జేపీ నడ్డా**

ఈ సందర్భంగా జేపీ నడ్డా మాట్లాడుతూ.. రాహుల్ గాంధీ పార్లమెంట్‌ను సజావుగా సాగనివ్వడం లేదని, రోజుకో అంశాన్ని తెరపైకి తెస్తూ మాట్లాడే అంశాలను మార్చేస్తున్నారని దుయ్యబట్టారు. సభ ప్రారంభంలో నీట్ పరీక్షపై చర్చ కావాలని అడిగిన విపక్షాలు, ప్రభుత్వం దానికి సిద్ధపడగానే రామమందిరం ట్రస్ట్ అంశాన్ని, ఆ తర్వాత జంతర్ మంతర్ ఘటనను తెరపైకి తెచ్చాయని విమర్శించారు. సభలో ఆరోగ్యకరమైన చర్చ జరగడం రాహుల్ గాంధీకి ఎంతమాత్రమూ ఇష్టం లేదని, కేవలం అరాచకం సృష్టించడమే ఆయన నైజమని మండిపడ్డారు. జంతర్ మంతర్ వద్ద రక్షక బలగాలు తుపాకులు గానీ, పెల్లెట్ గన్స్ గానీ ఉపయోగించలేదని, ఎలాంటి కాల్పుల ఉత్తర్వులు ఇవ్వలేదని స్పష్టం చేశారు. ధైర్యముంటే రాహుల్ గాంధీ పార్లమెంట్‌కు వచ్చి చర్చలో పాల్గొనాలని, ఆయన లేవనెత్తే ప్రతి ప్రశ్నకు హోం మంత్రి అమిత్ షా సమాధానం ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నారని సవాల్ విసిరారు. జార్ఖండ్‌లో విద్యార్థుల నిరసనలను ముళ్లకంపలతో అడ్డుకుంటున్నా కాంగ్రెస్ నేతలు నోరు మెదపకపోవడం వారి ద్వంద్వ విధానాలకు నిదర్శనమని ఎద్దేవా చేశారు. అమిత్ షా సమాధానం చెప్పాలి.. రాజీనామా చేయాలి: రాహుల్ గాంధీ అంతకుముందు జరిగిన విలేకరుల సమావేశంలో రాహుల్ గాంధీ కేంద్ర ప్రభుత్వంపై, హోం మంత్రి అమిత్ షాపై పదునైన విమర్శలు గుప్పించారు. జూలై 20న జంతర్ మంతర్ వద్ద శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులపై లాఠీఛార్జ్ చేయడంతో పాటు పెల్లెట్ తుపాకులు ప్రయోగించడానికి ఎవరు ఆదేశాలు ఇచ్చారో హోం మంత్రి అమిత్ షా పార్లమెంట్‌లో స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఒకవేళ హోం మంత్రి ఆదేశాల మేరకే ఆ చర్యలు జరిగి ఉంటే ఆయన దానికి బాధ్యత వహించాలని, అలా కాకుండా ఆయనకు తెలియకుండానే ఇదంతా జరిగి ఉంటే అది ఆయన అ సమర్థతకు నిదర్శనమని, కాబట్టి ఏ రకంగా చూసినా అమిత్ షా వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. సభలో సాధారణ ఉపన్యాసాలు వినడానికి తాము సిద్ధంగా లేమని, విద్యార్థులపై జరిగిన దాడులకు బాధ్యులెవరో నేరుగా చెప్పాలని స్పష్టం చేశారు. పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెన్ రిజిజు స్పందిస్తూ విద్యార్థుల ఆందోళనలు, తదనంతర పరిణామాలపై సభలో సుదీర్ఘ చర్చకు ప్రభుత్వం సంపూర్ణ సిద్ధంగా ఉందని, హోం మంత్రి అమిత్ షా స్వయంగా పార్లమెంట్‌లో పూర్తి వివరాలతో ప్రకటన చేస్తారని స్పష్టం చేశారు. అయినప్పటికీ, వాస్తవాలను తెలుసుకునే ఉద్దేశం లేకుండా ప్రతిపక్షాలు సభను ఉద్దేశపూర్వకంగా అడ్డుకుంటున్నాయని, బాధ్యతాయుతమైన ప్రతిపక్షంగా వ్యవహరించాల్సింది పోయి రాజకీయ లబ్ధి కోసమే ఈ తరహా అవాస్తవాలను ప్రచారం చేస్తున్నాయని అధికార పక్ష నేతలు తీవ్రస్థాయిలో మండిపడ్డారు.

# ఎల్కతుర్తి అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం

- మంత్రి పొన్నం ప్రభాకర్
- ఎమ్మార్వో కార్యాలయానికి శంకుస్థాపన
- కస్తూర్బా పాఠశాల నూతన భవనం ప్రారంభం
- విద్యార్థినులకు మెరుగైన వసతులు కల్పిస్తున్నాం
- ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత చేరువ
- అభివృద్ధి పనులు వేగంగా పూర్తి చేయాలి
- నాణ్యత విషయంలో రాజీ వద్దు
- ప్రజా అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతులు

**ఎల్కతుర్తి, వెలుతురు, ఆగస్టు 10:**

హుస్నాబాద్ నియోజకవర్గం ఎల్కతుర్తి మండల కేంద్రంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రభుత్వం చేపట్టింది. ఎమ్మార్వో కార్యాలయ నూతన భవన నిర్మాణానికి మంత్రి పొన్నం ప్రభాకర్, సహచర మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల నూతన భవనాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. ఎల్కతుర్తి మండల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. ప్రజలకు రెవెన్యూ సేవలు మరింత సులభంగా అందుబాటులోకి తీసుకు రావాలనే ఉద్దేశంతో ఆధునిక సౌకర్యాలతో ఎమ్మార్వో కార్యాలయాన్ని నిర్మిస్తున్నట్లు చెప్పారు. కార్యాలయ నిర్మాణ పనులను వేగంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు.గ్రామీణ ప్రాంతాల విద్యార్థినులకు మెరుగైన విద్యా వసతులు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు. ఇందులో భాగంగానే కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల నూతన భవనాన్ని ప్రారంభించినట్లు చెప్పారు. విద్యతో పాటు విద్యార్థినులకు సురక్షితమైన వాతావరణం, అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం



చర్యలు తీసుకుంటోందన్నారు.ఎల్కతుర్తి మండలంలో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను దశల వారీగా మెరుగుపరుస్తామని పొన్నం ప్రభాకర్ తెలిపారు. అభివృద్ధి పనుల్లో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని, నిర్ణయించిన గడువులోగా పనులు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత చేరువ కావడంతో పాటు విద్య, మౌలిక వసతుల రంగాల్లో అభివృద్ధి సాధించేలా చర్యలు కొనసాగుతాయని చెప్పారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పేయి, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# హైదరాబాద్—బెంగళూరు డిఫెన్స్ కారిడార్‌కు కేంద్రం ఆమోదం తెలపాలి: ఏపీ జితేందర్ రెడ్డి

- ఉత్తరప్రదేశ్, తమిళనాడు తరహాలోనే డిఫెన్స్ అండ్ ఏరోస్పేస్ కారిడార్‌గా గుర్తించాలని విజ్ఞప్తి
- 2025—26లో ఏరోస్పేస్, డిఫెన్స్ ఎగుమతుల్లో 100 శాతం వృద్ధి సాధించిన తెలంగాణ

**న్యూఢిల్లీ వెలుతురు, ఆగస్టు 10:**

హైదరాబాద్—బెంగళూరు మార్గాన్ని కేంద్ర ప్రభుత్వ రక్షణ, ఏరోస్పేస్ కారిడార్‌గా అధికారికంగా గుర్తించి ఆమోదించాలని తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి, క్రీడా వ్యవహారాల సలహాదారు ఏపీ జితేందర్ రెడ్డి కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను కోరారు. న్యూఢిల్లీలోని రక్షణ మంత్రి అధికారిక నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసిన ఆయన, ఈ మేరకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం పార్లమెంట్ సభ్యులు ఆర్. రఘురామ్ రెడ్డి, మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యులు బలరామ్ నాయక్ కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జితేందర్ రెడ్డి మాట్లాడుతూ, ఉత్తరప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాల్లో ఏర్పాటు చేసిన డిఫెన్స్ కారిడార్ల తరహాలోనే హైదరాబాద్—బెంగళూరు మార్గాన్ని కూడా డిఫెన్స్ అండ్ ఏరోస్పేస్ కారిడార్‌గా ప్రకటించాలని ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి గతంలో చేసిన విజ్ఞప్తిని పునరుద్ఘాటించారు. దేశంలోనే అతిపెద్ద ఏరోస్పేస్, డిఫెన్స్ హబ్‌లలో హైదరాబాద్ ప్రధానమైనదని, ఇక్కడ డజనుకు పైగా ప్రముఖ డిఫెన్స్ పబ్లిక్ సెక్టార్ రంగాలు, వ్యూహాత్మక డీఆర్‌డీఓ పరిశోధనా కేంద్రాలతో పాటు 1,500కి పైగా ఏరోస్పేస్, డిఫెన్స్



ఎంఎస్ఎంఈలు పనిచేస్తున్నాయని వివరించారు. అంతేకాకుండా 2025—26 ఆర్థిక సంవత్సరంలో తెలంగాణ ఏరోస్పేస్, రక్షణ రంగ ఎగుమతుల్లో ఏకంగా 100 శాతం వృద్ధి నమోదు చేసిందని గుర్తుచేశారు. తెలంగాణ ప్రతిపాదనలపై కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సానుకూలంగా స్పందిస్తూ, హైదరాబాద్—బెంగళూరు డిఫెన్స్ కారిడార్ మంజూరు అంశాన్ని విధంగా పరిశీలిస్తామని హామీ ఇచ్చారు.




# సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఆశయాలను కొనసాగించాలి



- మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్
- పాపన్న గౌడ్ 376వ జయంతి వేడుకలు
- రవీంద్ర భారతిలో ఘనంగా కార్యక్రమం

**హైదరాబాద్, వెలుతురు, ఆగస్టు 10:**

హైదరాబాద్ రవీంద్ర భారతిలో నిర్వహించిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి కార్యక్రమానికి మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఆసియా ఖండంలోనే తొలి చక్రవర్తిగా, బహుజన నాయకుడిగా చరిత్రలో ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారని అన్నారు. సామాజిక సమానత్వం, బహుజనుల ఆత్మగౌరవం కోసం ఆయన చేసిన పోరాటాన్ని నేటి తరానికి తెలియజేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.




# దళిత క్రిస్టియన్లకు ఎస్సీ హోదా కల్పించాలి

**ఢిల్లీ, వెలుతురు, ఆగష్టు 10:**

దళిత క్రిస్టియన్లకు ఎస్సీ హోదా కల్పించాలని డిమాండ్ చేస్తూ న్యూఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద తెలంగాణ క్రిస్టియన్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. 1950 రాష్ట్రపతి ఉత్తర్వులను రద్దు చేసి, ఈ పార్లమెంట్ సమావేశాల్లోనే దళిత క్రిస్టియన్లకు ఎస్సీ హోదా కల్పించే బిల్లు ప్రవేశపెట్టాలని నాయకులు డిమాండ్ చేశారు.ఈ ధర్నాకు బీఆర్ఎస్ పార్టీ పార్లమెంటరీ డిప్యూటీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర హాజరై సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళిత క్రిస్టియన్లకు ఎస్సీ హోదా కల్పించే బిల్లుకు బీఆర్ఎస్ పార్టీ అండగా నిలిచి పోరాడుతుందని అన్నారు. గతంలో కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో దళిత క్రిస్టియన్లకు ఎస్సీ హోదా కల్పించాలని తెలంగాణ అసెంబ్లీలో




తీర్మానం చేసి కేంద్రానికి పంపిన విషయాన్ని గుర్తు చేశారు.మతం మారినంత మాత్రాన దళితులపై సామాజిక వివక్ష, కుల వివక్ష మారదని, ఎస్సీ హోదా సాధించే వరకు పోరాటం ఆగదని బీఆర్ఎస్ పార్టీ జనరల్ సెక్రెటరీ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, మాజీ కార్పొరేషన్ చైర్మన్ రాజీవ్ సాగర్, ప్రొ. గాలి వినోద్ కుమార్ తదితరులు స్పష్టం చేశారు.



# అతిగా ఆలోచిస్తే.. మీ పనైపోయినట్లే

ప్రస్తుత గజిబిజీ జీవితంలో అంతా యాంత్రికంగా మారిపోయింది. ఉదయం లేచించి మొదుల రాత్రి పడుకునే వరకు ఒత్తిడితో సావాసం చేయకతప్పని పరిస్థితి. దీంతో ఇది మానసిక సమస్యలకు సైతం దారి తీస్తోంది. ముఖ్యంగా అతిగా ఆలోచించే వారి సంఖ్య పెరుగుతోంది. చిన్న సమస్యను కూడా పెద్దగా ఆలోచిస్తున్నారు. కాలికి దెబ్బ తగిలినా.. ఏదో జరిగిపోతోందని ఆందోళన చెందుతున్నారు. ఇలా అతిగా ఆలోచించడం కూడా మానసిక సమస్యకు సంకేతంగా నిపుణులు చెబుతున్నారు. అతిగా ఆలోచించడం వల్ల ఎన్నో రకాల ఇతర సమస్యలకు దారి తీస్తుందని అంటున్నారు. ఈ కారణంగా నిద్రలేమి, తలనొప్పి, అధిక రక్తపోటుతో పాటు ఇత శారీరక సమస్యలు వస్తాయని నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా ఆందోళన, గుండెదడ పెరగడం ఇలాంటివన్నీ అతిగా ఆలోచించడం తాలుకూ లక్షణంగా చెప్పొచ్చు. అయితే అతిగా ఆలోచించడాన్ని క్రమంగా తగ్గించుకోవాలని నిపుణులు చెబుతున్నారు. అతిగా ఆలోచించడం సమస్య నుంచి బయటపడాలంటే.. యోగా, మెడిటేషన్ వంటి వాటిని అలవాటు చేసుకోవాలని నిపుణులు చెబుతున్నారు. ప్రతీ రోజూ కచ్చితంగా 15 నుంచి 20 నిమిషాలైనా కళ్లు మూసుకొని శ్వాసపై ధ్యాస పెట్టాలి. ప్రతికూల ఆలోచనల నుంచి బయటకు వచ్చేందుకు మార్గాలను అన్వేషించాలి. ఏదో జరిగిపోతుందన్న భయం నుంచి బయటకు రావాలి. ఇక సాధారణంగా అతిగా ఆలోచించడానికి ప్రధాన కారణాలు.. గతం గురించి బాధ పడడం లేదా భవిష్యత్తు గురించి ఆందోళన చెందడమే ఉంటాయి. అందుకే ప్రస్తుతంలో జీవించడాన్ని అలవాటుగా మార్చుకోవాలి. అన్ని బాధలను వదిలేసి వర్తమానాన్ని ఆస్వాదించడం అలవాటు చేసుకోవాలి. ప్రస్తుత కాలాన్ని పూర్తిగా ఆస్వాదించాలి. ఎప్పుడూ ఒక్కరే ఒంటరిగా ఉండకూడదు. నలుగురితో కలిసి జీవించడాన్ని అలవాటు చేసుకోవాలి. పాజిటివ్ ఆలోచనతో ముందుకు వెళ్లాలి. మీ సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరించే దిశగా అడుగులు వేయాలి. సమస్యల గురించి ఆలోచించి బాధపడేకంటే వాటి పరిష్కారం దిశగా ఆలోచించాలని మానసిక నిపుణులు చెబుతున్నారు. దీర్ఘకాలంగా ఇలాంటి సమస్యతో బాధపడుతున్నట్లయితే.. ఎలాంటి సందేహం లేకుండా మానసిక నిపుణులను సంప్రదించాలి. వారి వీటికి సరైన చికిత్స అందిస్తారు.





# డిప్రెషన్ లక్షణాలు ఇవే.. మీలో ఉన్నాయా? తెలుసుకోండి

డిప్రెషన్ ఇప్పుడు ప్రపంచం మొత్తం ఎక్కడ చూసినా ఈ సమస్యే గురించే చర్చ జరుగుతోంది. దాదాపు ప్రపంచవ్యాప్తంగా 28 కోట్ల మంది ఈ సమస్యతో బాధపడుతున్నట్లు ఓ అంచనా ఉంది. అయితే ఇంత తీవ్రమైన డిప్రెషన్ సమస్య అసలు ఎందుకు వస్తుంది? దీని లక్షణాలు ఏమిటో ఈ కథనంలో తెలుసుకుందాం.. డిప్రెషన్ అనేది చిన్న సమస్య కాదు. ఇది ఒక తీవ్రమైన మానసిక రుగ్మత. తమకు తెలియకుండానే ఆ వ్యాధి బారిన పడి అర్ధాంతరంగా ప్రాణాలు తీసుకుంటున్న వారి సంఖ్య ఎక్కువగానే ఉంది. శారీరక సమస్యలు, గాయాలు బయటికి కనిపిస్తాయి. వాటిని వైద్యులు గుర్తించగలరు, కానీ డిప్రెషన్ వంటి మానసిక సమస్యలు గుర్తించడానికి ఎక్కువ సమయం పడుతుంది. ఈ లోపే కొంతమంది డిప్రెషన్ వల్ల కలిగే ఒత్తిడిని తట్టుకోలేక మరణిస్తున్నారు. ది కాన్ఫరెన్స్ బోర్డ్ డేటా చెబుతున్న ప్రకారం ప్రపంచవ్యాప్తంగా 28 కోట్ల మంది ప్రజలు డిప్రెషన్ తో బాధపడుతున్నారు. అమెరికాలో ఉద్యోగం చేస్తున్న వారిలో 34 శాంతం మంది ఈ డిప్రెషన్ బారిన పడినట్టు గణాంకాలు చెబుతున్నాయి. ఇంట్లో కార్యాలయంలో ఉన్న పని ఒత్తిడి వల్లే అధికంగా వారికి డిప్రెషన్ వస్తున్నట్లు కూడా అధ్యయనాలు వివరిస్తున్నాయి.

## చికిత్స అవసరమేనా?

డిప్రెషన్ కు కచ్చితంగా చికిత్స తీసుకోవాలి. ఇది ఒక వైద్య పరిస్థితి గానే చెబుతారు నిపుణులు. ఇది శారీరక సమస్యలతో పాటు భావోద్వేగ సమస్యలకు కారణం అవుతుంది. రోజువారీ జీవితాన్ని కూడా ప్రభావితం చేస్తుంది. దీనికి మెరుగైన వైద్యం అందుబాటులో ఉంది. కాబట్టి డిప్రెషన్ లక్షణాలు ఉన్నవారు కచ్చితంగా మానసిక వైద్యులను కలిసి తగిన చికిత్స తీసుకుంటే సంతోషకరమైన జీవితాన్ని గడపగలరు.

## లక్షణాలు ఏమిటి?

డిప్రెషన్ బారిన పడినవారు శక్తి లేనట్టు వ్యవహరిస్తారు. తమలో తామే కుంగిపోతారు. ఎక్కువ సమయంపాటూ అలసిపోయినట్టు కనిపిస్తారు. ఎక్కువగా నిద్రపోవడం లేదా తక్కువగా నిద్రపోవడం వంటివి చేస్తారు. వారికి ఏ పని పైనా ఆసక్తి ఉండదు. బరువు విపరీతంగా పెరిగిపోతారు. లేదా తగ్గిపోతారు. ఏకాగ్రత వారిలో లోపిస్తుంది. ఖాళీగా కూర్చోవడానికి ఇష్టపడతారు. అలా కూర్చున్నప్పుడు కూడా విచారంగా ఉంటారు. వారిలో అప్పుడప్పుడు ఆత్మహత్య ఆలోచనలు కూడా వస్తూ ఉంటాయి. అలాగే తమకు ఆత్మ గౌరవం లేదని, ప్రజలు తమకు విలువ ఇవ్వడం లేదని భావిస్తూ ఉంటారు. చిన్న చిన్న విషయాలకే చిరాకు పడతారు. ఇంట్లో వారిపై అరుస్తూ ఉంటారు. మీకు తెలియ కుండానే మీలో ఇలాంటి లక్షణాలు వచ్చాయేమో తెలుసుకోండి. మీ అతి కోపానికి, అతి చిరాకుకు, పెరుగుతున్న బరువుకు, నిద్రలేమికి, నీరసానికి కారణం డిప్రెషన్ కూడా కావచ్చు. డిప్రెషన్ బారిన పడడానికి ఎన్నో రకాల కారణాలు ఉన్నాయి. మెద డులోని రసాయన స్థాయిల్లో అసమతుల్యత ఏర్పడినా కూడా మూడ్ డిజార్డర్స్ అనేవి వస్తాయి. ఇవి డిప్రెషన్ కు దారితీస్తాయి. అలాగే జీవితంలో ప్రియమైన వ్యక్తిని కోల్పో వడం, ఏదైనా అసాధారణ సంఘటనలు జరగడం, ఉద్యోగం లేకపోవడం వంటివి కూడా డిప్రెషన్ కు దారితీస్తాయి. కొన్నిసార్లు కుటుంబ వారసత్వంగా కూడా డిప్రెషన్ వచ్చే అవకాశం ఉంది.



# సర్వాయి పాపన్న గౌడ్ ఆశయాలను భావితరాలకు అందించాలి...






(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా "మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. సర్వాయి పాపన్న గౌడ్ కేవలం ఒక యోధుడు మాత్రమే కాదని, అణగారిన వర్గాల హక్కుల కోసం, సామాన్య ప్రజల గౌరవం కోసం పోరాడిన ప్రజా నాయకుడని పేర్కొన్నారు. తన కాలంలో నెలకొన్న సామాజిక, ఆర్థిక అసమానతలను ఎదుర్కొంటూ ప్రజల్లో ఆత్మవిశ్వాసాన్ని నింపారని అన్నారు.ప్రజల కోసం పోరాడాలి.. అన్యాయాన్ని ఎదిరించాలి.. సమాజంలో సమానత్వాన్ని నెలకొల్పాలి అనే స్ఫూర్తిని సర్వాయి పాపన్న గౌడ్ తన జీవితంతో చాటిచెప్పారని మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. ఆయన ధైర్యం, నాయకత్వ లక్షణాలు, ప్రజల పట్ల ఉన్న నిబద్ధత నేటి తరానికి కూడా ఆదర్శంగా నిలుస్తాయని తెలిపారు.చరిత్రలో ఎన్నో గొప్ప పోరాటాలు జరిగినప్పటికీ, పలువురు మహనీయులకు తగిన గుర్తింపు లభించలేదని ఆయన పేర్కొన్నారు. అలాంటి మహనీయుల చరిత్రను వెలుగులోకి తీసుకురావడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. సర్వాయి పాపన్న గౌడ్ చరిత్రను భావితరాలకు అందించడంతో పాటు, ఆయన ఆశయాలను ఆచరణలో పెట్టాలని పిలుపునిచ్చారు.జయంతి ఉత్సవాలు కేవలం వేడుకలకే పరిమితం కాకూడదని, మహనీయుల ఆశయాలను జీవితంలో ఆచరించడమే వారికి అందించే నిజమైన నివాళి అని మహేష్ కుమార్ గౌడ్ అన్నారు.యువత సర్వాయి పాపన్న గౌడ్ జీవిత చరిత్రను అధ్యయనం చేయాలని, ఆయన చూపిన ధైర్యం, ఆత్మగౌరవం, నాయకత్వ స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు.

సమాజంలో సమానత్వం, సామాజిక న్యాయం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మధు గౌడ్, శ్రీనివాస్ గౌడ్, రామరావు గౌడ్, అరుణ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ఆగస్టు 15న ఎర్రకోటపై వందేమాతరం గేయం ఆలాపన

**హైదరాబాద్ వెలుతురు ఆగస్టు 10:**

80వ స్వాతంత్ర్య దినోత్సవ సందర్భాల వేళ మొట్టమొదటి సారి వందేమాతర గేయాన్ని ఎర్రకోటపై ఆలపించనున్నారు. ప్రధాని మోదీ నేతృత్వంలో జరిగే సంబరాల్లో ఆ గేయాన్ని పాడనున్నారు. రక్షణ శాఖ కార్యదర్శి ఆర్కే సింగ్ దీనికి సంబంధించిన ప్రకటన చేశారు. వందేమాతరం గేయానికి 150 ఏళ్లు నిండిన సందర్భంగా కూడా ఈ ప్రత్యేక గీతాలాపన చేపట్టనున్నారు. యువశక్తి ఫోకస్‌తో స్వాతంత్ర్య దినోత్సవ సంబరాలను నిర్వహించనున్నారు. బంకించంద్ర ఛటర్జీ తొలుత 1875లో వందేమాతరం గేయాన్ని రచించారు. తర్వాత తన ఆనంద్‌మఠ్ నవలలో ఆ గేయాన్ని చేర్చారు. స్వాతంత్ర్యానంతరం నెహ్రూ ప్రభుత్వం వందేమాతరాన్ని జాతీయ గేయంగా ప్రకటించింది. ఇటీవలే పార్లమెంట్‌లో వందేమాతరం గేయంకు సంబంధించిన బిల్లును పాస్ చేశారు. ఆ చట్టం ప్రకారం.. వందేమాతరం గేయాన్ని అవమానిస్తే మూడేళ్ల వరకు జైలు శిక్ష విధిస్తారు. కొన్నిసార్లు జరిమానా కూడా విధిస్తారు. వందేమాతరం రాసి 150 ఏళ్లు పూర్తైన సందర్భంగా ఈ బిల్లును, ఆ గేయానికి గౌరవ సూచకంగా ఈ బిల్లును కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చింది.



# తెలుగు అమ్మాయిలకి అవకాశాలు తక్కువ..



## భావోద్వేగానికి గురైన కామాక్షి భాస్కర్ల

కామాక్షి భాస్కర్ల, శ్రవణ్ రెడ్డి ప్రధానపాత్రల్లో ఎమ్మెస్ రాజు దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'అగధ'. ఆగస్టు 14న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో చిత్రబృందం ప్రీ రిలీజ్ ఈవెంట్‌ని నిర్వహించింది. ఈ సందర్భంగా కామాక్షి భాస్కర్ల మాట్లాడారు. తెలుగు ఇండస్ట్రీలో.. తెలుగు అమ్మాయిలకి అవకాశాలు తక్కువని భావోద్వేగానికి గురయ్యారు.

''నాకు ఈ అవకాశం రావడానికి దాదాపు తొమ్మిదేళ్లు పట్టింది. అది కూడా రాజుగారి వల్లే సాధ్యమైంది. తెలుగు ఇండస్ట్రీలో తెలుగు అమ్మాయిలకి అవకాశాలు రావడమే చాలా తక్కువ. అది అందరికీ తెలిసిందే. ఈ విషయంలో ఇప్పుడిప్పుడే కొంచెం మార్పు వస్తోంది. నాకు ఈ అవకాశాన్ని కల్పించినందుకు రాజుగారికి ఎప్పుడూ రుణపడి ఉంటాను '' అని ఆమె చెప్పారు. ఉల్కా గుప్తా, జోవికా విజయ్ కుమార్ ఈ మూవీలో ప్రధాన పాత్రలు పోషించారు.

# రెహమాన్ కుమారుడికి గాయాలు



ప్రముఖ సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్ కుమారుడు అమీన్ రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. ఈ ప్రమాదంలో అమీన్‌తో పాటు ఆయన మిత్రుడికి గాయాలయ్యాయి. చెన్నైలో సోమవారం ఈ సంఘటన చోటుచేసుకుంది. ఆ వివరాల్లోకి వెళితే.. సోమవారం తెల్లవారుజామున అమీన్ తన పోర్షే కారులో మిత్రుడితో కలిసి గిండి వైపు వెళుతున్నారు. గిండి సమీపంలోని ఒలంపియా టెక్ పార్క్ సిగ్నల్ వద్ద 3.30 గంటల ప్రాంతంలో వాగాన్ ఆర్ కారు అమీన్ ప్రయాణిస్తున్న కారును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అమీన్, ఆయన మిత్రుడికి స్వల్ప గాయాలయ్యాయి.

స్థానికులు చికిత్స నిమిత్తం ఇద్దరినీ కావేరీ ఆస్పత్రికి తరలించారు. చికిత్స అనంతరం వారు ఆస్పత్రినుంచి డిశ్చార్జ్ అయి ఇంటికి వెళ్లిపోయారు. వాగాన్ ఆర్ కారులో ప్రయాణిస్తున్న ఓ వ్యక్తికి కూడా గాయాలు అయ్యాయి. అతడిని కలైంగర్ సెంటెనరీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స అనంతరం అతడు కూడా ఇంటికి వెళ్లిపోయాడు. అడయార్ ట్రాఫిక్ ఇన్వెస్టిగేషన్ వింగ్ పోలీసులు రెండు వాహనాలను సీజ్ చేశారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

# మలయాళంలోకి రుక్మిణి...



గతేడాది 'మదరాసి', 'కాంతార చాప్టర్ 1' లాంటి చిత్రాలలో వైవిధ్యమైన పాత్రల్లో మెరిసి.. ప్రేక్షకుల్ని అలరించింది అందాల తార రుక్మిణీ వసంత్. త్వరలోనే 'టాక్సిక్' సినిమాతో సినీప్రియుల్ని పలకరించడానికి సన్నద్ధమవుతోంది. భాషతో సంబంధం లేకుండా అలరిస్తున్న ఆమె ఇప్పుడు మలయాళ చిత్రసీమలోకి అడుగుపెడుతోంది. కథానాయకుడు నివిన్ పౌలీ తదుపరి చిత్రంలో రుక్మిణి నాయికగా నటిస్తున్నట్లు ఆదివారం సామాజిక మాధ్యమాల వేదికగా వెల్లడించింది చిత్రబృందం. 'జయ జయ జయ జయ హే' చిత్రంతో మంచి హిట్ అందుకున్న దర్శకుడు నషిద్ ఫామి ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. మార్టిన్ ప్రక్కట్ ఫిల్మ్స్, పౌలీ జూనియర్ పిక్చర్స్ నిర్మిస్తున్నాయి. రొమాంటిక్ కామెడీగా రూపొందుతున్న ఈ సినిమాలో అజు వర్గీస్ కీలక పాత్ర పోషిస్తున్నారు.

# 'నేను ఆడుతూనే ఉంటాను, మిగతాది సెలెక్టర్ల నిర్ణయం': భువనేశ్వర్ కుమార్




భారత జట్టు సీనియర్ స్వింగ్ పేసర్ భువనేశ్వర్ కుమార్ తన అంతర్జాతీయ క్రికెట్ పునరాగమనం మరియు భవిష్యత్తు ప్రణాళికలపై కీలక వ్యాఖ్యలు చేశారు.

అంతర్జాతీయ జట్టులో స్థానం దక్కడం, దక్కకపోవడం అనేది పూర్తిగా సెలెక్షన్ కమిటీ నిర్ణయంపై ఆధారపడి ఉంటుందని, మైదానంలోకి దిగి ఆడుతూ ఉండటమే తన బాధ్యత అని ఆయన స్పష్టం చేశారు.

ఇటీవల ఓ మీడియా సమావేశంలో తన రీఎంట్రీ గురించి అడిగిన ప్రశ్నకు భువీ బదులిస్తూ.. "క్రికెట్ ఆడటం నా పని. శారీరకంగా ఫిట్‌గా ఉంటూ నా బౌలింగ్‌ను ఆస్వాదించడం వరకే నా చేతుల్లో ఉంటుంది. మిగతాది, నన్ను జట్టులోకి ఎంపిక చేయాలా వద్దా అనేది పూర్తిగా సెలెక్టర్ల కాల్. దాని గురించి నేను ఎక్కువగా ఆలోచించను" అని వ్యాఖ్యానించారు.

టీమిండియా తరపున ఎన్నో చిరస్మరణీయ విజయాల్లో భాగమైన ఈ స్వింగ్ మాస్టర్, ప్రస్తుతం డొమెస్టిక్ క్రికెట్‌లో నిలకడగా రాణిస్తూ యువ బౌలర్లకు మార్గదర్శకంగా నిలుస్తున్నారు. భారత జట్టులో కొత్త పేసర్లకు అవకాశాలు ఇస్తున్నప్పటికీ, భువీ తన అనుభవంతో ఎప్పుడూ సిద్ధంగానే ఉన్నానని పరోక్షంగా స్పష్టం చేశారు.

# టీమిండియా పిలుపుపై సర్ఫరాజ్ ఖాన్ మొదటి స్పందన

**సోషల్ మీడియాలో వైరల్ పోస్ట్!**

గాయం కారణంగా శ్రీలంక టెస్టు సిరీస్‌కు దూరమైన సాయి సుదర్శన్ స్థానంలో భారత టెస్టు జట్టులోకి రీకాల్ పొందిన ముంబై ధాకడ్ బ్యాటర్ సర్ఫరాజ్ ఖాన్ తన ఆనందాన్ని సామాజిక మాధ్యమాల ద్వారా పంచుకున్నారు. సుదీర్ఘ కాలం పాటు టీమిండియా పునరాగమనం కోసం వేచి చూసిన ఆయన, బిసిసిఐ ఎంపిక ప్రకటన వెలువడిన వెంటనే సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు.



సర్ఫరాజ్ ఖాన్ తన ఇన్స్టాగ్రామ్ ఖాతాలో భారత జట్టు అధికారిక ట్రావెలింగ్ జెర్సీని ధరించిన కొన్ని ఫోటోలను షేర్ చేశారు. ఇందులో అత్యంత ప్రత్యేకమైన విషయం ఏంటంటే.. తన క్రికెట్ ప్రయాణంలో నిరంతరం మార్గదర్శిగా ఉన్న తండ్రి కమ్ కోచ్ నౌషాద్ ఖాన్‌తో కలిసి కూర్చున్న చిత్రాన్ని కూడా పోస్ట్ చేశారు. ఎలాంటి క్యాప్షన్ ఇవ్వకపోయినప్పటికీ, ఆ చిత్రాలు ఆయన సుదీర్ఘ నిరీక్షణ, పట్టుదల, సంతోషాన్ని స్పష్టంగా చాటిచెప్పాయి.

భారత్ తరపున ఇప్పటివరకు 6 టెస్టులాడి 371 పరుగులు చేసిన సర్ఫరాజ్, చివరిసారిగా 2024 చివర్లో న్యూజిలాండ్ సిరీస్‌లో ఆడాడు. ఆ తర్వాత జట్టులో స్థానం కోల్పోయినప్పటికీ, ఫిట్‌నెస్‌పై దృష్టి సారించి భారీగా బరువు తగ్గడంతో పాటు డొమెస్టిక్ క్రికెట్‌లో నిలకడగా పరుగులు సాధించి సెలెక్టర్ల దృష్టిని ఆకర్షించాడు. ప్రస్తుతం కొలంబో చేరుకోనున్న సర్ఫరాజ్, ఆగస్టు 15న గాలే వేదికగా ప్రారంభమయ్యే తొలి టెస్టు మ్యాచ్‌కు ముందు భారత జట్టుతో కలవనున్నారు.

# 'ఆ ఘనత అంతా ఆయనకే దక్కుతుంది'

**బీసీసీఐ సీఓఈ ఏర్పాటులో జై షా పాత్రను గుర్తు చేసుకున్న వీవీఎస్ లక్ష్మణ్**

కర్ణాటక రాజధాని బెంగళూరులో బీసీసీఐ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మించిన సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీఓఈ) ఏర్పాటు వెనుక బిసిసిఐ మాజీ కార్యదర్శి, ప్రస్తుత ఐసీసీ ఛైర్మన్ జై షా పాత్ర మరచిపోలేనిదని భారత క్రికెట్ దిగ్గజం, సీఓఈ క్రికెట్ హెడ్ వీవీఎస్ లక్ష్మణ్ కొనియాడారు. ఈ ప్రాజెక్ట్ కల రూపుదిద్దుకోవడంలో ఆయన పడిన శ్రమ, చూపించిన శ్రద్ధ అభినందనీయమని లక్ష్మణ్ వ్యాఖ్యానించారు.



2021 డిసెంబరులో రాహుల్ ద్రవిడ్ భారత జట్టు ప్రధాన కోచ్‌గా బాధ్యతలు స్వీకరించిన సమయంలో, సౌరవ్ గంగూలీ, జై షాల పిలుపు మేరకు తాను హైదరాబాదు నుంచి బెంగళూరుకు మారి అకాడమీ బాధ్యతలు స్వీకరించినట్లు లక్ష్మణ్ గుర్తు చేసుకున్నారు. ప్రాజెక్ట్ నిర్మాణ సమయంలో జై షా పనితీరును ప్రత్యక్షంగా చూశానని చెప్పిన లక్ష్మణ్, "నేషనల్ క్రికెట్ అకాడమీ తాత్కాలిక ఏర్పాట్ల నుంచి ఆధునిక 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్' గా మారడంలో జై షా చూపిన చొరవ అద్భుతం. దాదాపు రెండేళ్ల స్వల్ప వ్యవధిలోనే ఆర్కిటెక్ట్‌లు, ఎల్ అండ్ టీ బృందంతో నిరంతరం సమావేశాలు నిర్వహిస్తూ ప్రతీ విషయాన్ని ఆయన ప్రత్యక్షంగా పర్యవేక్షించారు" అని తెలిపారు.

40 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న స్థలాన్ని క్రమబద్ధీకరించడం నుంచి న్యాయపరమైన అడ్డంకులను తొలగించడం వరకు ప్రతీ ఘట్టాన్ని యుద్ధప్రాతిపదికన పూర్తి చేశారని బిసిసిఐ సెక్రటరీ దేవజిత్ సైకియా కూడా ఈ సందర్భంగా గుర్తుచేశారు. నాయకులకు ఆలోచనలు ఉండటం సాధారణమే అయినప్పటికీ, ఆ ఆలోచనను నిమిషాల వ్యవధిలో మైదానంలో నిజం చేసి చూపించినప్పుడే దానికి సార్థకత లభిస్తుందని, 2024 నవంబర్ నుంచి అందుబాటులోకి వచ్చిన ఈ సీఓఈ దానికి నిదర్శనమని లక్ష్మణ్ స్పష్టం చేశారు.

Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICATIONS H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609. Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com